సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 6.50

సంపుటి: 16 | సంచిక: 293

శనివారం | 6-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



కుర్రాళ్లతో కొత్తగా..

భారత్, జింబాబ్వే సిరీస్ సమరం.. నేడు తొలి టీ20 మ్యాచ్ - 13లో



సరికొత్త శిఖరంపై నిఫ్టీ

రికార్డు స్థాయి నుంచి సెన్సెక్స్ వెనక్కి.. మిశ్రమంగా ముగిసిన 'స్టాక్' - 13లో



'రాజకీయం' చేయదల్చుకోలేదు

యూపీ తొక్కిసలాట ఘటనపై రాజకీయం చేయదల్చుకోలేదని బాధితుల కుటుంబాలను పరామర్శించిన రాహుల్ అన్నారు. వివరాలు 6లో ▸



ఆగస్ట్ 11న నీట్-పీజీ పరీక్ష

నీట్–పీజీ 2024 ప్రవేశ పరీక్షను ఆగస్ట్ 11వ తేదీన రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ తెలిపింది. వివరాలు 6లో ▸



త్వరలో జమ్మూకశ్మీర్ ఎన్నికలు!

అమర్‌నాథ్ యాత్ర ముగిసిన తర్వాత జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అమిత్ షా ఆ రాష్ట్ర పార్టీ నేతలతో చెప్పారు. వివరాలు 6లో ▸



రూ.100 కోట్లకుపైగా ఆస్తులు

హత్రాస్ తొక్కిసలాటలో 121 మంది మరణానికి కారణమైన భోలే బాబాకు రూ.100 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నట్లు సమాచారం. వివరాలు 6లో ▸

ఏదీ మా 'నిధి'?

రూ.1,500 సాయం కోసం ఆశగా అక్కచెల్లెమ్మల ఎదురు చూపులు

ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లు

- పింఛనుదార్లను మినహాయించినా.. 1.72 కోట్ల మంది మహిళలు సాయానికి అర్హులే
- డబ్బులందక ఇప్పటికే జూన్‌లో రూ.2,588 కోట్లు నష్టపోయిన వైనం
- పోనీ భవిష్యత్తులోనైనా బకాయిలతో కలిపి చెల్లిస్తారా?.. ఇంటింటా ఆందోళన
- 19 - 59 ఏళ్ల మహిళలందరికీ ప్రతి నెలా ఇస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో కూటమి వాగ్దానం
- ఏడాది ముందే చంద్రబాబు సంతకంతో ఇంటింటికీ గ్యారెంటీ కార్డుల పంపిణీ
- బాబు రావటమే ఆలస్యం.. 'ఆడబిడ్డ నిధి' నుంచి ఇస్తారంటూ నమ్మబలికిన టీడీపీ నేతలు.. 2014లో రైతన్నలకు, పొదుపు మహిళలకు ఇచ్చిన హామీలూ తుంగలోకి..
- బాబు హామీల అమలుకు తనది గ్యారంటీ అని చివరకు మొహం చాటేసిన జనసేనాని



సాక్షి, అమరావతి: కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందచేస్తామన్న సీఎం చంద్రబాబు ఇంతవరకూ ఆ హామీ అమలు ఊసే ఎత్తకపోవడం, తొలి సంతకాలలో ఆ ప్రస్తావనే లేకపోవడం, ఇప్పటికే జూన్‌లో సాయం అందక నష్టపోయిన నేపథ్యంలో కనీసం బకాయిలతో కలిపి అయినా చెల్లిస్తారా? అనే ఆందోళన కోట్లాది మంది అక్కచెల్లెమ్మల్లో వ్యక్తమవుతోంది. 19 – 59 ఏళ్ల వయసు మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని టీడీపీ – జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజాగళంలో హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్లు తీసుకుంటున్న దాదాపు 38 లక్షల మంది మహిళలను మినహాయించినా కూటమి మేనిఫెస్టో ప్రకారం 1.72 కోట్ల మందికిపైగా అక్క చెల్లెమ్మలు రూ.1,500 చొప్పున ప్రతి నెలా సాయం పొందేందుకు అర్హులని స్పష్టమవుతోంది. ఈ హామీ అమలులో జరుగుతున్న జాప్యంతో

మిగతా 2వ పేజీలో ▶



విశాఖలోని రుషికొండ ఐటీ సెజ్

అమ్మో ఏపీకా?

వద్దు బాబోయ్.. అంటూ ముఖం చాటేస్తున్న ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు

విశాఖకు వచ్చినట్లే వచ్చి వెళ్లిపోయిన ప్రముఖ సంస్థ క్యాప్‌జెమినీ

ప్రస్తుతం నెలకొన్న ఆందోళనకర పరిస్థితులకు జడిసిన ఐటీ దిగ్గజం

రూ.1000 కోట్లతో చెన్నైలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

5 వేల మంది ఉద్యోగులతో నడిచేలా 2027 నాటికి ఏర్పాటు

విశాఖలో ఉండాల్సిన కంపెనీ తరలిపోవడానికి టీడీపీ అరాచకాలే కారణం

వరుస దాడులతో బెంబేలెత్తుతున్న వివిధ సంస్థల ప్రతినిధులు

ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి రోజూ విధ్వంసాలే

పరిశ్రమలపైనా దాడులు, వ్యాపారులకు బెదిరింపులు

శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యునైటెడ్ బ్రూవరీస్ ఫ్యాక్టరీపై దాడి

మామూళ్లివ్వలేదని దాల్మియా సిమెంట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ధ్వంసం

మేం ఫలానా వాళ్ల తాలూకా అంటూ వాహనాలపై పేర్లు రాసుకుని బెదిరింపులు

2లో

న్యూస్‌రీల్

దేవాలయ ఆస్తుల ధ్వంసం



టీడీపీ నేతలు దేవాలయ ఆస్తులను ధ్వంసం చేశారని చంద్రగిరి వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జామాండ్ల వీధికి చెందిన శ్రీరామ భజన మందిరం నిర్వాహణ కోసం ఆలయ ప్రాంగణంలో ఉన్న 3 షాపులను నిర్మించగా..వీటిని స్థానిక టీడీపీ నేతలు జేసీబీతో దౌర్జన్యంగా కూల్చివేశారు.

వివరాలు 5లో ▸

మండల పరిషత్ సమావేశంలో టీడీపీ బరితెగింపు



ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో టీడీపీ నేతల బరితెగింపు రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రొటోకాల్ ప్రకారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను అడ్డుకొన్నారు.

వివరాలు 14లో ▸

తొలి సీఎన్‌జీ బైక్ వచ్చేసింది

బజాజ్ ఆటో సీఎన్‌జీ బైక్ 'ఫ్రీడమ్ 125' ఆవిష్కరించింది. ప్రపంచంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ఆధారంగా నడిచే ద్విచక్ర వాహనం ఇదేనని కంపెనీ తెలిపింది. నిర్వహణ వ్యయం 50% తగ్గుతుందని తెలిపింది. ఎక్స్‌షోరూంలో దీని ధర రూ.95వేల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది.

వివరాలు 13లో ▸

విభజన అంశాలపై నేడు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

- వివరాలు 3లో

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్



అండగా నిలుస్తాం.. ధైర్యంగా ఉండండి

టీడీపీ అరాచకాలకు బలై ఊరు విడిచిన వారికి వైఎస్ జగన్ భరోసా

న్యాయ సాయం కోసం చర్యలు తీసుకోవాలని పార్టీ లీగల్ విభాగానికి ఆదేశం

జగన్‌ను కలిసిన మాజీ మంత్రి ముద్రగడ, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని వివరించిన పలువురు నాయకులు

టీడీపీ విధ్వంసం, దాడులపై బీబీసీలోనూ కథనం వచ్చిందని చర్చ

2లో

ఇక స్టార్మర్ శకం



బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం

- 650 స్థానాలకుగాను ఏకంగా 412 సీట్లు కైవసం..
- కన్జర్వేటివ్‌లకు ఘోర పరాజయం.. 121 సీట్లకే పరిమితం
- రిషి సునాక్ రాజీనామా, ప్రధానిగా స్టార్మర్

- వివరాలు 6లో

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు



అన్నమో చంద్రబాబూ!

అన్నం కోసం రోడ్డెక్కిన కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో ధర్నా

పురుగుల అన్నం, నీళ్ల సాంబారు తినలేకపోతున్నామని ఆవేదన

జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలు చేయకపోవడం వల్లే సమస్య అంటూ ఆగ్రహం

కర్నూలు(సెంట్రల్): ప్రతిష్టాత్మక కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్నం కోసం రోడ్డెక్కారు. కళాశాల హాస్టళ్లలో పెడుతున్న పురుగుల అన్నం, నీళ్ల సాంబారు తినలేక కడుపులు కాల్చుకుంటున్నామని కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో ధర్నాకు దిగారు. తమకు కలెక్టర్ వచ్చి న్యాయం చేసే వరకు కదిలేదిలేదని భీష్మించారు. చివరకు డీఆర్వో వచ్చి హామీ ఇవ్వడంతో కలెక్టరేట్ వద్ద ధర్నాను నిలిపివేశారు. విద్యార్థులు అక్కడి నుంచి వెళ్లి ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో ఘోరమైన పరిస్థితులు ఉన్నాయని

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు పులివెందుల పర్యటనకు వైఎస్‌ జగన్‌
8న వైఎస్సార్‌ జయంతి వేడుకల్లో పాల్గొననున్న జగన్‌

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (శనివారం) వైఎస్సార్‌ జిల్లా పులివెందుల పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 6న మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కడప ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని, అక్కడినుంచి రోడ్డు మార్గంలో పులివెందుల బయలుదేరి వెళతారు. మూడు రోజుల పాటు ఆయన పులివెందులలోనే ఉంటారు. 8న వైఎస్సార్‌ జయంతి వేడుకల్లో పాల్గొంటారు.

జ్యోతి యర్రాజీ, జ్యోతికశ్రీలకు వైఎస్‌ జగన్‌ అభినందన
ఒలింపిక్స్‌కు ఎంపిక కావడంపై హర్షం

సాక్షి,అమరావతి: పారిస్‌ ఒలింపిక్స్‌కు ఏపీకి చెందిన అథ్లెట్‌ జ్యోతి యర్రాజీ, జ్యోతికశ్రీ ఎంపిక కావడం గర్వంగా ఉందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌ పేర్కొన్నారు. ఈ ఇద్దరినీ శుక్రవారం వైఎస్‌ జగన్‌ 'ఎక్స్‌'లో అభినందించారు. జ్యోతి యర్రాజీ, డి.జ్యోతికశ్రీ 2024 పారిస్‌ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 'మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని గర్వాన్ని తెచ్చిపెట్టాయి. మన దేశ కీర్తి కోసం మీరు చేస్తున్న కృషి అభినందనీయం, మీ ఇద్దరికీ మంచి జరగాలని కోరుకుంటున్నా' అని వైఎస్‌ జగన్‌ పేర్కొన్నారు.

నాబార్డు ఏపీ సీజీఎంగా ఎంఆర్‌ గోపాల్‌



ఎంఆర్‌ గోపాల్‌కు అభినందనలు తెలియజేస్తున్న నాబార్డు అధికారులు

సాక్షి, అమరావతి: నాబార్డు ఆంధ్రప్రదేశ్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌గా ఎంఆర్‌ గోపాల్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడలో నాబార్డు అమరావతి సెల్‌ను ఏర్పాటు చేయగా, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్‌లోనే కొనసాగింది. ఉమ్మడి రాజధాని గడువు ఇటీవల ముగియడంతో విజయవాడలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు దిశగా నాబార్డు చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు హైదరాబాద్‌ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయంలో సీజీఎంగా ఉన్న ఎంఆర్‌ గోపాల్‌ను నాబార్డు ఏపీ ప్రాంతీయ కార్యాలయ సీజీఎంగా బదిలీ చేయడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

హంతకుడికి అనుకూలంగా సీబీఐ వాదనలా?

- ఇలాంటి ఘటన ఇంతవరకు ఎప్పుడూ చూడలేదు
- సీబీఐ కోర్టులో ఎంపీ అవినాశ్‌ తరఫు న్యాయవాది వాదనలు
- తనను సాక్షిగా పరిగణించాలని వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి పిటిషన్‌

సాక్షి, హైదరాబాద్‌: తానే హత్య చేశానని ఒప్పుకున్న ఓ హంతకుడికి అనుకూలంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వాదనలు వినిపించడం గతంలో ఎప్పుడూ చూడలేదని ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మాజీమంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇలా వ్యవహరిస్తే ఇక ఆ దర్యాప్తు ఎలా ఉంటుందో అర్థంచేసుకోవచ్చన్నారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్‌ సీబీఐ కోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరఫున అనిల్‌ తల్వార్‌ వాదనలు వినిపించగా.. అవినాశ్‌ తరఫున న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. చార్జిషీట్‌లలో నిందితుడిగా పేర్కొన్న వ్యక్తిని ఆ తర్వాత సాక్షిగా మార్చడం చట్టవిరుద్ధమన్నారు. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం సమర్థనీయం కాదన్నారు. ఈ పిటిషన్‌లో సీబీఐ ప్రతివాదిగా ఉందని.. అయితే, వారి న్యాయవాది మాత్రం పిటిషనర్‌ తరఫున వాదనలు వినిపించడం దారుణమన్నారు. వాదనలను పూర్తికావడంతో న్యాయమూర్తి తీర్పును ఈనెల 18కి వాయిదా వేశారు. న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, టీఎల్‌ నయన్‌కుమార్‌ రెడ్డి తదితరులు నిందితుల తరఫున వాదనలు వినిపించారు.

లక్ష్యం సాధించేలా యాక్షన్‌ ప్లాన్‌ నిర్దేశించుకోవాలి
నీతి ఆయోగ్‌ సీనియర్‌ కన్సల్టెంట్‌ నీతి అరోరా

పెనుగంచిప్రోలు: లక్ష్యాలను సాధించేలా యాక్షన్‌ ప్లాన్‌ నిర్దేశించుకుని పనిచేయాలని ఢిల్లీకి చెందిన నీతి ఆయోగ్‌ సీనియర్‌ కన్సల్టెంట్‌ నీతి అరోరా సూచించారు. ఎన్టీఆర్‌ జిల్లా పెనుగంచిప్రోలులో శుక్రవారం సంపూర్ణత అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు. సంపూర్ణత అభియాన్‌ కింద దేశంలో 500 మండలాలను ఎంపిక చేయగా, వాటిలో పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయని నీతి అరోరా తెలిపారు.

అమ్మో ఏపీకా?

వద్దు బాబోయ్‌.. అంటూ ముఖం చాటేస్తున్న ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు

సాక్షి, విశాఖపట్నం : పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ పేరు వింటేనే భయపడిపోతున్నారు. ఇక్కడ పెట్టుబడులు పెడదామనుకున్న వారు మరో దారి చూసుకుంటున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. బీచ్‌ ఐటీ కాన్సెప్ట్‌తో వెలుగులీనిన విశాఖ నగరం... ఇప్పుడు విలవిల్లాడుతోంది. ఒక్క విశాఖ నగరమే కాదు.. ఆంధ్రప్రదేశ్‌ వైపు ఐటీ పరిశ్రమలు రావాలంటేనే మొహం చాటేస్తున్నాయి. సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలంటే.. అమ్మో.. ఏపీకా.. అంటూ భయపడుతున్నాయి. నెల రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల్ని నిశితంగా పరిశీలిస్తున్న ఐటీ దిగ్గజాలు ఆంధ్రప్రదేశ్‌కు బై బై చెబుతున్నాయి. విశాఖలో డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ప్రారంభించేందుకు సుముఖంగా ఉన్న ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్‌జెమినీ ఇప్పుడు వెనకడుగు వేసి, చెన్నైకి చెక్కేసింది. ఆరు నెలలుగా విస్తరణ పనులు చురుగ్గా నిర్వహించిన విప్రో కూడా ఆలోచనలో పడింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దాడులు, విధ్వంసాలు, పారిశ్రామికవేత్తలకు బెదిరింపులు, హింసా వాతావరణంతో ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల ప్రతినిధులు, ఇతర పెట్టుబడిదారులు జంకుతున్నారు.



విశాఖపట్నంలోని రుషికొండ ఐటీ సెజ్‌

ఒక్కసారిగా కుదుపు

విభిన్నమైన ఐటీ పాలసీని మెచ్చి.. గత మూడేళ్లగా దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెడుతూ ముందుకొచ్చాయి. ఇన్ఫోసిస్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌, హెచ్‌సీఎల్‌, యాక్సెంచర్‌, రాండ్‌స్టాడ్‌, డబ్ల్యూఎన్‌ఎస్‌, అమెజాన్‌ వంటి సంస్థలు వరుసగా క్యూ కట్టాయి. దివంగత వైఎస్సార్‌ హయాంలో పురుడు పోసుకున్న విప్రో సంస్థ.. ఆరు నెలల క్రితం కార్యకలాపాలు విస్తృతం చేస్తున్నట్లు ప్రకటించింది. ఇలా.. దిగ్గజ కంపెనీలన్నీ.. ఏపీలో శాఖలు విస్తరించేందుకు అడుగులు వేస్తున్న తరుణంలో ఒక్కసారిగా కుదుపు ఏర్పడింది. ప్రభుత్వం మారిన తర్వాత.. ప్రశాంత వాతావరణం కాస్తా.. అశాంతి వాతావరణంగా మారడంతో అన్ని సంస్థలూ పునరాలోచనలో పడిపోయాయి. ఏపీలో అడుగు పెట్టాలంటేనే ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు భయపడిపోతున్నాయి. ఇందుకు క్యాప్‌జెమినీనే ఉదాహరణ.

అడుగడుగునా దాడులు.. బెదిరింపులు

నెల రోజులుగా రాష్ట్రంలో వరుస దాడులు అన్ని వర్గాల ప్రజలతో పాటు వ్యాపార దిగ్గజాలను బెంబేలెత్తిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపైనే కాకుండా వ్యాపార సంస్థలపై కూడా వరుస దాడులు జరిగాయి. రైస్‌ మిల్లులు, ఫ్యాక్టరీలను మూయిస్తున్నారు. నిన్నటికి నిన్న మామూళ్లివ్వలేదని దాల్మియా సిమెంట్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాలను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. 'మామూళ్లు ఇస్తేనే మీ లారీలు కదులుతాయి.. మీరు వ్యాపారం చేయాలంటే కప్పం కట్టాల్సిందే' అంటూ ట్రాన్స్‌పోర్ట్‌ సంస్థల యజమానులను టీడీపీ నాయకులు బెదిరించారు. నిజాయితీగా వ్యాపారం చేసుకుంటున్న తామెందుకు డబ్బులివ్వాలని ట్రాన్స్‌పోర్టు సంస్థల యజమానులు ప్రశ్నించడంతో ఏకంగా 11 లారీలను ధ్వంసం చేశారు. ఈ ఘటన వైఎస్సార్‌ జిల్లా వైఎస్సార్‌ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలంలో జరిగింది. ఇక్కడి దాల్మియా సిమెంట్‌ ఫ్యాక్టరీలోకి ప్రతిరోజూ వివిధ ట్రాన్స్‌పోర్ట్‌ కంపెనీలకు చెందిన వందలాది లారీలు సిమెంట్‌ రవాణా కోసం వస్తుంటాయి. కొన్ని రోజులుగా ఈ కంపెనీల యజమానులను టీడీపీ నాయకులు మామూళ్లు డిమాండ్‌ చేస్తున్నారు. వారు పట్టించుకోకపోవడంతో కక్ష పెంచుకుని లారెన్స్‌ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన 11 లారీల అద్దాలు పగులగొట్టి బీభత్సం సృష్టించారు. వెంటనే మామూళ్లు ఇవ్వకపోతే మిగతా కంపెనీల లారీలకూ ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఓ రైస్‌ మిల్లును మూయించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని యునైటెడ్‌ బ్రూవరీస్‌ ఫ్యాక్టరీపై దాడి చేశారు. ముడి సరుకు తీసుకొస్తున్న లారీలను ఆపేశారు. ఊరూరా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను పగులగొడుతున్నారు. ఊళ్లొదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. వ్యాపారాల్లో ఉచిత వాటాలు కోరుతూ.. ఒప్పుకోని వారిపై కక్షగట్టి దాడులు చేస్తున్నారు. మేం ఫలానా వాళ్ల తాలూకా.. మేం పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా.. మేం లోకేశ్‌ తాలూకా.. అంటూ బండ్లు, వాహనాలపై పేర్లు రాసుకుని బెదిరింపులకు దిగుతుండటం కళ్లెదుటే స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని చోట్ల బండ్ల నంబర్‌ ప్లేట్లు తీసేసి ఇలా రాసుకుని తిరుగుతూ వ్యాపారులను, ప్రజలను భయపెడుతున్నారు.

అందుకే పలు సంస్థలు మరో దారి

రాష్ట్రంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఇప్పటికే ఇక్కడకు రావాలని నిర్ణయించిన పలు సంస్థలు మరో దారి చూసుకుంటున్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టడం సాహసమే అవుతుందని ఆలోచిస్తున్నాయి. ద్వితీయ శ్రేణి నగరాల్లో డెవలప్‌మెంట్‌ సెంటర్లు ఏర్పాటు చేసే విషయమై.. దేశంలోని ఇతర నగరాలకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించుకున్నాయని ఐటీ వర్గాలు చెబుతున్నాయి. లక్నో, ఇండోర్‌, జైపూర్‌, కొచ్చి, నాగ్‌పూర్‌, చండీగఢ్‌ తదితర నగరాలవైపు అడుగులు వేస్తున్నాయి. విస్తరణ పనులు చురుగ్గా నిర్వహించిన విప్రో సంస్థ కూడా.. పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా విస్తరించేందుకు సిద్ధమవుతున్న సమయంలో రాష్ట్రంలో పరిస్థితి వారిని కలవరపెడుతోందని సమాచారం. కొన్నాళ్లు వేచి చూసి.. తదుపరి నిర్ణయం తీసుకోవాలని విప్రో ప్రతినిధులు భావిస్తున్నట్లు తెలిసింది. మరికొన్ని ఐటీ అనుబంధ సంస్థలు, బీపీవోలు కూడా విశాఖలో శాఖలు ఏర్పాటు చేయాలని భావించినా, తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయని ఐటీ రంగ ప్రముఖుడొకరు తెలిపారు. అధికార పార్టీ నేతల తీరు వల్ల ఐటీ రంగం మళ్లీ కునారిల్లే దుస్థితి వచ్చిందని ఐటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

విశాఖ కంటే.. చెన్నై బెటర్‌



క్యాప్‌జెమినీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐటీ సంస్థలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బీచ్‌ ఐటీ కాన్సెప్ట్‌తో ఆకర్షితులైన సంస్థలు తమ కార్యకలాపాల్ని సాగరనగరిలో విస్తరించేందుకు గతంలో సన్నద్ధమైంది. క్యాప్‌ జెమినీ సంస్థ కూడా తమ శాఖను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇందులో భాగంగా ఇతర నగరాల్లో కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ ఏడాది మార్చిలో ఉద్యోగుల మధ్య క్యాప్‌ జెమినీ సంస్థ సర్వే నిర్వహించింది. ఆ జాబితాలో వైజాగ్‌ని కూడా చేర్చింది. క్యాప్‌ జెమినీలో పని చేస్తున్న వారిలో ఇప్పటి వరకు సింహభాగం ఉద్యోగులు విశాఖను ఎంపిక చేసుకున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో కూడా ఇదే విధమైన సర్వే చేశారు. ఫిబ్రవరిలో క్యాప్‌ జెమిని సంస్థ ప్రతినిధులు సైతం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. త్వరలోనే విశాఖలో డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నట్లు క్యాప్‌జెమినీ సంస్థ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అయితే నెల రోజులుగా రాష్ట్రంలో పరిస్థితుల్ని పరిశీలించిన సంస్థ.. చెన్నైలో విస్తరణ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. రూ.1,000కోట్ల పెట్టుబడితో 5 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా 2027నాటికి డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సంస్థ గతంలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో అనుకూల వాతావరణం కనిపించి ఉంటే కచ్చితంగా ఈ సంస్థ శాఖ విశాఖలో విస్తరించేది. టీడీపీ, జనసేన నేతల దాడులు, విధ్వంస పర్వంతో రాష్ట్రంలో భీతావహ వాతావరణం ఏర్పడింది. ఎటు చూసినా విధ్వంసమే కనిపిస్తుండటంతో ఇది సరైన వేదిక కాదని మనసు మార్చుకుని క్యాప్‌జెమినీ సంస్థ ప్రతినిధులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని చెన్నై వెళ్లినట్లు తెలుస్తోంది.

అండగా నిలుస్తాం.. ధైర్యంగా ఉండండి

టీడీపీ అరాచకాలకు బలై ఊరు విడిచిన వారికి వైఎస్‌ జగన్‌ భరోసా

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో టీడీపీ విధ్వంసాలు, అరాచకాలకు బలై ఊరొదిలి పక్క రాష్ట్రాల్లో ఉంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలుస్తామని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. త్వరలోనే తిరిగి స్వస్థలాలకు వచ్చి ఇళ్లలో ఉండేలా న్యాయ పరమైన చర్యలకు ఉపక్రమిస్తామని చెప్పారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని పార్టీ లీగల్‌ సెల్‌ నేతలను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పార్టీ నేతలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వైఎస్‌ జగన్‌ను కలిసి వారి ప్రాంతాల్లోని పరిస్థితుల గురించి వివరించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. భవిష్యత్‌ కార్యాచరణపై వీరికి జగన్‌ దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం పల్నాడు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్న సంఘటనల గురించి కాసు మహేష్‌రెడ్డి జగన్‌కు వివరించారు. టీడీపీ వరుస దాడులతో పలువురు నేతలు, అభిమానులు పక్క రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు వలస వెళ్లారని చెప్పారు. ఆయా ప్రాంతాలకు వలస వెళ్లిన వారి తరఫున వచ్చిన ప్రతినిధులను జగన్‌కు పరిచయం చేస్తూ.. పరిస్థితిని వివరించారు. వారందరి కష్టాలు విన్న జగన్‌.. పార్టీ లీగల్‌ సెల్‌ ప్రతినిధులను పిలిపించి అక్కడికక్కడే పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఊరు విడిచి వలస వెళ్లిన వారంతా తిరిగి ఊళ్లకు వచ్చేలా న్యాయ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని చెప్పారు. కాగా, టీడీపీ దాడులతో ఎంతో మంది ఊళ్లు వదిలారని బీబీసీలో వచ్చిన కథనం గురించి ఈ భేటీలో చర్చకు వచ్చింది.



తాడేపల్లిలోని క్యాంప్‌ కార్యాలయంలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

జగన్‌ పర్యటనను విఫలం చేసేందుకు
ప్రభుత్వం యత్నం

- జగన్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గలేదని నెల్లూరు పర్యటన రుజువు చేసింది
- ప్రభుత్వం, సీఎం చంద్రబాబు లేకి బుద్ధితో వ్యవహరించారు
- నిబంధనల ప్రకారమే ములాఖత్‌కు అనుమతి
- హోం మంత్రి మాటలు సరికాదు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి నెల్లూరు పర్యటనను విఫలం చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. వైఎస్‌ జగన్‌కు ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదని నెల్లూరు పర్యటన రుజువు చేసిందని తెలిపారు. గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్‌ జగన్‌ పర్యటన విషయంలో ప్రభుత్వం, సీఎం చంద్రబాబు లేకి బుద్ధితో వ్యవహరించారని అన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ చేపట్టిన నెల్లూరు పర్యటన ఖరారు కాగానే పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో హెలికాప్టర్‌ దిగేందుకు అనుమతివ్వాలని కలెక్టర్‌ ద్వారా ఎస్పీని కోరామన్నారు. ఎస్పీ సెలవులో ఉన్నానని చెప్పగా, ఇన్‌చార్జి అయిన ప్రకాశం జిల్లా ఎస్పీని కోరితే ఉన్నతాధికారులను అడగమన్నారని తెలిపారు. డీజీపీతో మాట్లాడితే గతంలో ఎక్కడ ఇచ్చారని అడిగారని, చివరికి పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో అనుమతిని నిరాకరించారని తెలిపారు. అతి కష్టం మీద కనుపర్తిపాడులోని జెడ్పీ హైస్కూల్‌ ఆవరణలో హెలికాప్టర్‌ దిగేందుకు అనుమతిచ్చారని చెప్పారు.

నామమాత్రపు భద్రత

వైఎస్‌ జగన్‌ కోసం ప్రజలు, కార్యకర్తలు వస్తారని తెలిసినా భద్రత నామమాత్రంగా ఇచ్చారని ఆరోపించారు. భద్రత వైఫల్యం కారణంగానే అనేక మంది హెలికాప్టర్‌ వద్దకు వచ్చారన్నారు. జగన్‌ 25 నిమిషాల్లో ల్యాండ్‌ అవుతారనగా జైల్‌ సూపరింటెండెంట్‌, అధికారులు ఫోన్‌ చేసి ములాఖత్‌ రద్దయిందని చెప్పారని తెలిపారు. ఎందుకు రద్దు చేశారో చెప్పాలని, మాజీ సీఎం జగన్‌తో సహా తామందరం జైలు వద్దకే వస్తామని చెప్పడంతో అర్ధగంట అనంతరం ములాఖత్‌కు అనుమతించారని చెప్పారు. వైఎస్‌ జగన్‌ వస్తే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులకు ధైర్యం వస్తుందన్న కారణంతోనే ఇలా అడ్డంకులు సృష్టించారని మండిపడ్డారు. జగన్‌ విలేకరుల సమావేశంలో అన్ని విషయాలపై మాట్లాడారని, దీనిపై కొందరు ఏవేవో మాట్లాడుతున్నారని, వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. ఉదారంగా వ్యవహరించామని హోం మంత్రి అనడం శోచనీయమన్నారు. నిబంధనల ప్రకారం ములాఖత్‌కు అనుమతిచ్చారని, ఉదారంగా ఎవరూ వ్యవహరించలేదని తెలిపారు. జగన్‌ మాట్లాడిన విషయాలను పూర్తిగా వినకుండా హోం మంత్రి మాట్లాడారని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రతిఘటన తీవ్రంగా ఉంటుంది

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేసి తిరిగి వారిపైనే కేసులు పెడుతున్నారని, టీడీపీ వారిపైనే దాడులు జరిగాయంటూ అనుకూల పత్రికల్లో రాయించుకుంటున్నారని తెలిపారు. ఆ పత్రికలను చూడాలంటేనే సిగ్గుగా ఉందన్నారు. 11 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేశారని ఎన్నికల కమిషన్‌ చెప్పిందని, ఒక్క పిన్నెల్లిపైనే కేసు పెట్టారని, మిగిలిన 10 చోట్ల కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈవీఎం కేసులో పిన్నెల్లికి బెయిల్‌ వచ్చిందని, దీంతో ఆయనపై దొంగ కేసులు పెట్టారని ఆరోపించారు. కేసులు, జైళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యే రాజకీయాల్లోకి వచ్చామని చెప్పారు. జగన్‌ పర్యటనకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారని, ఆయనకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. జగన్‌కు లభిస్తున్న ఆదరణను చూసి కడుపు మంటతోనే టీడీపీ నేతలు అనేక విధాలుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. పిన్నెల్లిని కలిసేందుకు జగన్‌ రూ.25 లక్షలు ఖర్చు చేశారంటూ హోంమంత్రి మాట్లాడటం సరికాదని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తనను నమ్ముకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు ఎలాంటి ఆపదలో ఉన్నా జగన్‌ అండగా నిలుస్తారన్నారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేరిగ మురళి, ఖలీల్‌ అహ్మద్‌, విజయ డెయిరీ చైర్మన్‌ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతిని
ఘనంగా నిర్వహించాలి

- ఊరూ వాడా వైఎస్సార్‌కు నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు చేపట్టాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: దివంగత సీఎం డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఊరూ వాడా ఘనంగా నిర్వహిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్‌ జయంతి రోజైన జూలై 8 (సోమవారం)న నిర్వహించాల్సిన కార్యక్రమాలపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నేతలతో రామకృష్ణారెడ్డి శుక్రవారం టెలికాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈసారి వైఎస్సార్‌ 75వ జయంతి అయినందున రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమాలపై ఇప్పటికే సమాచారం అందించామని తెలిపారు. విగ్రహాలను సిద్ధం చేసి కింది స్థాయి వరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. మళ్లీ పార్టీ చైతన్యవంతమై, ప్రజల్లోకి దూసుకుపోయేందుకు ఇది తొలి అడుగులా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌ ప్రత్యేకంగా ఆదేశించారని తెలిపారు.

వైఎస్సార్‌ అడుగుజాడల్లోనే వైఎస్‌ జగన్‌

వైఎస్సార్‌ మరణించి 15 సంవత్సరాలైనా ఆయన జ్ఞాపకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు. ఆయన ఆలోచనలనే సిద్ధాంతాలుగా చేసుకుని వైఎస్‌ జగన్‌ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీని స్థాపించారని, ప్రజల్లో మమేకమైన నాయకుడు ఎలా ఉండాలో ఆయన ద్వారా నేర్చుకున్నామని తెలిపారు. వైఎస్సార్‌ అడుగుజాడల్లోనే అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్‌ జగన్‌ ప్రజలతోనే మమేకమై ఉన్నారని, పార్టీ కూడా ఎప్పుడూ ప్రజలతోనే నడిచిందని వివరించారు. వైఎస్సార్‌ మొదలు పెట్టిన పథకాలకు వైఎస్‌ జగన్‌ గత 5 ఏళ్లలో పూర్తి రూపం ఇవ్వడమే కాకుండా, వాటికి మరిన్ని జోడించి వ్యవస్థల్లో మంచి మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. స్వాతంత్య్రం వచ్చిన ఇన్నేళ్లలో తొలిసారి వైఎస్‌ జగన్‌ పేదరికాన్ని పారదోలి, అందరికీ సమాన అవకాశాలను కలిగించేలా పేదలను చేయి పట్టుకుని నడిపిస్తూ, సుస్థిరమైన అభివృద్ధి, అభ్యుదయం దిశగా రాష్ట్రాన్ని నడిపిన ఘన చరిత్ర వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీదన్నారు. మనం చేసిన మంచి పనుల వల్ల వచ్చిన మార్పులు కళ్ల ముందే కనపడుతున్నాయని తెలిపారు. ఈ పథకాలను కేంద్ర ప్రభుత్వం సైతం ఆదర్శంగా తీసుకుందని, ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు.

ఎప్పటికీ ప్రజలతో మమేకమై ఉంటాం

పథకాల లబ్ధిదారులంతా ఓటు రూపంలో మనకు అండగా నిలుస్తారనుకున్నామని, కానీ టీడీపీ మోసపూరిత, అమలు సాధ్యం కానీ హామీలను ప్రజలు నమ్మి ఉండొచ్చని, ఇతర కారణాలు కూడా తోడై ఈ ఫలితాలు వచ్చాయని సజ్జల అభిప్రాయపడ్డారు. పోలింగ్‌ అయిన వెంటనే టీడీపీ రాష్ట్రంలో భయోత్పాతాన్ని సృష్టిస్తోందని ధ్వజమెత్తారు.

ఏదీ మా 'నిధి'?

▶ మొదటి పేజీ తరువాయి

అక్కచెల్లెమ్మలు నెలకు రూ.2,588 కోట్ల చొప్పున ఏడాదికి రూ.31,065 కోట్లు దాకా నష్టపోతున్నారు. జూన్‌లో ఇప్పటికే రూ.2,588 కోట్లు నష్టపోయారు. పోనీ భవిష్యత్తులో ఇచ్చే డబ్బులు బకాయిలతో కలిపి ఇస్తారా? అనే అనుమానాలు మహిళల్లో వ్యక్తమవుతున్నాయి. 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి 'ఆడబిడ్డ నిధి' నుంచి నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈమేరకు 'భవిష్యత్తుకు గ్యారెంటీ – ఇది బాబు ష్యూరిటీ' పేరుతో ఇంటింటికీ చంద్రబాబు సంతకంతో కూడిన కరపత్రాలను పంచారు. అధికారం దక్కించుకునేందుకు ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి నేతలు హామీల అమలుపైనా అంతే ఉత్సాహం చూపాలని ప్రజానీకం కోరుకుంటోంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ – జనసేన– బీజేపీ కూటమిగా పోటీ చేసినా కమలనాథులతో సంబంధం లేకుండా సూపర్‌ సిక్స్‌ పేరిట టీడీపీ, షణ్ముఖ వ్యూహం పేరుతో జనసేన రూపొందించుకున్న అంశాలతో ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఏడాది ముందే బాబు సంతకంతో గ్యారెంటీ కార్డులు..

ఎన్నికలకు ఏడాది ముందు నుంచే రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు ప్రతి ఇంటికీ తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సాయంతోపాటు సూపర్‌ సిక్స్‌లోని అన్ని అంశాలను కచ్చితంగా అమలు చేస్తారని నమ్మబలుకుతూ 'గ్యారెంటీ' కార్డులను కూడా పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే సూపర్‌ సిక్స్‌ హామీలను అమలు చేస్తామని, తమను గెలిపించాలని ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతి బహిరంగ సభలోనూ చంద్రబాబు అభ్యర్థించిన విషయం తెలిసిందే. చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు తనది గ్యారంటీ అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ సైతం ఎన్నికల ప్రచార సభల్లో, రాజకీయ వేదికలపై ప్రకటించారు. ఎన్నికలు ముగిసి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్‌కళ్యాణ్‌ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతల్లో కొనసాగుతున్న నేపథ్యంలో జాప్యం చేయకుండా మేనిఫెస్టో హామీలను నెరవేర్చి తమకిచ్చిన మాట నిలబెట్టుకోవాలని మహిళలు కోరుతున్నారు.

నాడు మొహం చాటేసిన జనసేనాని

ఎన్నికల హామీలను చంద్రబాబు – పవన్‌కళ్యాణ్‌ అమలు చేస్తారా? లేదంటే 2014 తరహాలో మరోసారి మోసం చేస్తారా? అనే చర్చ ప్రజల్లో పెద్ద ఎత్తున సాగుతోంది. 2014లోనూ టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత తనదేనంటూ నమ్మకంగా చెప్పిన పవన్‌ కళ్యాణ్‌ ఆ తరువాత మొహం చాటేసిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. 2014–19 మధ్య అధికారంలో ఉండగా హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబును నాడు జనసేనాని కనీసం ప్రశ్నించని వైనాన్ని ప్రస్తావిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీతోపాటు డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తానంటూ నాడు కుప్పలు తెప్పలుగా హామీలిచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా నిలువునా వంచించిన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్‌ నుంచి మాయం చేయడం గమనార్హం.

1.72 కోట్ల మంది నిరీక్షణ

కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఓటర్లుగా నమోదైన వారిలో 19–59 ఏళ్ల వయసు మహిళలంతా చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ప్రతి నెలా రూ.1,500 చొప్పున పొందేందుకు అర్హులేనని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. పింఛన్లు పొందుతున్న మహిళలను మినహాయించినా 1.72 కోట్ల మందికిపైగా ఈ పథకానికి అర్హులేనని పేర్కొంటున్నారు. హామీ అమలులో ఆలస్యం కారణంగా వారంతా ప్రతి నెలా రూ.2,588 కోట్ల చొప్పున నష్టపోతున్నారని గుర్తు చేస్తున్నారు.

డ్వాక్రాకు ద్రోహం..

బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని నమ్మబలికిన చంద్రబాబు ఐదేళ్లలో 70 లక్షల మందికి పైసా కూడా మాఫీ చేయకపోవడంతో పొదుపు సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎన్‌పీలు (నిరర్థక ఆస్తులు)గా మిగిలాయి. సంఘాలు రుణాలు కట్టకపోవడంతో బ్యాంకులు కొత్త రుణాలిచ్చేందుకు నిరాకరించాయి. నాడు సంబంధిత శాఖ మంత్రిగా ఉన్న పరిటాల సునీత తమ ప్రభుత్వం డ్వాక్రా రుణహామీని అమలు చేయలేదని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించడం గమనార్హం.

అన్నదాతకు వెన్నుపోటు..

2014 ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.8,7612 కోట్లు వ్యవసాయ రుణాలు ఉండగా కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసిన చంద్రబాబు కోతలు వేసి విడతలవారీగా అంటూ అరకొర మాఫీతో సరిపుచ్చారు. రైతు సాధికారికత పేరుతో టీడీపీ సర్కారు ఇచ్చిన రుణ బాండ్లు చెల్లుబాటు కాక చిత్తు కాగితాల్లా మిగిలిపోయాయి.

క్లుప్తంగా...

పెద్ద తలకాయను పట్టుకోండి

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘాను మరింత పెంచాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణా చేస్తున్నవారిని అరెస్టు చేయడంతోపాటు వారి వెనక ఉన్న పెద్ద తలకాయలను అదుపులోకి తీసుకోవాలని సూచించారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా, పోట్లదుర్తి జగనన్న కాలనీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం డంప్ వివరాలను కడప జిల్లా అటవీశాఖ అధికారులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. డంప్‌లో 158 ఎర్ర చందనం దుంగలు దొరికాయనీ, వీటి విలువ రూ.1.6 కోట్లు ఉంటుందని తెలిపారు. ఎర్రచందనం దుంగలను రవాణా దశలోనో, దాచి ఉంచిన దగ్గరో పట్టుకోవడంతోపాటు నరికివేత కూలీలు, రవాణాదారులను తెర వెనక ఉండి నడిపిస్తున్నవాళ్లను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. గతంలో ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో అరెస్టయి బెయిల్ మీద బయట తిరుగుతున్నవారి కార్యకలాపాలు, వాళ్లకు ఎవరెవరితో లావాదేవీలు వంటి అంశాలపై నిఘా ఉంచాలన్నారు.

పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్

'పర్యావరణ నిబంధనలు పారిశ్రామిక ప్రగతికి అవరోధం కాదు. పర్యావరణ హితంగా పరిశ్రమలు నిర్వహించడం అవసరం. అందుకనుగుణంగా ఎలాంటి విధానాలు అనుసరించాలనే అంశంపై ఎప్పటికప్పుడు పరిశ్రమల నిర్వాహకులు, ప్రతినిధులకు అవగాహన కల్పించాలి. నిబంధనలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి'.. అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

సాక్షి, అమరావతి: శాసన మండలి సభ్యులుగా సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయరాజు తెలిపారు. ఎమ్మెల్యేల కోటా నుంచి వీరిద్దరి ఎన్నికై నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కోటాలో మండలిలో ఖాళీ అయిన 2 ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి నామినేషన్ల ఉపసంహరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఆ సమయానికి వీరిద్దరి నామినేషన్లే దాఖలవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విజయరాజు ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలుగా ఉన్న సి.రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించారు. ఆ సమయంలో ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా, రామచంద్రయ్యపై అనర్హత వేటు పడింది. ఈ రెండు పదవుల భర్తీకి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా టీడీపీ తరఫున రామచంద్రయ్య, జనసేన తరఫున హరిప్రసాద్ నామినేషన్లు వేశారు. ఎమ్మెల్యేల సంఖ్యా బలం కూటమికే ఉండటం, వారిద్దరే నామినేషన్లు వేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది.

8న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 8వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ప్రకటించారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారని తెలిపారు. ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని గేలి చేసే విధంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో పెట్టుబడులు వచ్చి అభివృద్ధి జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన అవినీతి అంశాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని చెప్పారు. జగన్ ప్రతిపక్షంలో బాధ్యతగా వ్యవహరించాల్సింటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు కూల్చడం సరికాదు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

అనంతపురం అర్బన్: చిరుద్యోగులు, కార్మికులపై వేధింపులు, దాడులు, వైఎస్సార్ సీపీ కార్యాలయాలను కూల్చివేయడం తదితర చట్టవిరుద్ధ చర్యలకు అధికార పార్టీ నాయకులు పాల్పడడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు హితవు పలికారు. శుక్రవారం అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులు, కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితర కార్మికులపై వేధింపులు, దాడులు, తొలగింపులకు పాల్పడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు అలజడి సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూల్చే విషయంలో.. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం తన తప్పులను సరిచేసుకోవాలని హితవు పలికారు. అధికారం శాశ్వతం కాదన్న సత్యాన్ని గ్రహించాలన్నారు. చట్టానికి లోబడి ఉండాలే తప్ప అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బాబు అండ్ కో కేసులన్నీ సీబీఐ, ఈడీకి అప్పగించండి

పోలీసుల దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగే అవకాశం లేదు

- ఫలితాల రోజే సీఐడీ ఆర్థిక నేరాల విభాగానికి తాళాలు
- హరీష్ కుమార్ గుప్తా చర్యలు దౌర్జన్యపూరితం
- ఫిర్యాదులపై కక్ష సాధింపు చర్యలు, బెదిరింపులు
- సీనియర్ పాత్రికేయుడు తిలక్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం
- చంద్రబాబు, లోకేశ్, నారాయణలతో సహా 114 మంది ప్రతివాదులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ, కింజారపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వ్యాపార వేత్తలు లింగమనేని రమేష్, వేమూరు హరికృష్ణ ప్రసాద్ తదితరులతో పాటు పలు కంపెనీలపై గతంలో నమోదైన కేసులన్నింటినీ సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితరాల స్కామ్‌లకు సంబంధించి చంద్రబాబు, ఇతరులపై నమోదైన కేసుల్లో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేసే పరిస్థితులు ప్రస్తుతం లేవని.. నిష్పాక్షిక, పారదర్శక, వేగవంత దర్యాప్తు నిమిత్తం ఈ కేసుల తదుపరి దర్యాప్తు బాధ్యతలను సీబీఐ, ఈడీలకు అప్పగించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ సీనియర్ పాత్రికేయుడు, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాల గంగాధర తిలక్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సీబీఐ, ఈడీ దర్యాప్తును పర్యవేక్షించాలని ఆయన తన వ్యాజ్యంలో హైకోర్టును కోరారు. దర్యాప్తు పురోగతికి సంబంధించి ఎప్పటికప్పుడు స్థాయీ నివేదికలను కోర్టు ముందుంచేలా కూడా సీబీఐ, ఈడీలను ఆదేశించాలని ఆయన అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలతో పాటు మొత్తం 114 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ప్రతివాదుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, సీఐడీ అదనపు డీజీ, సీబీఐ, ఈడీలను కూడా చేర్చారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తాను వ్యక్తి గత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు. ఆయా కుంభకోణాల్లో అక్రమాలు ఎలా జరిగాయో కూడా సమగ్రంగా వివరించారు.

సీఐడీ ఆర్థిక నేరాల విభాగానికి తాళాలు

'ఫలితాలు వెలువడిన రోజున డీజీపీగా, పోలీసు బలగాలకు అధిపతి (హెచ్‌ఓఎఫ్)గా ఉన్న హరీష్ కుమార్ గుప్తా సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగానికి తాళాలు వేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, ఇతర తెలుగుదేశం పార్టీ నేతలపై నమోదైన కేసులను దర్యాప్తు చేస్తున్న అధికారులకు ప్రవేశాన్ని నిరాకరించారు. చంద్రబాబు తదితరులు అధికారంలోకి రాబోతున్నారని గ్రహించి, ఆయా కేసులను దర్యాప్తు చేస్తున్న అధికారుల పట్ల నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించారు. అంతేకాక మధ్యాహ్నం 12.30 గంటలకు రహస్యంగా సాయుధులను అక్కడ మోహరింప చేశారు. కౌంటింగ్ జరుగుతుండగానే, ఆర్థిక నేరాల విభాగం నుంచి అధికారులందరినీ వెళ్లిపొమ్మన్నారు. ఈ విషయాలన్నీ పత్రికల్లో వచ్చాయి. ఓ డీజీపీ ఈ విధంగా చేయడం చట్ట విరుద్ధం, ఏకపక్షం, దౌర్జన్యపూరితం' అని తిలక్ తన వ్యాజ్యంలో వివరించారు.

ఆ కేసుల విషయంలో ఉదాసీనత

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈసీఐఆర్‌ను రిజిష్టర్ చేసిందని తెలిపారు. కొందరు నిందితులను కూడా అరెస్ట్ చేసినట్లు ఈడీ తెలిపిందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి డీజీపీ, సీఐడీ అదనపు డీజీ తదితరులందరూ కూడా ఈ కేసుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తిలక్ వివరించారు. ఈ కేసుల్లో సీఐడీ, ఈడీ ఇప్పటి వరకు చేసిన దర్యాప్తును చంద్రబాబు, ఇతర నేతలకు అనుకూలంగా నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో హైకోర్టు ఈ కేసులన్నింటి దర్యాప్తును సీబీఐ, ఈడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ హోదాలో డి.వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మద్యం కుంభకోణంపై సీఐడీ కేసు నమోదు చేసిందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారన్నారు. ఇసుక కుంభకోణంపై ఫిర్యాదు చేసినందుకు గనుల శాఖ అప్పటి డైరెక్టర్ జి.వెంకట రెడ్డిపై కక్ష తీర్చుకుంటున్నారన్నారు. తమపై ఫిర్యాదు చేసిన వారందరిపై చర్యలు తీసుకుంటామని రెడ్‌బుక్ అంటూ పలువురు అధికారులను వేధిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోర్టును కోరారు.

నిధులిచ్చి ఆదుకోండి

- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌కు సీఎం చంద్రబాబు వినతి
- కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్‌లతో భేటీ



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో కలిసిన సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, త్వరితగతిన నిధులు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులతో కలిసి చంద్రబాబు వివిధ శాఖల కేంద్ర మంత్రులకు వినతి పత్రాలను అందచేశారు. త్వరలో కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రాజధాని, పోలవరం, ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు.

➡ అంతకుముందు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంను సీఎం చంద్రబాబు కలుసుకున్నారు. అనంతరం ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. కేంద్ర సామాజిక సాధికారిత సహాయ మంత్రి రాందాస్ అథావాలేను కలిశారు. అశోకా రోడ్డులోని నివాసంలో వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్, ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పారిశ్రామిక వేత్తలతో చర్చల అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యారు.

నేడు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

అనంతరం 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు ఏపీ సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ నుంచి రూ. రూ.7,230.14 కోట్లు రావాల్సి ఉంది. వైఎస్ జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఆ బకాయిల చెల్లింపునకు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయించిందని అధికార వర్గాలు గుర్తు చేశాయి. ఆ బకాయిలను తెలంగాణ ప్రభుత్వం నుంచి విడుదలకు చంద్రబాబు గట్టి ప్రయత్నం చేయాల్సి ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఢిల్లీలోని ఏపీ భవన్ పంపిణీ వ్యవహారం ఇటీవలి ఎన్నికలకు ముందు పూర్తి అయింది. ఈ ఏడాది మార్చిలో రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవలంభించడంతో ఏపీ భవన్ పంపిణీ సజావుగా జరిగిపోయింది. ఏపీ భవన్ భూముల విలువ మొత్తం రూ.9,913.50 కోట్లు కాగా ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.5,781.41 కోట్ల విలువ గల భూములు వచ్చాయి. తెలంగాణకు రూ.4,132.08 కోట్ల విలువైన భూములు వచ్చాయి. ఇక ప్రధానంగా షెడ్యూల్ 9లోని 91 సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం గతంలోనే షీలా భిడే కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు 68 సంస్థలకు సంబంధించి అభ్యంతరం లేవని రెండు రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయి. మిగతా సంస్థల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం రాలేదు. అలాగే పదో షెడ్యూల్‌లోని సంస్థల పంపిణీపైన ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉన్నాయి. వీటి పరిష్కారంపై ఇప్పుడు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

అమరావతిపై ఆకర్షణ తగ్గింది!

- మీడియాతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజధానికి పునర్వైభవం తెస్తా
- కులగణనకు బదులు నైపుణ్య గణన
- నేనెప్పుడూ కేంద్రాన్ని మంత్రి పదవులు అడగలేదు

సాక్షి, న్యూఢిల్లీ: గత ఐదేళ్ల పాలనలో అమరావతిపై ప్రజల్లో ఆకర్షణ తగ్గిందని, రాజధానికి పునర్వైభవం తెచ్చేలా తాను అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న భవనాల్ని ముందు పూర్తి చేస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో 135 ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పి అమరావతి ఐకానిక్ బిల్డింగ్‌తో సహా అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తామని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు శుక్రవారం ఎంపిక చేసుకున్న జాతీయ, తెలుగు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణనకు బదులుగా నైపుణ్య గణన చేస్తామన్నారు. తానెప్పుడూ కేంద్రాన్ని మంత్రి పదవులు అడగలేదన్నారు. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో టీడీపీకి 7–8 కేంద్ర మంత్రి పదవులు ఇస్తామన్నా తాను వద్దని చెప్పానన్నారు. రిలేషన్స్ బాగుండాలనే ఆలోచనతో వాళ్ల స్పీకర్ పదవి ఇస్తే తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా సత్సంబంధాలు (రిలేషన్స్) ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి సపోర్ట్‌గా ఉండాలని కోరానని, మోదీకి తనకూ మధ్య ఉన్న సత్సంబంధాల దృష్ట్యా తమకు కేంద్ర మంత్రి పదవులు ఇచ్చారన్నారు.

దావోస్‌కు వెళ్తా

రాష్ట్ర ప్రయోజనాల కోసం దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు కచ్చితంగా వెళ్తానని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులను తెచ్చే దిశగా మరింత దూకుడుగా పని చేస్తామన్నారు.

గోదావరితో దక్షిణాదికి నీళ్లివ్వచ్చు

దక్షిణాదిలో ఏ రాష్ట్రానికీ లేని గొప్ప వనరులు ఏపీకి ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి మధ్య రాష్ట్రం అంతా అనుసంధానమై ఉందన్నారు. ఒక్క గోదావరి నుంచే సుమారు 3 వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోందన్నారు. నదుల అనుసంధానం పూర్తి స్థాయిలో చేయగలిగితే గోదావరి నుంచే మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు నీటిని సరఫరా చేయవచ్చని చెప్పారు. ఇరు రాష్ట్రాల సమస్యలు పరిష్కారం అయ్యేలా తెలంగాణ సీఎంతో తాను భేటీ అవుతున్నట్లు తెలిపారు. తమ మధ్య అభివృద్ధి, ప్రయోజనాలపైనే చర్చలు జరుగుతాయన్నారు.

త్వరలో విజయవాడ-కర్నూలు విమాన సర్వీసులు

పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్



రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న మంత్రి భరత్

సాక్షి, అమరావతి/కర్నూలు (సెంట్రల్): విజయవాడ నుంచి కర్నూలుకు త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. ఢిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మంత్రి టి.జి.భరత్ కలిసి విజయవాడ నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టుకు విమాన సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు. అదే విధంగా రాత్రి వేళ ఫ్లైట్ ల్యాండింగ్ కోసం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సర్వీసులు త్వరలోనే ప్రారంభిస్తామని, అలాగే ఏడాదిలోపు రాత్రి వేళ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారని మంత్రి భరత్ చెప్పారు.

బాబూ.. హోదా ఎందుకు అడగలేదు?

- సీఎం ఢిల్లీ పర్యటన ఆత్మస్తుతి, పరనిందలా ఉంది
- ప్రత్యేక హోదా అంశాన్ని సజీవంగా ఉంచిందే వైఎస్ జగన్
- నితీష్ కుమార్ హోదా డిమాండ్ చేస్తున్నప్పుడు మీరెందుకు అడగరు?
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే టీజీఆర్ సుధాకర్ బాబు



సాక్షి, అమరావతి : ఏపీకి రావాల్సిన ప్రతి హక్కును చంద్రబాబు సాధించాలని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా గురించి చంద్రబాబు ఎందుకు ఢిల్లీలో ప్రశ్నించటం లేదంటూ నిలదీశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఆత్మస్తుతి, పరనిందలా ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి నెల రోజులైందని, ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. చంద్రబాబు కేంద్ర మంత్రులను కలవడాన్ని ఆహ్వానిస్తున్నామని, అదే సమయంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన అన్నింటినీ సాధించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రత్యేక హోదా అడుగుతూ ఆ అంశాన్ని సజీవంగా ఉంచారని చెప్పారు. ఎన్డీయేలో మీ సహచరుడు నితీష్ కుమార్ బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పుడు మీరెందుకు అడగడం లేదని బాబును నిలదీశారు. చంద్రబాబు ఇప్పుడు ఎన్డీయే కూటమిలో చక్రం తిప్పుతున్నందున, ఇప్పుడే హోదా సాధించుకునే శక్తి ఉందని ప్రజలూ నమ్ముతున్నారని.. ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దని హితవు పలికారు.

ఇప్పుడు గట్టిగా ప్రయత్నిస్తే హోదా వస్తుంది

చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన అబద్ధాలనే ప్రధాన మంత్రి చెప్పినట్లు ప్రెస్ నోట్ విడుదల చేయడం తగదని, రాష్ట్రానికి ఆర్థిక లోటు ఇవాళ కొత్తగా ఉందన్నట్టు చెప్పడం సరికాదని సుధాకర్‌బాబు తప్పు పట్టారు. 'రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహాలోనే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విభజన హామీలలో ఉంది. 2014 –19 మధ్య కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా అమలు కాలేదని బాబు తెలుసుకోవాలి. అప్పుడు హోదా గురించి గట్టిగా అడగకుండా ప్యాకేజీకి ఎందుకు లొంగిపోయారో సమాధానం చెప్పాలి. విభజన హామీలన్నింటినీ చంపేసి, ప్యాకేజీ తీసుకుని సరిగ్గా 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు బీజేపీ, నరేంద్ర మోదీపై తిరుగుబాటు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ, జగన్ అవసరం కేంద్రానికి లేదు. దీంతో ఎంతగా అడిగినా కేంద్రం హోదా ఇచ్చే పరిస్థితి లేకపోయింది. ఇప్పుడు పరిస్థితి వేరు. ఎన్డీయే ప్రభుత్వం చంద్రబాబు, నితీష్ కుమార్‌పై ఆధార పడినందున హోదా గురించి చిత్తశుద్ధితో డిమాండ్ చేస్తే కచ్చితంగా వస్తుంది. టీడీపీకి ఓట్లు వేయలేదన్న కారణంతో పెన్షన్లు నిలిపి వేయడం సరికాదు. పెన్షన్ రావాలంటే టీడీపీ నేతలు కాళ్లు పట్టుకోవాలా? వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలను కొట్టినా, తిట్టినా, కేసులు పెట్టినా ప్రశ్నించే గొంతులు లేస్తూనే ఉంటాయి. సూపర్ సిక్స్‌తో పాటు, ఎన్నికల ప్రచారంలో బాబు చెప్పిన హామీలన్నింటినీ నెరవేర్చేదాకా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గళమెత్తుతూనే ఉంటాయి' అని స్పష్టం చేశారు.

'ఎర్ర' దందా మీ వాళ్ల హయాంలోనే

- పవన్ కళ్యాణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- అటవీ శాఖ మీరే చూస్తున్నారు.. ఫైళ్లు తిరగేయండి
- 2010 నుంచి ఎర్ర చందనం అక్రమ రవాణా
- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిపై ఆరోపణలు తగవు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్



సాక్షి, అమరావతి: నేపాల్‌లో దొరికిన ఎర్ర చందనం వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉన్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న ఆరోపణలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబంపై పవన్ ఆరోపణలు సరికాదన్నారు. వాస్తవానికి గతంలో చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాంలోనే ఎర్రచందనం అక్రమ రవాణా జరిగిందని చెప్పారు. పదేళ్ల క్రితమే నేపాల్, మలేషియాతోపాటు ఇతర దేశాల్లో దాదాపు 8 వేల టన్నుల ఎర్ర చందనం దొరికిందని, దానిని ఏపీకి తెప్పించేందుకు జగన్ సర్కారు ఎన్నో సార్లు కేంద్రానికి లేఖలు రాసిందన్నారు. 2010–2020 మధ్య కాలంలో నేపాల్ మీదుగా చైనాకు ఎర్ర చందనం అక్రమంగా రవాణా జరిగిందని, 173 టన్నులు పట్టుకున్నామని నేపాల్ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. దానిని తిరిగి భారతదేశానికి ఇచ్చేస్తున్నట్లు నేపాల్ మంత్రి గోకుల్ ప్రసాద్ బస్కోట ప్రకటన చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పత్రికా కథనాలను మీడియాకు చూపారు. నేపాల్‌కు మన అధికారులు వెళ్లి ఆ దుంగలను పరిశీలించారని, ఇక్కడకు తీసుకొచ్చేందుకు అనుమతి కూడా మంజూరైందన్నారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి పత్రికలోనూ ప్రముఖంగా వచ్చిందని చెప్పారు.

పవన్.. మీ పలుకుబడి ఉపయోగించండి

'పవన్ కళ్యాణ్ ఆరోపించినట్లు ఎర్రచందనం దుంగలు దొరికింది 2020 జనవరిలో.. అంటే జగన్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో. అంతకు ముందు పదేళ్లుగా దుంగలు దొరికాయని నేపాల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీన్ని పట్టించుకోకుండా పవన్.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలపై దుష్ప్రచారం చేయడం దారుణం' అని మండిపడ్డారు. ఒక్క నేపాల్‌లోనే కాకుండా.. దుబాయ్, శ్రీలంక, మలేషియా, పక్క రాష్ట్రాలు తమిళనాడు, ఒడిశా, కర్ణాటకలలో కూడా ఏపీ నుంచి అక్రమంగా తరలించిన ఎర్ర చందనం పట్టుబడింది. అటవీ శాఖ పవన్ కళ్యాణ్ పరిధిలోనే ఉంది. ఏపీ ప్రభుత్వం కేంద్రంతో చేసిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఫైల్స్‌లో ఉంటాయి. చదివి వాస్తవాలు తెలుసుకోవాలి. లేదంటే మీ నైతికతకు భంగం వాటిల్లుతుందనే విషయం గుర్తుంచుకోండి' అని హితవు పలికారు. వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో పట్టుబడిన దుంగలను పవన్ రాష్ట్రానికి తెప్పించాలి. వాటిని విక్రయిస్తే రూ.నాలుగైదు వేల కోట్లు వస్తుంది. ఆ డబ్బు ప్రజలకు ఉపయోగ పడుతుంది' అని అన్నారు. 'చిత్తూరు జిల్లాకు చెందిన వారు కాబట్టి పెద్దిరెడ్డిని, మిథున్‌రెడ్డిని డీఫేమ్ చేయాలని చూస్తే మీ పార్ట్‌నర్ చంద్రబాబుదీ అదే జిల్లా. కిరణ్ కుమార్‌రెడ్డి, గల్లా అరుణ కుమారి, ఇటీవల మృతి చెందిన గాలి ముద్దు కృష్ణమనాయుడిది కూడా అదే జిల్లా. ఈ లెక్కన వీరంతా ఎర్రచందనం దందాలో ఉన్నట్లా? ఇకనైనా అసత్యాలు కట్టిపెట్టాలి' అని హితవు పలికారు.

9 నెలల్లో పూర్తి చేయండి

'నివాస' సముదాయాల నిర్మాణంపై అధికారులకు స్పీకర్ ఆదేశం

సాక్షి, అమరావతి/తాడికొండ: రాజధాని ప్రాంతంలోని రాయపూడిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయ భవనాలను శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సీఆర్‌డీఏ, అసెంబ్లీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకుగాను 288 నివాసాలు కల్పించేందుకు రాయపూడి వద్ద 12 అంతస్తులతో కూడిన 12 టవర్ల నిర్మాణాన్ని గత టీడీపీ ప్రభుత్వం చేపట్టి 2019 నాటికి 77% పనులను పూర్తి చేసిందని చెప్పారు. అయితే గత ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిలిపేయడంతో నిర్మాణాలన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయ భవనాలను పూర్తి చేసేందుకే అదనంగా రూ.300 కోట్ల ఖర్చు కానుందని చెప్పారు. అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలు హైదరాబాద్‌లో కూడా లేవన్నారు. ఈ భవన సముదాయాలకు సంబంధించిన ఫినిషింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి 9 నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు.

త్వరలో నూతన ఐటీ పాలసీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను ఆకర్షించడానికి మెరుగైన విధానాలతో నూతన ఐటీ పాలసీని తీసుకొస్తామని రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖల ప్రస్తుత స్థితి, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై శుక్రవారం ఆయన సమీక్షించారు. కొత్తగా ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు పెట్టేందుకు ఆసక్తి చూపే పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల పర్యవేక్షణకు గతంలో (2019కి ముందు) ఉన్న పోర్టల్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విశాఖపట్నంలో ఐటి పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పై నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల కార్యదర్శి కోన శశిధర్, జెడి (ప్రమోషన్స్) సూర్జిత్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్, ఎపిటా జనరల్ మేనేజర్ విజయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు వరకూ డెల్టాకు నీరివ్వలేం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి
- ప్రాజెక్టులపై సీఈ, ఎస్‌ఈలతో మంత్రి సమీక్ష



సాక్షి, అమరావతి: కృష్ణా డెల్టాకు ఆగస్టు వరకూ సాగునీరు ఇవ్వడం సాధ్యం కాదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పులిచింతలలో 30 నుంచి 40 టీఎంసీలు నిల్వ ఉంటే వాటికి పట్టిసీమ నీటిని జతచేసి కృష్ణా డెల్టాకు నీళ్లందించేందుకు వీలు ఉండేదన్నారు. ప్రస్తుతం పులిచింతలలో 0.5 టీఎంసీ మాత్రమే నిల్వ ఉన్న నేపథ్యంలో ఆగస్టు వరకూ కృష్ణా డెల్టాకు సాగునీరు ఇవ్వలేమని స్పష్టం చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌తో కలిసి సీఈలు, ఎస్ఈలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లోకి వచ్చే ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోపైన, గేట్లు, లాక్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించానన్నారు. కాలువల్లో పూడిక, చెత్తలను తొలగించే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని ఆయకట్టుకు నీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుండ్లకమ్మ, పులిచింతల, అన్నమయ్య ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయని ఆరోపించారు. పట్టిసీమ ఎత్తిపోతలలో ఇప్పుడు 15 పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నామని, మూడు నాలుగు రోజుల్లో మొత్తం 24 పంపులతో నీటిని ఎత్తిపోస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పనులకు ఏ మేరకు నిధులు ఖర్చు చేశారు.. ప్రాజెక్టుల పూర్తికి ఇంకా ఏ మేరకు నిధులు అవసరమనే అంశంపై నివేదిక రూపొందిస్తున్నామని చెప్పారు.

త్వరితగతిన టూరిజం ప్యాకేజీ దర్శనాలు

తిరుమలలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



టూరిజం హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుమల/తిరుపతి(అలిపిరి): టూరిజం ప్యాకేజీల ద్వారా తిరుమలకు వచ్చే భక్తులకు త్వరగా దర్శనం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరుమలలో నిర్మించిన దేవరాగం హోటల్‌ను టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టూరిజం ప్యాకేజీ దర్శనాలకు అధిక సమయం పడుతోందని భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ అంశాన్ని టీటీడీ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. తిరుపతిలోని 30 ఎకరాల టూరిజం స్థలంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ప్రధాని మోదీ కూడా టూరిజంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు.

త్వరలోనే 'పర్యాటక' శ్వేతపత్రం విడుదల

అమరావతి, పోలవరంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాలను విడుదల చేశారని, త్వరలోనే పర్యాటకంపై కూడా శ్వేతపత్రం విడుదల చేయనున్నామని మంత్రి తెలిపారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో అందమైన ప్రకృతి తలకోన, కాణిపాకం ఉండటంతో ఇక్కడ సినిమాల చిత్రీకరణకు అనువుగా ఉంటుందని.. ఇందుకోసం నిర్మాతలతో చర్చించి తిరుపతిలో ఓ అందమైన స్టూడియో నిర్మాణ విషయం సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతామని వివరించారు.

> జీవాత్మకు పరమశాంతి లభించేది పరమాత్మను ప్రాప్తం గావించుకున్నప్పుడే; కనుక దానికి సైతం పరమ ఆశ్రయం ఆ పరమాత్మేనని వేదాంతుల వివరణ.
>
> – ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 6 జూలై 2024

చైనా తీరు మారాలి!

ఆవిర్భవించిన నాటి లక్ష్యాలు విడిచి చాన్నాళ్లుగా దారీ తెన్నూ లేకుండా మిగిలిపోయిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రెండు రోజుల శిఖరాగ్ర సదస్సు కజఖ్‌స్తాన్‌లోని ఆస్తానాలో గురువారం ముగిసింది. ఈ సదస్సువల్ల ఇతరత్రా పెద్ద ప్రయోజనం లేకపోవచ్చుగానీ మనతోవున్న సరిహద్దు సమస్యను నాలుగేళ్లుగా దాటవేస్తున్న చైనాతో మన విదేశాంగమంత్రి జైశంకర్ భేటీ కావటం ఉన్నంతలో జరిగిన మేలు. వాస్తవానికి ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావాల్సివుండగా ఆయన బదులు విదేశాంగ మంత్రి వెళ్లారు. ప్రధాని ప్రసంగాన్ని చదివి వినిపించారు. మోదీ గైర్హాజరు ఆ సంస్థనుంచి భారత్ దూరం జరగటానికి సంకేతమనీ, అమెరికా ఒత్తిడే ఇందుకు కారణమనీ చైనా అనుకూల మీడియా ప్రచారం చేసుకుంది. నిరుడు భారత్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు కూడా ఇలాంటి భాష్యాలే చెప్పారు. చైనాతో నేరుగా సమావేశం కావటం ఇష్టం లేకే ఈ లాంఛనం పూర్తిచేసిందని ఆ భాష్యాల సారాంశం.

నిజమే... ప్రపంచంలో 40 శాతం జనాభాతో, ప్రపంచ జీడీపీలో 23 లక్షల కోట్ల మేర వాటాతో ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌సీఓను విస్మరించటం మంచిది కాదు. కానీ ఆ సంస్థ ఆరంభ కాలంనాటి లక్ష్యాలను గుర్తుంచుకుందా? వాటికి అనుగుణంగా పనిచేస్తున్నదా అంటే లేదనే చెప్పాలి. వర్తక, వాణిజ్యాల్లో దాని ముద్ర లేకపోలేదు. అయితే ఆ సంస్థ పరిధిలోని ప్రాంతాల్లో ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా వగైరా పోకడల గురించి అది సక్రమంగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. మోదీ ప్రసంగంలో ఈ సమస్యలే ప్రధానంగా ప్రస్తావనకొచ్చాయి. 1996లో షాంఘై ఫైవ్‌గా ఏర్పడ్డ బృందంలో చైనా, రష్యా, కజఖ్‌స్తాన్, కిర్గిజిస్తాన్, తజికిస్తాన్‌లున్నాయి. 1991లో సోవియెట్ యూనియన్ కుప్పకూలాక ఆ ప్రాంతంలో తెగల ఘర్షణలు పెచ్చుమీరటంతో భద్రతాపరమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి ఈ బృందం ఆవిర్భవించింది. అంతర్జాతీయ సంస్థగా మలచాలన్న లక్ష్యంతో 2001లో దీన్ని ఎస్‌సీఓగా మార్చారు. మన దేశానికి సభ్యత్వం ఇవ్వాలన్న రష్యా ప్రతిపాదనను అంగీకరిస్తూనే 2017లో తనకు అనుకూలంగా ఉన్న పాకిస్తాన్‌ను ఇందులో చేర్చింది చైనాయే. కానీ ఉగ్రవాదులకు సాయం చేస్తున్నట్టు వెల్లడై అనేకసార్లు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అభిశంసనకు గురైన పాక్‌ను దారి మార్చుకోవాలని చెప్పటంలో చైనా విఫలమైంది. అలాగే పాకిస్తాన్‌లో తలదాచుకున్న ఉగ్రవాదుల జాబితాను మన ప్రతిపాదన పర్యవసానంగా భద్రతామండలి చర్యలు తీసుకుంటున్న తరుణంలో చైనా గండికొట్టింది. సరిగదా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్‌ఐ)ను పాకిస్తాన్ అధీనంలోవున్న ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్లేలా రూపొందించింది. అందుకే 2018లో ఎస్‌సీఓలో బీఆర్‌ఐను అందరూ అంగీకరించినా మన దేశం వ్యతిరేకించాల్సి వచ్చింది. నిరుడు జరిగిన ఆన్‌లైన్ సదస్సులో కూడా మన దేశం బీఆర్‌ఐ గురించిన పేరా తొలగిస్తే తప్ప ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేది లేదని చెప్పింది.

ఆ సంగతలావుంచి ఎస్‌సీఓను అమెరికా, పాశ్చాత్య దేశాల నేతృత్వంలోని సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనుకుంటున్న చైనా అందుకు అనుగుణమైన నడవడి కనబరచవద్దా? వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద భారీగా సైన్యాన్ని మోహరించి దురాక్రమణకు పాల్పడినప్పుడు ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. 2020లో ఘర్షణలు చెలరేగాక భారత్, చైనాల సైనికాధికారుల స్థాయిలో 20 సార్లు, దౌత్యస్థాయిలో 13 రౌండ్లు చర్చలు జరిగాక ప్యాంగాంగ్ సో సహా అయిదు చోట్ల ఇరు దేశాల సైన్యాలూ వెనక్కి తగ్గటానికి అంగీకరించాయి. తూర్పు లద్దాఖ్‌లోని ప్రాంతాల్లో పరిస్థితి మారలేదు. దీన్ని పక్కనబెట్టి ఇరు దేశాల సంబంధాలూ సాధారణ స్థితికి తీసుకురావాలని చైనా కోరుతోంది. కానీ అక్కడ 2020 ఏప్రిల్ నాటి స్థితికి చైనా సిద్ధపడితేనే అది అసాధ్యమన్నది మన దేశం వాదన. మన సరిహద్దుకు సమీపంగా ఈ నాలుగేళ్లలో చైనా 600 'సంపన్న గ్రామాల'ను నిర్మించింది. మన దేశం కూడా అరుణాచల్‌లో 60 గ్రామాలు నిర్మిస్తోంది. ముమ్ముందు అరుణాచల్, హిమాచల్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, సిక్కింలలో ఇలాంటివి 3,000 గ్రామాలు నిర్మించాలన్నది మన దేశం లక్ష్యం. ఇదిగాక అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం దలైలామాను కలవడానికి మన దేశం అంగీకరించటం, దక్షిణ చైనా సముద్రంలో చైనాతో ఫిలిప్పీన్స్‌కు వచ్చిన తగాదాలో ఫిలిప్పీన్స్‌ను సమర్థించటం చైనాకు కంటగింపుగా ఉంది. అటు చైనా మనతో స్నేహసంబంధాలున్న హిందూ మహాసముద్ర ప్రాంత దేశాలను దువ్వుతూ మనకు వ్యతిరేకంగా కూడగడుతోంది.

ఈ నేపథ్యంలో ఎల్‌ఏసీ సమస్యపై భారత్‌తో చర్చించి, దాన్ని త్వరగా పరిష్కరించుకోవాలన్న జ్ఞానం చైనాకు ఉండాలి. అసలు ఎల్‌ఏసీ మ్యాప్‌లను ఇచ్చిపుచ్చుకుందామన్న మన ప్రతిపాదనకే అది జవాబివ్వటం లేదు. ఆ పని చేస్తే తన పాపం బద్దలవుతుందని దాని భయం. వర్తక వాణిజ్యాలు ముమ్మరంగా పెరిగేలా, కట్టుదిట్టమైన భద్రత ఉండేలా ఎస్‌సీఓను తీర్చిదిద్దుతామని మాటల్లో చెబుతూనే అతి పెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను విస్మరించటం ఏ రకంగా చూసినా చైనాకు తోడ్పడదు. పొరుగుతో సఖ్యతకు రాలేని దేశం ఇటువంటి సంస్థల అభ్యున్నతికి ఏమాత్రం పాటుపడగలదన్న ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతాయి. అందువల్లే మళ్లీ చర్చల పునరుద్ధరణకు చైనా చొరవ తీసుకోవాలి. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ, జైశంకర్‌ల మధ్య జరిగిన భేటీ ఆ దిశగా తోడ్పడితే మంచిదే. సమస్య పరిష్కారానికి ఇరు దేశాలూ చిత్తశుద్ధితో ప్రయత్నించి సఫలమైతేనే ఎస్‌సీఓ వంటి సంస్థల నిజమైన లక్ష్యాలు నెరవేరతాయి.

రైతులకు లాభాలు తేలేమా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

ఇరవై ఏళ్లలో బ్రెడ్ ధర రెండింతలు పెరిగింది, కానీ గోధుమల ధర సగానికి తగ్గింది. రైతులను మినహాయిస్తే అందరినీ సంతోషపెట్టే ఏర్పాటు ఇది. ప్రపంచవ్యాప్తంగా ఓవైపు రైతుల ఆదాయం పడిపోతుంటే, మరోవైపు కార్పొరేట్లు మాత్రం లాభార్జన చేస్తున్నాయి. భారత దేశంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయ రంగమే. 45.5 శాతం మంది శ్రామిక శక్తికి ఉపాధి కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చడం ఈ కాలపు అవసరం. 2024–25 సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాయత్తమవుతున్న తరుణంలో, వ్యవసాయాన్ని పునర్నిర్మించే రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఎలాంటి ఆర్థిక విధానాలు అవసరమో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

'పంజాబ్ ఫార్మర్స్ అండ్ ఫార్మ్ వర్కర్స్ కమిషన్' మాజీ చైర్‌పర్సన్ అజయ్ వీర్ జాఖడ్ ఇటీవల ట్వీట్ చేస్తూ, 'ఇరవై ఏళ్ల క్రితం, స్విట్జర్లాండ్‌లో బ్రెడ్ ధర 2.5 స్విస్ ఫ్రాంకులు, గోధుమ ధర కిలోకు 110 స్విస్ ఫ్రాంకులు ఉండేది. ఇప్పుడు బ్రెడ్ ధర 4 ఫ్రాంకులు కాగా, గోధుమల ధర కిలోకు 50 ఫ్రాంకులు అయింది' అన్నారు. కొంతకాలం క్రితం, నేను కూడా కెనడా నుండి ఒక ఉదాహరణను షేర్ చేశాను. గత 150 సంవత్సరాలుగా కెనడాలో గోధుమ ధరలు పడిపోతున్నాయి, కానీ గత నాలుగు దశాబ్దాలుగా బ్రెడ్ ధరలు పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయ ఉత్పాదక ధరల తగ్గుదలకు సంబంధించి ఈ ఆందోళనకరమైన ధోరణి స్విట్జర్లాండ్, కెనడాకు మాత్రమే కాదు, కాస్త ఎక్కువ లేదా తక్కువగా ప్రపంచమంతటా ఇలాగే ఉంటోంది. ఒక శతాబ్దానికి పైగా, వ్యవసాయ ధరలు బాగా పడిపోతున్నాయి. ఇది రైతులను ఆత్మహత్యలకు లేదా వ్యవసాయాన్ని వదిలేసేలా పురిగొల్పుతోంది. ఇది ఆహార అసమానత్వమే.

స్థోమత లేని పోషకులు

ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారు నిరంతరం పేదరికంలో జీవిస్తున్నారు. తరచుగా, వ్యవసాయ ధరలు తక్కువగా ఉండటమే కాకుండా ఉత్పత్తి ఖర్చు కూడా రైతులకు దక్కడం లేదు. విషాదమేమిటంటే, మన పళ్లేల దగ్గరికి ఆహారం తెచ్చేవారికి తమను తాము పోషించుకునే స్థోమత ఉండటం లేదు. తమను 'అన్నదాత'లు అని పిలిచినప్పుడు రైతులు సులభంగా ఉప్పొంగిపోతారు; వ్యవసాయ సరఫరా గొలుసులోని ఇతర వాటాదారులు మాత్రం లాభాల్లో మునిగితేలుతారు.

రైతులు కష్టాల్లో కూరుకుపోతూ, గ్రామీణ వేతనాలు స్తబ్ధుగా ఉంటున్నప్పుడు కూడా విచ్ఛిన్నమైన ఆహార వ్యవస్థ వినియోగదారులను మాత్రం సంతోషంగా ఉంచింది. ఆహార ధరలను ఉద్దేశపూర్వకంగా తక్కువగా ఉంచడం, ఏటికేడూ వాటి ధరలను ఇంకా తగ్గించి వేయటం... అదే సమయంలో అధిక లాభాలను పొందడం (దీనిని విక్రేత లాభమని ఇప్పుడు పిలుస్తున్నారు) అనేది వ్యవసాయ వ్యాపార సంస్థలను సంతోషంలో ముంచెత్తుతోంది. పెరుగుతున్న వేతనాలు, ధరల వల్ల సరఫరా వ్యవస్థకు అడ్డంకులు పెరుగుతాయని కార్పొరేట్లు నిందించినప్పటికీ, అమెరికాలో ఉదాహరణకు, 2023 సంవత్సరం రెండవ, మూడవ త్రైమాసికాల్లో, కార్పొరేట్ లాభాలు ద్రవ్యోల్బణంలో 53 శాతానికి ఆజ్యం పోశాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంకా, కోవిడ్ మహమ్మారి తర్వాత కార్పొరేట్ లాభాలు మరింతగా పెరిగాయి. 2023 చివరి త్రైమాసికం నాటికి ఇది రికార్డు స్థాయికి చేరుకుంది. మహమ్మారికి ముందు నాలుగు దశాబ్దాలలో, ద్రవ్యోల్బణానికి కార్పొరేట్ లాభాల సహకారం కేవలం 11 శాతం మాత్రమే.



ఒకటిన్నర శతాబ్దానికి పైగా, మన ఆర్థిక విధానాల రూపకల్పన రైతులకు సరైన ధరలను నిరాకరించింది. వ్యవసాయ రంగంలో ముదిరిపోతున్న సంక్షోభం పట్ల విధాన నిర్ణేతలు కళ్ళుమూసుకోవడంతో, గ్రామీణ ప్రాంత ఆగ్రహం ఎన్నికల సీజన్‌లో మాత్రమే నొక్కి చెప్పబడుతోంది. 'భారత ప్రభుత్వం రైతులకు రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటిస్తుంటుంది, కానీ వాస్తవానికి వారినే బాధపెడుతుంది' (ది ఎకనామిస్ట్, 2018 జూలై 12) అనే కథనం ఆసక్తికరమైన అంతర్దృష్టిని అందిస్తుంది. ధనిక వాణిజ్య కూటమి అయిన ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) దేశాలు ఉత్పత్తిదారులకు వ్యవసాయ ఆదాయంలో 18 శాతానికి సమానమైన మొత్తాన్ని అందజేస్తుండగా, భారతదేశం వాస్తవానికి వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించడంతో సరిపెట్టింది.

సాయం చేయని సాంకేతికత

2024–25 సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాయత్తమవుతున్న తరుణంలో, రైతులలో పెరుగుతున్న ఆగ్రహాన్ని చల్లార్చడమే కాకుండా వ్యవసాయాన్ని పునర్నిర్మించే రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఎలాంటి ఆర్థిక విధానాలు అవసరమో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ సందర్భంగా, ఆర్థికవేత్త జీన్ డ్రేజ్ పేర్కొన్న ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ''భారతదేశంలో రాజకీయ చర్చలు సాధారణంగా ప్రత్యేకాధికారులు, శక్తిమంతులు నిర్దేశించిన కొన్ని సరిహద్దుల్లోనే జరుగుతాయి. మీరు ఈ సరిహద్దులను అధిగమించినట్లయితే, ఇబ్బందిని ఎదుర్కొంటారు''. వ్యవసాయానికి 'అవుటాఫ్ ద బాక్స్ థింకింగ్' అవసరం. అయితే అది పాలించే ఉన్నత వర్గాన్ని చాలావరకు కలవరపెట్టవచ్చు.

ఈ అన్ని సంవత్సరాలలో, సాంకేతిక జోక్యాలకు మరింత బడ్జెట్ మద్దతును అందివ్వడమే వ్యవసాయ ఆదాయాలను పెంచడానికి ప్రధాన మార్గంగా ఉంటూ వచ్చింది. డిజిటలీకరణ, కృత్రిమ మేధ, రోబోటిక్స్, కచ్చితమైన వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ, తద్వారా వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ ఒడిలోకి తీసుకువస్తున్నప్పటికీ, వ్యవసాయం చుట్టూ ఉన్న పరిశ్రమకు ఇటువంటి బడ్జెట్ మద్దతుతో అపారమైన ప్రయోజనం ఉంది. అదే సమయంలో రైతులు మరింత దుస్థితిలోకి కూరుకుపోవడం కొనసాగుతోంది.

హరిత విప్లవం సాగిన 60 ఏళ్ల తర్వాత కూడా వ్యవసాయ ఆదాయాలు పిరమిడ్‌లో అట్టడుగునే కొనసాగితే, వ్యవసాయ విప్లవం 4.0 వైపు సాంకేతిక పరివర్తనను చేపడతామని చేస్తున్న వాగ్దానాన్ని, వ్యవసాయాన్ని పట్టి పీడిస్తున్న అన్ని రుగ్మతలకు దివ్యౌషధంగా చూడలేము. ఎప్పటిలాగే, విధాన నిర్ణేతలు మరోసారి వ్యవసాయ కష్టాలకు నిజమైన కారణాన్ని (వ్యవసాయ ఆదాయాలు పడిపోవడం), సాంకేతిక జోక్యాలు ఆదాయాన్ని పెంచుతాయనే లోపభూయిష్ట ఆలోచనతో కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు.

'ప్రపంచం వేడెక్కిపోతున్న' స్థితిలో, పునరుత్పత్తి వ్యవసాయ పద్ధతుల నుండి స్థితిస్థాపక వ్యవసాయం వస్తుంది. కృత్రిమ మేధస్సు కంటే ముందుగా అందుబాటులో ఉన్న సహజ మేధస్సును ఉపయోగించుకోవడం అవసరం. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో, వ్యవసాయంలో నిమగ్నమైన మానవ జనాభా సామర్థ్యాన్ని పెంచడానికి మొదటగా పెట్టుబడి పెట్టడం చాలా ముఖ్యం.

దేశంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయమే. 45.5 శాతం మంది శ్రామికశక్తికి ఉపాధి కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చడం ఈ కాలపు అవసరం. వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో తోడ్పడే పరిశ్రమకు సహాయం చేయాలనే సాంప్రదాయిక ఆలోచన (ట్రికిల్–డౌన్ సూత్రానికి అనుగుణంగా) ఇప్పుడు పని చేసే అవకాశం లేదు.

ఆహార అసమానతలను తొలగించడానికి, తాజా ఆలోచనలు అవసరం. ముందుగా, ఎంఎస్ స్వామినాథన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ధరలకు హామీ ఇవ్వడానికి చట్టపరమైన యంత్రాంగాన్ని అందించాలి; రెండవది, బడ్జెట్‌లో 50 శాతాన్ని జనాభాలో దాదాపు సగం మందికి కేటాయించేలా ఆర్థిక మంత్రి చూడాలి. దీనికోసం, వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం మొత్తం బడ్జెట్‌లో 10 శాతం పెంచడం ప్రారంభించాలి. ప్రస్తుతం ఇది 3 శాతం కంటే తక్కువగా ఉంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దాగని సత్యం



మారియుపోల్ నగరాన్ని రష్యన్లు ఏం చేశారనే విషయంలో ఆఖరికి రష్యన్ బ్లాగర్లు కూడా మౌనంగా లేరు. రెండున్నరేళ్ల తర్వాత స్థానికులు ఇప్పటికీ తమ ప్రియమైనవారి చితాభస్మాలను వెతుక్కుంటున్నారు. వేలాది మంది చనిపోయిన సత్యాన్ని దాయడం అసాధ్యం.

– ఐరీనా మత్వియిషీన్, ఉక్రెయిన్ జర్నలిస్ట్

క్వీన్ ఎడిటర్



వాళ్లు చేస్తున్న పనిలాగా నేను ఎప్పటికీ చేయలేనంత మెరుగైన మనుషులతోనే నేను ఒక దర్శకుడిగా ఎల్లప్పుడూ పనిచేస్తాను. అప్పుడు నేను వాళ్ల నుంచి నేర్చుకో వచ్చు. బాండిట్ క్వీన్‌కు రేణూ సలూజా నా ఎడిటర్. సౌండ్, ఇమేజ్ గురించి ఆమె నాకు ఎంతో నేర్పారు. బాండిట్ క్వీన్ అంత బాగా రావడానికి ఆమె ప్రతిభే కారణం. (జూలై 5న రేణు సలూజా జయంతి.)

– శేఖర్ కపూర్, దర్శకుడు

బంగ్లాలో జగన్నాథుడు



పూరి(ఒడిశా) తరహాలోనే పశ్చిమ బెంగాల్‌లోని దీఘాలో కూడా జగన్నాథ దేవాలయ సముదాయం నిర్మిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. జగన్నాథుడు, బలభద్ర (బలరాముడు), సుభద్ర ఇక్కడ కూడా పూజలు పొందుతారు. రథయాత్ర ఉత్సవం కూడా జరుగుతుంది. జై జగన్నాథ్!

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

లీడర్ ఇండియా



ఇప్పుడు బ్రిటిష్ పార్లమెంటులో 26 మంది, కెనడియన్ పార్లమెంటులో 19 మంది భారత సంతతి ఎంపీలు ఉన్నారు. ఎన్నో గ్లోబల్ కంపెనీలను భారతీయ 'సీఎక్స్‌ఓ'లు (చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్స్) నడుపుతున్నారు. ప్రపంచపు కర్మాగారం చైనా కావొచ్చుగానీ, ఇండియా ప్రపంచపు 'నాయకత్వ కర్మాగారం'గా మారుతోంది.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

మూక జ్ఞానమే!



మతపరంగా లేదా క్రీడలపరంగా కల్ట్‌లను ప్రోత్సహించే దేశం, సమాజం దగ్గర జీవితపు వాస్తవాలను ఎదుర్కొనే జ్ఞానం ఉండదు.

– ప్రదీప్ మ్యాగజైన్, రచయిత

వైజ్ఞానిక వేగుచుక్కలు

డాక్టర్ కావడానికి పోరాటం

యూరోపియన్ వైద్యశాస్త్రాన్ని అభ్యసించిన, అలాగే అమెరికాలో చదివిన తొలి భారతీయ మహిళగా ఆనంది బాయి జోషి పేరుగాంచారు. ఆమె అసలు పేరు యమున. 1865 మార్చి 31న అప్పటి బొంబాయి ప్రెసిడెన్సీలో జన్మించారు. అప్పటి సమాజానికి స్త్రీల విద్య, వారి పురోగతి పట్ల తిరస్కార దృష్టి ఉండేది. ఇరవై ఏళ్ల పెద్దవాడైన గోపాలరావు వినాయక్ జోషితో తన తొమ్మిదవ యేటనే ఆమెకు వివాహమయ్యింది. అతడు తన భార్యను చదివించాలని తలచాడు. చదవకుండా వంటగదిలో ఉంటే కఠినంగా శిక్షించే తత్వం అయనది.



ఆనంది బాయి జోషి

1878లో ఆనంది ఓ బిడ్డను కన్నది. కానీ సరైన వైద్య సదుపాయం లేకపోవడం వల్ల పది రోజుల్లోనే బిడ్డను కోల్పోయింది. అందుకే తాను వైద్యశాస్త్రం అభ్యసించాలని సంకల్పం చేసుకుంది. రెండేళ్ల ఉత్తరప్రత్యుత్తరాల ఫలితంగా మిసెస్ కార్పెంటర్ పైచదువుకోసమని ఆనంది బాయిని అమెరికాకు ఆహ్వానించింది. ఆమె అమెరికా వెళ్లడానికి వీల్లేదంటూ బంధువులూ, ఇతరులూ అనేక ఇబ్బందులు కలుగజేశారు. చివరకు ఆనందిబాయి తన గాజులు అమ్ముకుని 1883 ఏప్రిల్ ఏడవ తేదీన మిషనరీలతో కలిసి కలకత్తా నుంచి ఓడలో అమెరికా బయలుదేరింది. అప్పటి వైస్రాయ్ విదేశాలలో ఆమె చదువు కోసం 200 రూపాయలు బహూకరించారు.

శుద్ధ శాకాహారి అయిన ఆనంది బాయి పలు రకాలుగా ఇబ్బందులు పడి, చివరకు 1883 జూన్ 18న న్యూయార్క్ చేరినప్పుడు ఆమెను కార్పెంటర్ ఆహ్వానించారు. పెన్సిల్వేనియాలోని మహిళా వైద్య కళాశాలలో ప్రాథమిక విద్యార్హతతో ఆనంది బాయి ప్రవేశం పొందింది. ఒకవైపు కడు శీతలం, మరోవైపు సరిగా లేని భోజనం... వీటి మధ్య ఆమె తొలుత డిఫ్తీరియా, అటు పిమ్మట క్షయ వ్యాధి బారిన పడ్డారు. అతికష్టం మీద 'ఆర్యులైన హిందువులలో ప్రసూతి విధానాలు' అనే పరిశోధనాంశంతో 1886 మార్చిలో ఎమ్‌డీ పట్టా పొందారు. ఆమె 1886 చివరన భారత దేశం తిరిగి వచ్చారు. కొల్హాపూర్ సంస్థానాధీశులు ఆల్బర్ట్ ఎడ్వర్డ్ హాస్పిటల్లో ఆమెను మహిళా విభాగానికి బాధ్యులైన డాక్టర్‌గా నెలకు 300 రూపాయల జీతంతో నియమించారు.

కానీ ఆమె ఆ ఉద్యోగంలో చేరకమునుపే క్షయ వ్యాధి ముదరడం వల్ల 22 ఏళ్ల వయసులో 1887 ఫిబ్రవరి 26న తల్లి గంగాబాయి ఒడిలో కన్నుమూశారు. ఆమె వైద్యురాలిగా సేవలందించక పోయినా, తర్వాత కాలంలో ఎంతోమంది మహిళలకు వైద్య శాస్త్ర చదువు, విదేశీ చదువుల పట్ల ఆసక్తిని ప్రేరేపించ గలిగారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్,
విశ్రాంత ఆకాశవాణి అధికారి । 9440732392

త్యాగానికి సంకేతం మొహర్రం

మొహర్రం గ్రామీణ ప్రాంతాల్లో పీర్ల పండుగగా ప్రసిద్ధి. ప్రవక్త మనుమడు తన ప్రాణత్యాగంతో విశ్వజనుల శాంతియుత సహజీవనానికి శ్రీకారం చుట్టిన మాసం మొహర్రం. ఇస్లాం క్యాలెండర్‌లో మొట్టమొదటి మాసం కూడా ఇదే. దీన్ని కుల, మతాలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు పండుగలా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో విశేషంగా శోక దినాలుగా పాటిస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాల్లో మొహర్రంను 10 రోజుల పాటు వేడుకగా నిర్వహించుకుంటారు.

మొహమ్మద్ ప్రవక్త నిర్యాణం తర్వాత పాలనా బాధ్యతలు చేపట్టిన తొలి నలుగురు ఖలీఫాలు హజరత్ అబూబకర్ సిద్దీఖ్(ర అ), హజ్రత్ ఉమర్ ఫారూక్ (ర అ), హజరత్ ఉస్మాన్ (ర అ), హజరత్ అలీ (ర అ) ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలించారు. అనంతర కాలంలో అధికారం కోసం పోరు ప్రారంభమైంది. ప్రవక్త ఆదేశాలనుసారం అబ్దుల్ ఘని తర్వాత ఖలీఫాగా ప్రవక్త అల్లుడైన హజరత్ అలీకి ఖిలాఫత్ దక్కాల్సి ఉండగా తద్విరుద్ధంగా రాజ్య భారంతో పాటు పీఠాధిపత్యాన్ని కూడా హజరత్ అమీర్ మావియా కైవసం చేసుకున్నాడు. ఆయన తదనంతరం హజరత్ అలీ ఖిలాఫత్‌కు రాగా మావియా కుమారుడైన ఎజీద్ తన తండ్రి తర్వాత తనకు పరిపాలనతో పాటు పీఠాధిపత్యం కావాలని దేశంలో ఆందోళన సృష్టించాడు. హజరత్ అలీ తర్వాత ఆయన పెద్ద కుమారుడు హజరత్ ఇమామే హసన్ (ర అ)కు ఖిలాఫత్ దక్కింది. శాంతికాముకుడు, మానవతావాది, వివాద రహితుడు అయిన హసన్ దేశంలో నెలకొన్న అశాంతిని రూపుమాపేందుకు ఒక ఒప్పందం ప్రకారం ఖిలాఫత్‌ను వదులుకోవడానికి సిద్ధపడ్డారు. దీంతో తనకు తానే రాజుగా ఖలీఫాగా ప్రకటించుకున్న ఎజీద్ దుష్ట పాలనకు శ్రీకారం చుట్టాడు. దుర్గుణుడైన ఎజీద్ ప్రజలను పీడించడం, హింసించడంతో ప్రవక్త నబువత్ పొందే నాటికి ముందు ఉన్న పరిస్థితులు పునఃప్రవేశించడం ప్రారంభమయ్యాయి.



ఇదంతా చూసి కలత చెందిన ప్రవక్త మనవడు హజరత్ ఇమామే హుస్సేన్ చర్చల ద్వారా పరిస్థితులను చక్కదిద్దడానికి మొహర్రం నెల మొదటి రోజున తన కుటుంబంతో సహా రాజధాని కూఫాకు బయలుదేరారు. ఆయన చర్చల కోసం రాజధాని చేరుకుంటే తన అధికారానికి ముప్పు తప్పదనీ, ఆయన బతికి ఉంటే తన మనుగడ అసాధ్యమనీ తలచిన ఎజీద్ వేలాది సైన్యంతో మార్గమధ్యంలోనే హుస్సేన్ బృందాన్ని అడ్డగించి కర్బలా మైదానంలో దిగ్బంధనం చేశాడు. ప్రాణం దక్కించుకోవాలంటే తనను రాజుగా అంగీకరించాలని, ఖిలాఫత్ అప్పగించాలని ఆదేశాలు జారీ చేశాడు. మూడు రోజులపాటు ఆహారం నీరు అందకుండా కఠిన ఆంక్షలు విధించాడు. అలా మొహర్రం నెల మొదటి ఆరురోజులు ప్రయాణించి కర్బలా చేరిన హుస్సేన్ బృందం మూడు రోజులు నిర్బంధంలో ఉంది. పదవ రోజు నాటికి ఎజీద్ సైన్యంతో భీకర పోరాటం చేయక తప్పలేదు.

అభం శుభం తెలియని ఏడాదిన్నర పసిబిడ్డ 'అలీ అస్గర్' దాహం తీర్చడానికి గుక్కెడు తాగునీరు అందించమని ఫిరాత్ నదిని దిగ్బంధనం చేసిన సైన్యాధ్యక్షుడు హుర్మిలాను కోరగా ఆ కఠినాత్ముడు కర్కశంగా బాణాన్ని పసివాడి అంగిటకు సంధిండంతో అసువులు బాసిన వైనం చూశారు హుస్సేన్. అంతేకాక కళ్ళ ఎదుట శవాలుగా పడిన బంధువులను చూశారు. అంతే... తండ్రి నుంచి వారసత్వంగా లభించిన కరవాలం (జుల్ఫికార్) చేతబట్టి ఎజీద్ సైన్యంపై విరుచుకుపడ్డారు. వేలాది శత్రువులను చీల్చి చెండాడుతూ శత్రు సైన్యం వైపు దూసుకెళ్ళడంతో శత్రు సైన్యం కకావికలమైంది. అయితే చుట్టుముట్టిన శత్రు సైనికుల అస్త్రాలు అశ్వాన్ని నేలకూల్చి హుస్సేన్ శరీరాన్ని తూట్లు చేశాయి. రక్తసిక్తమైన శరీరంతో నేల కొరిగిన హుస్సేన్ చివరి నమాజుకు ఉపక్రమించగా 'షుమ్రేలైన్' ప్రవక్త మనమడి మెడ నరకడంతో ప్రపంచం నిర్ఘాంత పోయింది. శోకతప్త హృదయంతో గొల్లుమంది. ఆ ధర్మవీరుని రక్తంతో తడిసిన కర్బలా మైదానంలో రక్తం ఏరులైపారింది. క్రీ.శ.680 అక్టోబర్ 10 శుక్రవారం మొహర్రం నెల పదవ రోజు ఈ సంఘటన జరిగింది.

కర్బలా మైదానంలో షహదత్ (అమరత్వం) పొందిన వీరుల ఆత్మ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఖురాన్ పఠిస్తూ వచ్చే పుణ్యాన్ని కర్బలా వీరుల ఆత్మలకు అందించమని భగవంతున్ని కోరుకుంటారు. 2024 జూలై నెల 17న 'యౌమే ఆషురా'గా దీన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకోనున్నారు.

– డా॥ ఎస్. ఎం. బాషా
(జూలై 7న ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభం)

ఒక్క చెట్టంటే ఐదు ఏసీలు

ప్రస్తుత సంవత్సరం ప్రపంచ జనాభా అధిక వేడిని ఎదుర్కొంది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిపోయాయి. గత కొన్ని రోజుల క్రితం మక్కాలో ఉష్ణోగ్రతలు 51 డిగ్రీల కంటే ఎక్కువ ఉండటము వలన సుమారు 1,300 మంది హాజ్ యాత్రికులు మరణించారు. ఈ పరిస్థితులు భూగోళంపై పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన మానవాళికి రాబోయే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

పారిస్ ఒప్పందం ప్రకారం 'భూ ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక విప్లవ కాల పూర్వ స్థాయిల (1850–1900) కంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు పరిమితం చేయాలి. కానీ ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 2019 నాటికే పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 1.1 డిగ్రీలకు చేరుకోవడం గమనార్హం.

మానవుని కార్యకలాపాల వలన వాతావరణంలోనికి విడుదల చేయబడిన కార్బన్ డైయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఫ్లోరినేటెడ్ వాయువులు వంటి గ్రీన్‌హౌస్ వాయువులు భూమి ఉష్ణోగ్రత పెరుగుదలకు ముఖ్య కారణం. అడవులను నరికివేయడం, బొగ్గు, చమురు వాయువులు వంటి శిలాజ ఇంధనాలను కాల్చడం వల్ల కార్బన్ డైయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వాతావరణం లోనికి విడుదల అవుతున్నాయి. ఆవులు, గొర్రెలు తమ ఆహారాన్ని జీర్ణం చేసుకొన్నప్పుడు పెద్ద మొత్తంలో మీథేన్‌ను ఉత్పత్తి చేస్తాయి. నైట్రోజన్ కలిగిన ఎరువులను వాడడం వలన నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు విడుదలవుతాయి. ఏరోసోల్స్ స్ప్రేలు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషన్ పరికరాలు, ఉత్పత్తుల నుండి ఫ్లోరినేటెడ్ వాయువులు విడుదలవుతాయి.

గాలిలో లేదా ఏదైనా వాయువులో సూక్ష్మ స్థితిలోని ఘన లేదా ద్రవ కణాలు ఉన్నట్లయితే వాటిని ఏరోసోల్స్ అని పిలుస్తారు. శిలాజ ఇంధనాలు, గడ్డివంటి జీవపదార్థాలను కాల్చడం వలన ఏరోసోల్స్ వాతావరణం లోనికి విడుదలై వారాల పాటు గాలిలోనే ఉంటాయి. ఇవి సూర్యరశ్మిని గ్రహించవచ్చు లేదా భూమిపైకి తిరిగి దానిని పరావర్తనం చెందించవచ్చు. ఫలితంగా భూమి వేడెక్కుతుంది.

నలుపు కార్బన్ (మసిలో ఒక భాగం) వంటివి భూమి మీదికి వచ్చే పరావర్తనం చెందిన సూర్యరశ్మిని గ్రహించడమే కాకుండా, ఇన్ఫ్రారెడ్ రేడియేషన్‌ను కూడా గ్రహించి గ్లోబల్ వార్మింగ్‌ను పెంచుతాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నివారించడానికి సరైన పరిష్కారం గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను తగ్గించడం, చెట్లను పెంచడం. ఒక మామిడి చెట్టు ఐదు ఎయిర్ కండీషనర్లకు సమానం. భూమిని కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరునిది కాబట్టి చెట్లను కాపాడుకుందాం, సాధ్యమైనన్ని చెట్లను పెంచుకుందాం.

– డా॥ శ్రీధరాల రాము
ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్
శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్.

గ్రహం అనుగ్రహం శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.పాడ్యమి తె.3.45 వరకు (తెల్లవారితే ఆదివారం) తదుపరి విదియ, **నక్షత్రం:** పునర్వసు తె.4.56 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.4.38 నుండి 6.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.33 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** రా.2.44 నుండి 3.46 వరకు; **రాహుకాలం** : ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం** : మ.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం** : 5.34, **సూర్యాస్తమయం** : 6.33.

క్లుప్తంగా...

9, 16వ తేదీల్లో శ్రీవారి బ్రేక్ దర్శనాలు రద్దు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9, 16 తేదీల్లో బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా జూలై 8, 15వ తేదీల్లో సిఫారసు లేఖలు స్వీకరించరు.

అభయారణ్యంలో మానవ సంచారం నిషేధం

- సెప్టెంబర్ 30 వరకు పర్యాటక కేంద్రాల మూసివేత

ఆత్మకూరు రూరల్: పులుల సంతానోత్పత్తి కాలం(జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30) పురస్కరించుకుని నాగార్జున సాగర్–శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో మానవ సంచారాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ పీటీ బీఎల్ఎన్ మూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు నెలలు అభయారణ్యంలో పర్యావరణ పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుణ్యక్షేత్రాలైన రుద్రకోడు, గుండ్ల బ్రహ్మేశ్వరం వెళ్లడంపైనా ఆంక్షలు విధించారు. ఎకోటూరిజం ఆన్‌లైన్ బుకింగ్‌లు కూడా రద్దు చేశారు. పులులు స్వేచ్ఛగా సమాగ సమయాన్ని వినియోగించుకుని ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంఖ్యను పెంచుకునే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. ఎన్‌సీసీ, సైనిక సంతతి, క్రీడా, వికలాంగ, స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా అభ్యర్థులు ట్రిపుల్ ఐటీలో సీటు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ పరిశీలన నిర్వహించారు. ఎన్‌సీసీ కోటాకు సంబంధించి 1,141 మంది, క్రీడా కోటాకు సంబంధించి 796 మంది, వికలాంగుల కోటాకు సంబంధించి 249 మంది, సైనిక సంతతి కోటాకు సంబంధించి 167 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాకు సంబంధించి 162 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ నెల 11న ప్రత్యేక కేటగిరీ కోటా సీట్లకు మినహా మిగిలిన సీట్లకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలనను నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన వారికి ఆయా ట్రిపుల్ ఐటీల్లో జూలై 22, 23వ తేదీల్లోను, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి ఇడుపులపాయ ప్రాంగణంలో జూలై 24, 25వ తేదీల్లోను, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో జూలై 26, 27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అచ్యుతాపురం సెజ్ కాలనీలో డయేరియా కలకలం



అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా): అచ్యుతాపురం మండలంలో డయేరియా కలకలం రేపింది. మూడు రోజులుగా దిబ్బపాలెం పరిధిలోని మోటూరుపాలెం సెజ్‌కాలనీలో పలువురు డయేరియా బారిన పడి అస్వస్థతకు గురవడంతో అధికారులు పరుగులు తీశారు. మోటూరుపాలెం శివారు కాలనీలోని 51 గడపలు ఉండగా మూడు రోజుల క్రితం ఇద్దరు చిన్నారులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో కేవలం పది మందికి మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. మిగిలిన వారు ఆరుబయట ప్రాంతానికి వెళతారు. ఈ కారణంగానే డయేరియా వ్యాపించిందని వైద్యులు చెబుతున్నారు. సుమారు 18 మంది అస్వస్థతకు గురవ్వగా, వీరిలో కొందరు విశాఖ కేజీహెచ్‌లోనూ, మరికొందరు అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలోనూ, మిగిలిన వారు అచ్యుతాపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడి హత్య

సాక్షి, చెన్నై: బహుజన్ సమాజ్‌వాది పార్టీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ శుక్రవారం రాత్రి చెన్నైలో దారుణ హత్యకు గురయ్యారు. చెన్నైకు చెందిన ఆమ్‌స్ట్రాంగ్ గతంలో పలు పార్టీల్లో పనిచేశారు. కొన్నేళ్లుగా ఆయన బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాజకీయంగా బీఎస్పీ బలోపేతానికి ప్రయత్నాలు చేయడమే కాకుండా తమిళనాడులో ప్రతి ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెడుతూ వచ్చారు. చెన్నై అయనావరంలో నివాసం ఉంటున్న ఆయన సెంబియం ప్రాంతంలో కొత్త ఇంటిని నిర్మిస్తున్నారు. ఈ పనులను పరిశీలించేందుకు ఆయన శుక్రవారం సాయంత్రం వెళ్లారు. రాత్రి హఠాత్తుగా ఆరుగురు వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై వచ్చి ఆయనపై విచక్షణా రహితంగా కత్తులతో దాడిచేశారు. రక్తపు మడుగులో పడిఉన్న ఆమ్‌స్ట్రాంగ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆయన మృతిచెందారు. ఈ సమాచారంతో బీఎస్పీ నాయకులు ఆందోళనలకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు 10 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తుచేస్తున్నారు. ఇది రాజకీయంగా జరిగిన హత్యకాదని.. దీనివెనుక మరేదైనా కారణాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పుంగనూరులో 'అధికార' అరాచకం

వైఎస్సార్‌సీపీకి ఓటేసిన వారే టార్గెట్‌గా రెచ్చిపోతున్న టీడీపీ

- పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు
- ఇళ్లలోకి చొరబడి మరీ దాడులు
- తీవ్రగాయాలతో పలువురు ఆసుపత్రి పాలు
- ఊర్లొదిలిపెట్టి వెళ్లిపోతున్న బాధితులు
- కమ్మపల్లిలో దౌర్జన్యంగా లక్ష ఇటుకల తరలింపు.. బట్టీ ధ్వంసం
- తాగునీటి ట్యాంకులూ కూల్చివేత
- వైఎస్సార్‌సీపీకి ఓటేసిన వారందరికీ పాలు సరఫరా నిలిపివేత
- సోమల మండలంలో 75 మందికి పెన్షన్లు నిలిపివేత
- పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించని వైనం
- ఊర్లొదిలి పెట్టి ఎక్కడికైనా వెళ్లాలని చెబుతున్న పోలీసులు





రొంపిచెర్ల మండలంలో టీడీపీ నేతలు కూల్చివేసిన తాగు నీటి ఓవర్ హెడ్ ట్యాంకు

అధికార మదం: పుంగనూరు ఎమ్మెల్యేగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విజయాన్ని తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతోంది. వారిద్దరూ పుంగనూరులో పర్యటిస్తే అక్కడ టీడీపీకి పుట్టగతులుండవన్న విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైంది. అందుకే ఎమ్మెల్యే, ఎంపీలనే పుంగనూరులో అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నారు. పోలీసులతో ఇద్దరినీ హౌస్ అరెస్టు చేయించారు.

దాడుల పరంపర: సోమల మండలం నంజంపేట, కమ్మపల్లి, కందూరు, ఇరికిపెంట గ్రామాల్లో పలువురి ఇళ్లలోకి చొరబడి, వారిపై దాడులు చేశారు. వీరంతా తీవ్ర గాయాలతో తిరుపతి రుయా, సోమల ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

అధికార గూండాయిజం: కమ్మపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి నివాసంలోకి జొరబడ్డ టీడీపీ గూండాలు ఆయన్ని చితక్కొట్టారు. ఆయన ఇటుకల బట్టీలోని ఇటుకలను తరలించి, ఆ బట్టీని ధ్వంసం చేశారు. ఫోన్లను నాశనం చేశారు. దీంతో ఆయన కుటుంబంతో సహా ఊరొదిలి వెళ్లిపోయారు.

ఖాకీల కాఠిన్యం: ఓ పక్క టీడీపీ గూండాల దాడులకు బెంబేలెత్తుతున్న ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తే వారికి ఊహించని సమాధానం ఎదురవుతోంది. మీరే ఊరొదిలి పెట్టి ఎక్కడికైనా వెళ్లిపోండంటూ పోలీసు అధికారులు కొందరు సమాధానమివ్వడం బాధితులను మరింత భయభ్రాంతులకు గురి చేస్తోంది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా పుంగనూరులో అధికార మదంతో టీడీపీ శ్రేణులు సాగిస్తున్న అరాచక కాండ ఇది. ఫ్యాన్ గుర్తుకు ఓటేసిన ప్రతి ఒక్కరినీ లక్ష్యంగా చేసుకొని టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు. ప్రతి రోజూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. నివాసాల్లోకి చొరబడి తరిమి తరిమి కొడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను కూల్చివేస్తున్నారు. టీడీపీ శ్రేణుల దాడులతో తీవ్రగాయాలైన అనేక మంది పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరి కొందరు ఊళ్లొదిలి రహస్య ప్రాంతాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి. సోమల మండలం నంజంపేట, కమ్మపల్లి, కందూరు, ఇరికిపెంట గ్రామాల్లో సుబ్రమణ్యంరెడ్డి, ఇంతియాజ్ బాషా, ప్రసాద్, భానుప్రకాష్, రమేష్, మునీశ్వర్, మోహన్‌బాబు, గంగులప్ప నివాసాల్లోకి చొరబడి, వారిపై దాడులు చేశారు. వీరంతా తీవ్ర గాయాలతో తిరుపతి రుయా, సోమల ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం కమ్మపల్లిలో వంద మందికి పైగా టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం రెడ్డి ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలికి జొరబడ్డారు. ఇంట్లో ఉన్న సుబ్రమణ్యంరెడ్డిని ఈడ్చుకొచ్చి కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. ఆయన ఇటుకల బట్టీలోని లక్ష ఇటుకలను దౌర్జన్యంగా ట్రాక్టర్లతో తరలించుకెళ్లారు. బట్టీని ధ్వంసం చేశారు. ఫోటోలు, వీడియోలు తీయకుండా మొబైల్ ఫోన్లు లాక్కుని నేలకేసి కొట్టి నాశనం చేశారు. ఈ విషయం బయటకు పొక్కితే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతామని హెచ్చరించారు. దీంతో ప్రాణ భయంతో సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం ఊరొదిలి వెళ్లిపోయింది. ఇలాంటి ఘటనలో గత నెల రోజుల్లో అనేకం జరిగాయి. అయినా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడంలేదు. టీడీపీ నేతల దాడుల విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు.

తాగు నీటి ట్యాంకులూ కూల్చివేత

వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను సైతం టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నారు. కరువు ప్రాంతాల్లో ఒకటైన పుంగనూరు నియోజకవర్గంలో ప్రజల తాగు నీటి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి నిధులు మంజూరు చేయించారు. 20 వేల లీటర్ల సామర్థ్యంతో నియోజకవర్గం మొత్తం రూ.60 కోట్లతో 550 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ప్రజలకు మంచి నీరందించే ఈ ట్యాంకులను కూడా టీడీపీ నేతలు కూల్చివేస్తున్నారు. రొంపిచెర్ల మండలం బోడిపాటివారి పల్లిలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకును రెండు రోజుల క్రితం టీడీపీ నేతలు జేసీబీలతో కూల్చివేసి, పనులకు తెచ్చిన ఇనుప కమ్మీలను ఎత్తుకెళ్లిపోయారు. రొంపిచెర్ల క్రాస్ కురప్పల్లి వద్ద రూ. 15 లక్షలతో రెండో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. దీనిని కూడా జేసీబీలతో కూల్చివేశారు. ప్రజాధనంతో గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులను సైతం కూల్చివేయడం టీడీపీ నీచ మనస్తత్వానికి నిదర్శనమని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్లు నిలిపివేత

ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. కమ్మపల్లిలో పొన్నెమ్మ, యశోదమ్మ, శివారెడ్డితో పాటు సోమల మండలం పరిధిలో 75 మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్లు నిలిపివేశారు. ఈ విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలు సరఫరా నిలిపివేయండి

కమ్మపల్లిలో వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చిన పది కుటుంబాలకు పాలు కూడా అందకుండా టీడీపీ నేతలు దాష్టీకం ప్రదర్శిస్తున్నారు. ఈ కుటుంబాలకు పాల సరఫరా నిలిపివేయాలని టీడీపీ నేతలు డెయిరీ యజమానులకు ఫోన్‌చేసి హుకుం జారీ చేసినట్లు బాధితులు వాపోయారు. వారికి పాలు సరఫరా చేస్తే వ్యాను తగులబెట్టేస్తామని టీడీపీ నేతలు హెచ్చరించినట్లు సమాచారం.

అప్పు తీసుకోకపోయినా చెల్లించాలట

పుంగనూరులో దుస్తుల దుకాణం నడుపుతున్న కె.జయంతి వైఎస్సార్‌సీపీకి ఓటేశారని టీడీపీ శ్రేణులు ఆమెకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగారు. అంతటితో ఆగకుండా.. పోలీసుల ద్వారా ఆమెకు ఫోన్ చేయించి 'మీరు రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారంట. వెంటనే చెల్లించకపోతే కేసు నమోదు చేస్తాం' అని బెదిరించినట్లు తెలిసింది. ఈ విషయం గురించి ఆమెను సంప్రదిస్తే తాను ఎవ్వరికీ బకాయిలేనని, ఉంటే ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు.

ఊరొదిలి వెళ్లి దాక్కోండి

టీడీపీ దాడులతో కమ్మపల్లి ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. పోలీసులు కూడా ఊరొదిలి వెళ్లిపోవాలని చెబుతుండటంతో మరింత భయకంపితులవుతున్నారు. టీడీపీ నేతలు ఆస్తులు కూడా ధ్వంసం చేస్తున్నారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే బాధ్యత లేకుండా వ్యవహరించటంపై న్యాయనిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నూతన చట్టాలతో నేరాలు తగ్గుముఖం

హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ శర్మ

ఏర్పేడు (తిరుపతి జిల్లా): కేంద్ర ప్రభుత్వం సవరించిన నూతన చట్టాలతో దేశంలో నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ తెలిపారు. శుక్రవారం ఏర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా కమిషన్ రిపోర్ట్, సుప్రీం కోర్టు తీర్పులు, వివిధ రంగాల్లోని న్యాయ నిపుణుల అభిప్రాయాల సేకరణతో కొత్త చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. కమ్యూనిటీ సర్వీసెస్ అనే పనిష్మెంట్‌ను కొత్తగా తీసుకొచ్చినట్లు వివరించారు. అలాగే మహిళలు, చిన్నపిల్లలపై రోజురోజుకూ పెరుగుతున్న వివిధ నేరాలకు ప్రత్యేకమైన వివరణ, చాలా కఠినమైన శిక్షలు, మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. భారతీయ నేర సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్యా అధినియం 2023 అనే మూడు కొత్త చట్టాలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. దేశంలోని నేర, న్యాయ వ్యవస్థకు కొత్త చట్టాలు, వాటి చిక్కుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సెషన్స్ జరిగింది. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్, డీన్ అడ్మిన్ రాఘవేంద్రరావు, రిజిస్ట్రార్ సుమిత్ బిస్వాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం ఆస్తుల ధ్వంసం

జేసీబీతో మూడు షాపులను కూల్చివేత

- చంద్రగిరిలో బరితెగిస్తున్న టీడీపీ శ్రేణులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): అధికార మత్తులో టీడీపీ నేతలు బరితెగిస్తున్నారని, దేవాలయం ఆస్తులను ధ్వంసం చేశారని చంద్రగిరి వాసులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి జామాండ్ల వీధికి చెందిన శ్రీరామ భజన మందిరం ఆలయ కమిటీ పెద్దలు కిరణ్‌కుమార్, పద్మ, ప్రమీల, రెడ్డెమ్మ, లక్ష్మమ్మ, రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కాలనీలో శ్రీరామ భజన మందిరంలో ఏటా శ్రీరామ నవమి, ఆంజనేయస్వామి జయంతి, వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్వాహణ కోసం ఆలయ ప్రాంగణంలో 2020లో మూడు షాపులను నిర్మించామని.. వీటి నుంచి ప్రతీనెలా రూ.25 వేలకు పైగా ఆదాయం వస్తుందని, వీటితో పాటు భక్తులు అందించే విరాళాలతో ఆలయ నిర్వాహణ చేస్తున్నట్లు చెప్పారు. అయితే, ఈ షాపులపై కన్నేసిన టీడీపీ నేతలు అమర్నాథరెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, విరూపాక్షి నవీన్ కుమార్‌రెడ్డి, ఉగ్రాణం గురునాథ్‌రెడ్డి, గౌస్‌బాషాతో పాటు మరికొందరు గత నెల 30న ఈ షాపులను కూల్చేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. అప్పుడు గ్రామస్తులు, ఆలయ కమిటీ పెద్దలు అడ్డుకోవడంతో వెనుదిరిగారని.. అయితే శుక్రవారం సాయంత్రం చంద్రగిరి కొత్తపేటకు చెందిన మన్సూర్, దేవేంద్ర కలిసి జేసీబీతో షాపులను దౌర్జన్యంగా కూల్చివేశారని ఆరోపించారు. ఆలయ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని, కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై నాన్ బెయిలబుల్ కేసు

కాకినాడ క్రైం: అధికారం చేపట్టడంతోనే కూల్చివేతల పర్వానికి తెరతీసిన కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జులుం ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగా కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై తాజాగా కేసు నమోదు అయింది. నగరంలోని గొడారిగుంట ప్రాంతానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బళ్ల సూరిబాబు ఇంటి పైఅంతస్తులో నిర్మిస్తున్న పెంట్ హౌస్ కూల్చివేత వివాదాస్పదమైంది. ఈ నెల 3వ తేదీన జరిగిన ఘటనలో స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశాలతో రెచ్చిపోయిన మున్సిపల్ అధికారుల వైఖరిని ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఖండించారు. ఘటనా స్థలికి వెళ్లి కూల్చివేతను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. వారి మాట ప్రకారం వెళ్లిపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ద్వారంపూడిపై కాకినాడ పోలీసులు కేసు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణతో ద్వారంపూడితోపాటు మరో 24 మందిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

టీడీపీ నేతల 'ఖనిజ' దోపిడీ

- నర్సింగపాడులోని పోరంబోకు భూమిలో భారీగా తవ్వకాలు
- అత్యంత విలువైన క్వార్జ్ క్రిస్టల్ రాళ్ల తవ్వకాలు
- బుధవారం రాత్రే రూ.20 లక్షల విలువైన రాళ్ల తరలింపు
- పట్టించుకోని అధికారులు



అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం (ఇన్‌సెట్‌లో) ఖరీదైన క్రిస్టల్ రాయి

నకరికల్లు: అధికారం అండ చూసుకొని పలువురు టీడీపీ నేతలు సహజ వనరుల దోపిడీకి ఒడిగట్టారు. నిబంధనలను కాలరాసి విలువైన ఖనిజ సంపదను దోచుకొంటున్నారు. పల్నాడు జిల్లాలోని అత్యంత విలువైన క్రిస్టల్ రాళ్లను అర్ధరాత్రి వేళ తరలించేస్తున్నారు. కోట్లాది రూపాయల ఖనిజం తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం నర్సింగపాడు సర్వే నంబర్ 97లో రెవెన్యూ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిలో క్వారెట్జ్ క్రిస్టల్ రాయి నిక్షేపాలు ఉన్నాయి. తెల్లగా వజ్రంలా మిరుమిట్లు గొలుపుతూ ఈ రాళ్లు కనిపిస్తాయి. మార్కెట్‌లో వీటి ధర టన్ను రూ.లక్షల్లో పలుకుతుంది. ఈ రాళ్లతో గాజు వస్తువులు, విలువైన గృహోపకరణాలు తయారు చేయవచ్చని మైనింగ్ శాఖ అధికారులు గతంలో తేల్చారు. దీంతో కొందరు టీడీపీ నేతలు రాత్రి వేళ పొక్లెయిన్లతో ఇష్టారాజ్యంగా వీటిని తవ్వేస్తున్నారు. వాహనాల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న ప్రాంతాలకు తరలించి దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి ఒక్క రోజే సుమారు రూ.20 లక్షల విలువైన క్రిస్టల్ రాళ్లను తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత పెద్ద స్థాయిలో దోపిడీ జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ విషయమై తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

'పట్టిసీమ' పైప్‌లైన్ లీక్

20అడుగుల ఎత్తుకు భారీగా ఎగసిపడిన గోదావరి నీరు



ఎగసిపడుతున్న గోదావరి నీరు

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ లీకై 20 అడుగుల మేర నీరు ఎగసిపడింది. సమీపంలోని పొలాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. యథావిధిగా శుక్రవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేసి కుడి కాలువలోకి నీరు విడుదల చేశారు. అయితే మార్గమధ్యంలో చీకడోడిమెట్ట ప్రాంతంలో భారీగా నీరు లీకై పొలాల్లోకి చేరుతోంది. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టిసీమ ఇంజనీరింగ్ అధికారులు మోటార్‌లను నిలిపివేసి పైప్‌లైన్ పరిస్థితిని పరిశీలించారు. చీకడోడిమెట్ట ప్రాంతంలో ఎయిర్ వాల్ ప్లేట్ లేకపోవడంతో నీరు ఎగసిపడినట్టు గుర్తించి మరమ్మతులు చేశారు. అనంతరం నీటి విడుదలను పునరుద్ధరించారు. గతంలో పైప్‌లైన్ ఎయిర్ వాల్ ప్లేట్‌ను తొలగించి రైతులు సాగునీటిని వినియోగించుకున్నారని, ఆ తర్వాత ప్లేట్ సరిగా బిగించకపోవడం వల్ల నీటి ఒత్తిడికి అది ఎగిరిపోయి నీరు ఎగసిపడినట్టు డీఈ ఆర్.పెద్దిరాజు తెలిపారు. కాగా, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల రెండో తేదీన పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి హడావుడిగా కుడి కాలువకు నీటిని విడుదల చేశారని, పైప్‌లైన్‌ను పూర్తిగా పరిశీలించి మరమ్మతులు చేపట్టే అవకాశం కూడా ఇవ్వలేదని పలువురు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

అవయవదానంతో ఆరుగురికి జీవనదానం

న్యాయవాదికి బ్రెయిన్‌డెడ్



మునగపాటి శివప్రసాద్(ఫైల్)

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన న్యాయవాది తన అవయవాలను దానం చేసి మరో ఆరుగురిలో సజీవంగా నిలిచారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన న్యాయవాది మునగపాటి శివప్రసాద్ (45) తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై మంగళగిరి వస్తుండగా ఈ నెల 3న ఆత్మకూరు కోకోకోలా కంపెనీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ, 4వ తేదీ రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. విషాదానికి లోనైన కుటుంబసభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. శుక్రవారం గ్రీన్ చానల్ ద్వారా ఈ అవయవాలను వివిధ ఆస్పత్రులకు తరలించారు. ప్రభుత్వ అధికారుల సహాయంతో మృతుడి ప్రసాద్ గుండెను గ్రీన్ చానల్ ద్వారా గన్నవరం విమానాశ్రయానికి తరలించి అక్కడి నుంచి తిరుపతి పద్మావతి మెడికల్ కాలేజీకి, కాలేయాన్ని విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి, మూత్రపిండాలను చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి, నేత్రాలను పెదకాకాని శంకర్ నేత్రాలయానికి తరలించారు.

రైతు దంపతుల ఉసురు తీసిన విద్యుత్ తీగలు

గతనెల 14వ తేదీన పొలంలో తెగిపడిన వైనం

- వాటికి మరమ్మతు చేయని విద్యుత్ సిబ్బంది
- నీటి తడి కోసం పైపులను సరిచేస్తుండగా విద్యుదాఘాతం



పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన భార్యభర్తలు ఈశ్వరరావు, ఆదిలక్ష్మి

మెంటాడ: పంట పొలంలో వరి ఆకుమడి తడిపేందుకు వెళ్లి తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి రైతు దంపతులు మృత్యువాత పడిన విషాద ఘటన విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని మీసాలపేటలో శుక్రవారం చోటు చేసుంది. ఉన్న కాస్త పొలాన్ని జీవనాధారంగా చేసుకున్న గ్రామానికి చెందిన రైతు దంపతులు కోరాడ ఈశ్వరరావు (54), ఆదిలక్ష్మి (48) ఒకరి వెంట ఒకరు తనువు చాలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈశ్వరరావు గ్రామ సమీపంలోని పంట పొలంలో వరి ఆకుమడి తడిపేందుకు శుక్రవారం ఉదయం వెళ్లాడు. గోపీనాథ్ పట్నాయిక్ చెరువు నుంచి ఇంజిన్‌తో నీరు తోడేందుకు పైపులు ఏర్పాటు చేసుకునే క్రమంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన భర్త ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ భార్య ఆదిలక్ష్మి వెళ్లింది. భర్త పొలంలో పడిపోయి ఉండడాన్ని చూసి లబోదిబోమంటూ లేపే ప్రయత్నం చేసింది. దీంతో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. అక్కడికి దగ్గరలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ విషయాన్ని గమనించి పరుగున వెళ్లాడు. విద్యుత్ తీగెను పరిశీలించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. మృతుల ఇద్దరు పిల్లల్లో కుమార్తెకు వివాహం జరగగా, కుమారుడు డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువు ప్రవేశ పరీక్షకు రాజమండ్రిలో కోచింగ్ తీసుకుంటున్నాడు. గజపతినగరం సీఐ ప్రభాకర్, ఆండ్ర ఎస్ఐ దేవి ఘటనా స్థలాన్ని పరిశీలించి విద్యుత్ ఏడీ శివకుమార్, ఏఈ తిరుపతిరావుతో మాట్లాడారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరారు.

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణం

గతనెల 14వ తేదీన వీచిన ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయకపోవడం, ఆ తీగెల్లో విద్యుత్ సరఫరా కావడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. రైతు దంపతుల మృతితో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సూళ్లూరుపేటలో షాడో ఎమ్మెల్యే!



ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో సమీక్ష నిర్వహిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలవల విజయశ్రీ పేరుకే ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూఎమ్మెల్యేగా పెత్తనం చేస్తున్నారు. డాక్టర్ అయిన ఎమ్మెల్యే విజయశ్రీని ఎక్కడా నోరు ఎత్తనీయడంలేదు. ఇటీవల సత్యసాయి కళ్యాణమండపంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో వేదికపై ఎమ్మెల్యేతో పాటు ఆమె తండ్రి, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు కూర్చుని అధికారులను నిలబెట్టి మాట్లాడారు. ఎమ్మెల్యే తరఫున ఆమె తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం సమీక్ష నిర్వహించారు. ఇది చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోను ఎమ్మెల్యే నోరు ఎత్తకుండానే ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీనా.. సుబ్రహ్మణ్యమా.. అని అధికారులు, పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నీక్యాప్‌లో రూ.1.16 కోట్ల బంగారం

సాక్షి, చెన్నై: మోకాలినొప్పికి ఉపయోగించే నీక్యాప్‌లో ఓ యువకుడు రూ.1.16 కోట్ల విలువగల బంగారాన్ని తీసుకొస్తూ తిరుచ్చిలోని విమానాశ్రయ భద్రతా అధికారులకు చిక్కాడు. సింగపూర్ నుంచి శుక్రవారం ఉదయం విమానం తమిళనాడులోని తిరుచ్చికి వచ్చింది. అందులోని ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడి కదలికలపై అనుమానం వచ్చింది. తనకు మోకాలినొప్పి ఉందని, అందుకే నీక్యాప్ ధరించానని, అతడు అధికారులకు చూపించాడు. దీంతో వారికి మరింత అనుమానం వచ్చింది. నీక్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా, రెండు కాళ్లకు ఉపయోగించిన నీక్యాప్‌లలో రేకు రూపంలో బంగారం ఉండడం బయటపడింది. వీటి విలువ రూ.1.16 కోట్లుగా నిర్ధారించారు. ఆ యువకుడిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

ఢిల్లీ పోలీసులకు బాలిక అప్పగింత

ముద్దనూరు: ఢిల్లీలో అదృశ్యమైన 15 సంవత్సరాల బాలికను వైఎస్సార్ జిల్లా ముద్దనూరు పోలీసులు గుర్తించి ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. ముద్దనూరు సీఐ దస్తగిరి కథనం మేరకు.. ఢిల్లీలోని విహార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలిక మే నెల 30వ తేదీన అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు గాలింపు చేపట్టారు. బాలిక వద్ద ఉన్న సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆ బాలిక ముద్దనూరులో ఉన్నట్లు గుర్తించారు. గురువారం రాత్రి ఢిల్లీ పోలీసులు ముద్దనూరుకు చేరుకున్నారు. స్థానిక సీఐ దస్తగిరి, కానిస్టేబుల్ దార రమేష్, ఇతర సిబ్బందితో కలిసి సుమారు రెండు గంటల పాటు గాలించి ఆ బాలిక ముద్దనూరులోని ఎంపీడీవో కార్యాలయం వెనుక ఓ ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించారు. బాలిక, ఆమెతో పాటు వచ్చిన యువకుడు మొహమ్మద్ రెహ్మాన్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్ఐ ఇకారాబుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ వికాస్ కుమార్, ఉమెన్ కానిస్టేబుల్ ప్రీత్‌లకు బాలిక తండ్రి సమక్షంలో అప్పగించారు.



ఇక స్టార్మర్ శకం



బ్రిటన్ ఎన్నికల్లో ఘనవిజయం • కన్జర్వేటివ్‌లకు ఘోర పరాజయం

లండన్: అంతా ఊహించిందే జరిగింది. గురువారం జరిగిన బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ ఘనవిజయం సాధించింది. హౌజ్ ఆఫ్ కామన్స్‌లో 650 స్థానాలకు గాను ఏకంగా 412 సీట్లు కైవసం చేసుకుంది. ప్రధాని రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలతో ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఏకంగా 252 స్థానాలు కోల్పోయింది! ఇది ఆ పార్టీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయం. లేబర్ పార్టీకి 33.7 శాతం రాగా కన్జర్వేటివ్‌లకు 23.7 శాతమే లభించాయి. శుక్రవారం మధ్యాహ్నానికల్లా ఫలితాలు వెలువడటం, సునాక్ రాజీనామా చేయడం, లేబర్ పార్టీని విజయపథంలో నడిపిన కియర్ స్టార్మర్ దేశ 58వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం చకచకా జరిగిపోయాయి. దాంతో 14 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెర పడింది. భారత మూలాలున్న తొలి ప్రధాని సునాక్ పాలన కూడా 20 నెలలకే ముగిసింది. రిచ్‌మండ్-నార్త్ అలెర్టన్ స్థానం నుంచి ఆయన ఘనవిజయం సాధించినా మాజీ ప్రధాని లిజ్ ట్రస్‌తో పాటు గ్రాంట్ షేప్స్, పెన్నీ మోర్డంట్, జాకబ్ రీస్ మాగ్ వంటి పలువురు కన్జర్వేటివ్ హేమాహేమీలు ఓటమి చవిచూశారు. దాంతో ఫలితాల అనంతరం మాట్లాడుతూ 44 ఏళ్ల సునాక్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ''లేబర్ పార్టీకి, స్టార్మర్‌కు అభినందనలు. ఘోర ఓటమి చవిచూసిన నా కేబినెట్ సహచరులకు సానుభూతి. నాయకునిగా వారిని గెలిపించుకోలేకపోయినందుకు క్షమాపణలు. ప్రజల అంచనాలు అందుకోలేకపోయినందుకు వారికి కూడా క్షమాపణలు'' అన్నారు. ఓటమికి బాధ్యత వహిస్తూ కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు సునాక్ ప్రకటించారు. అయితే ప్రధానిగా తన బాధ్యతలకు నూరు శాతం న్యాయం చేశానన్నారు. ప్రధానిగా కుటుంబంతో కలిసి అధికార నివాసంలో జరుపుకున్న దీపావళి వేడుకలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''మా తాతల కాలంలో చేతిలో పెద్దగా ఏమీ లేకుండా ఇంగ్లండ్ వచ్చిన కుటుంబం మాది. అలాంటిది రెండే తరాల్లో నేను ప్రధాని కాగలిగాను. నా పిల్లలు డౌనింగ్ స్ట్రీట్ మెట్లపై దీపావళి ప్రమిదలు వెలిగించగలిగారు. అదీ దేశ గొప్పదనం'' అంటూ కొనియాడారు. ''నా వారసునిగా అత్యంత సవాళ్లమయమైన బాధ్యతను స్వీకరిస్తున్న నూతన ప్రధానికి 10, డౌనింగ్ స్ట్రీట్‌కు హార్దిక స్వాగతం. నూతన బాధ్యతల్లో ఆయన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. ఎందుకంటే ఆయన విజయమే మనందరి విజయం. ప్రచారంలో విమర్శలు గుప్పించుకున్నా స్టార్మర్ చాలా మంచి వ్యక్తి. ఆయన వ్యక్తిత్వాన్ని ఎంతగానో అభిమానిస్తాను'' అన్నారు. అనంతరం రాజు చార్లెస్-3కు సునాక్ రాజీనామా సమర్పించారు. తర్వాత భార్య అక్షత, పిల్లలతో కలిసి అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు. స్టార్మర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

తుపానులా వచ్చాడు...

స్టార్మర్ ప్రస్థానం ఆద్యంతం ఆసక్తికరం

నిరుపేద కుటుంబం. తండ్రి పనిముట్ల తయారీ కార్మికుడు. తల్లి నర్సు. నలుగురు సంతానంలో రెండోవాడు. కుటుంబాన్ని నిరంతరం అప్పుల బాధ వెంటాడేది. దాంతో ఫోన్ బిల్లును తప్పించుకునేందుకు దాన్ని నెలల తరబడి వాడకుండా పక్కన పెట్టే పరిస్థితి! ''కార్మికునిగా ఫ్యాక్టరీలో తన తండ్రి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. దాంతో విపరీతమైన ఆత్మన్యూనతకు లోనై జనానికి దూరంగా మెలగడం అలవాటు చేసుకున్నారు'' అంటూ ఆవేదనగా గుర్తు చేసుకుంటారు స్టార్మర్. అందుకే స్థాయిలో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడటం తనకు చిన్నప్పటి నుంచే అలవాటైందని చెబుతారు. లేబర్ పార్టీ తొలి నాయకుడైన కియర్ హార్డీ అంటే తల్లిదండ్రులకు ఎంతో అభిమానం. ఆ పేరునే స్టార్మర్‌కు పెట్టుకున్నారు. ఆయన ఇప్పుడదే పార్టీకి ఘనవిజయం సాధించి పెట్టడమే గాక ప్రధాని పీఠమెక్కడం విశేషం. విపక్షంలో ఉండగా లేబర్ పార్టీ పగ్గాలు చేపట్టి గెలుపు బాటన నడిపిన ఐదో నేతగా కూడా నిలిచారు...

తమ కుటుంబంలో కాలేజీ చదువు చదివిన తొలి వ్యక్తి స్టార్మరే. అప్పుడు కూడా డబ్బుల కటకట బాగా వేధించేది. దాంతో డబ్బుల కోసం స్టార్మర్ ఓసారి బీచ్‌లో మిత్రులతో కలిసి చట్ట విరుద్ధంగా ఐస్‌క్రీం అమ్ముతూ పట్టుబడ్డారు! లీడ్స్‌లో న్యాయశాస్త్రం చదివాక ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్లారు. 1987లో బారిస్టర్ పూర్తి చేశారు. మానవ హక్కుల చట్టంలో స్పెషలైజేషన్ చేశారు. కరీబియన్, ఆఫ్రికాల్లో ఉద్యోగం చేశారు. పని రాక్షసునిగా పేరుపడ్డారు. 2008లో ఇంగ్లండ్, వేల్స్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.

రాజకీయ ప్రవేశం...

స్కూలు దశ నుంచే స్టార్మర్ రాజకీయాల పట్ల మొగ్గు చూపేవారు. తొలుత వామపక్ష రాజకీయ పట్ల ఆకర్షితులయ్యారు. 2015లో 52వ ఏట పూర్తిస్థాయిలో రాజకీయ రంగప్రవేశం చేశారు. ఉత్తర లండన్‌లోని హాల్‌బోర్న్ అండ్ సెయింట్ పాంక్రాస్ నియోజకవర్గం నుంచి 2015లో ఎంపీగా గెలుపొందారు. తాజా మాజీ ప్రధాని రిషి సునాక్ కూడా సరిగ్గా అదే రోజున తొలిసారిగా ఎంపీగా ఎన్నికవడం విశేషం! నాటి లేబర్ పార్టీ నాయకుడు జెరెమీ కార్బిన్‌కు నమ్మకస్తునిగా పేరుబడ్డారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘోర పరాజయంతో కార్బిన్ తప్పుకున్నారు. దాంతో 2020 ఏప్రిల్‌లో స్టార్మర్ లేబర్ పార్టీ నేతగా ఎన్నికయ్యారు. పార్టీలో పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విలువల విషయంలో రాజీ పడేందుకు ససేమిరా అంటారాయన. తమ కంచుకోటైన హార్టిల్‌పూల్ స్థానంలో మూడేళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికలో లేబర్ పార్టీ తొలిసారి ఓటమి చవిచూసింది. ఆ పరాభవానికి బాధ్యత వహిస్తూ పార్టీ సారథ్యం నుంచి తప్పుకోవడానికి స్టార్మర్ సిద్ధపడ్డారు. సీనియర్ నాయకుల విజ్ఞప్తి మేరకు కొనసాగారు. 2019 ఓటమితో చతికిలపడి ఉన్న పార్టీలో జవజీవాలు నింపడమే గాక ఐదేళ్లకే ఘనవిజయం సాధించి పెట్టారు. ఇది తేలిగ్గా ఏమీ జరగలేదు.

పార్టీకి పునర్వైభవం...

లేబర్ పార్టీకి పునర్వైభవం తేవడానికి స్టార్మర్ చాలా కష్టపడ్డారు. హార్టిల్‌పూల్ ఉప ఎన్నిక ఓటమి తర్వాత ఓటర్లను పార్టీ వైపు తిప్పుకోవడంపై దృష్టి సారించారు. వర్సిటీల ట్యూషన్ ఫీజుల రద్దు, ఇంధన, నీటి కంపెనీల జాతీయీకరణ వంటి గత వాగ్దానాల నుంచి వెనక్కు తగ్గారు. ఇది నమ్మకద్రోహమని, పార్టీ వాగ్దానాలను తుంగలో తొక్కారని సీనియర్లే ఆరోపించినా వెనక్కు తగ్గలేదు. కొన్నేళ్లుగా బ్రిటన్‌లో ఉద్యోగ సంక్షోభం నెలకొంది. ధరలు విపరీతంగా పెరిగి, ప్రజల ఆదాయం తగ్గి జీవన ప్రమాణాలు పడిపోయాయి. వీటితో పాటు ప్రధాన సమస్యయిన ఆరోగ్య రంగంపైనా స్టార్మర్ దృష్టి సారించారు. బ్రిటన్‌లో వైద్య సేవలుందించే ప్రభుత్వ విభాగం ఎన్‌హెచ్‌ఎస్‌లో వెయిటింగ్ జాబితాను తగ్గిస్తామని, పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేస్తామని, పన్ను చెల్లింపుల్లో లొసుగులను నిర్మూలించి ఎన్‌హెచ్‌ఎస్‌కు నిధులు సమకూర్చుతామని హామీలిచ్చారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రత కమాండ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా సొంతిల్లు లేనివారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో చట్టాలను సంస్కరించి 15 లక్షల కొత్త ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లకు పన్ను మినహాయింపులు ఎత్తేసి ఆ సొమ్ముతో 6,500 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పారు. ఇవన్నీ జనాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వేణుగానంలో నిపుణుడు

స్టార్మర్‌కు సంగీతంలో లోతైన ప్రవేశముంది. చాలాకాలం పాటు శాస్త్రీయ శిక్షణ తీసుకున్నారు. ఫ్లూట్, పియానో, వయోలిన్ అద్భుతంగా వాయిస్తారు. కాలేజీ రోజుల్లో ఆయన వేణుగానాన్ని అలా వింటూ ఉండిపోయేవాళ్లమని నాటి మిత్రులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. కాలేజీ రోజుల్లో స్టార్మర్ ఎంతో చురుకైన ఫుట్‌బాల్ ఆటగాడు కూడా. 2007లో విక్టోరియా అలెగ్జాండర్‌ను పెళ్లాడారు. ఆమె నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్)లో ఆక్యుపేషనల్ థెరపిస్ట్. వారికి ఒక కొడుకు, కూతురున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

దేశాన్ని పునర్నిర్మిస్తాం: స్టార్మర్

ప్రజలు మార్పు కోసం నిర్ణాయక రీతిలో ఓటేశారని 61 ఏళ్ల స్టార్మర్ అన్నారు. శుక్రవారం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక 10, డౌనింగ్ స్ట్రీట్ నుంచి ఆయన తొలి ప్రసంగం చేశారు. ''ప్రజల త్యాగాలకు, ప్రతిగా వారికందుతున్న సేవలకు మధ్య అంతరం ఈ స్థాయిలో పెరిగితే భవిష్యత్తు పట్ల వారిలో మిగిలేది నిరాశా నిస్పృహలే. ముందు వారిలో విశ్వాసాన్ని పాదుగొల్పాలి. ఇది మాటలతో కాదు. చేతల్లోనే చూపాలి. మన ముందు భారీ లక్ష్యాలున్నాయి. కనుక నేటినుంచే పని మొదలవుతుంది'' అన్నారు. ''సేవే ఏకైక లక్ష్యంగా లేబర్ పార్టీని పునర్ వ్యవస్థీకరించాం. దేశమే ముందు, ఆ తర్వాతే పార్టీ అంటూ సమూలంగా మెరుగుపరిచి ప్రజల ముందుంచాం. అలాగే దేశాన్ని కూడా అన్ని రంగాల్లోనూ బలోపేతం చేసి చూపిస్తాం. 'సేవల ప్రభుత్వం'గా పని చేస్తాం. లేబర్ పార్టీకి ఓటేయని వారికి కూడా అంతే చిత్తశుద్ధితో సేవ చేస్తాం. ప్రజలందరి నమ్మకాన్నీ నిలబెట్టుకుంటాం. బ్రిటన్‌ను పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తాం'' అని ప్రకటించారు.

సునాక్‌పై ప్రశంసల జల్లు

ప్రధానిగా సునాక్ ఎంతో సాధించారంటూ స్టార్మర్ ప్రశంసలు కురిపించడం విశేషం! 20 నెలల పాలనలో దేశ ప్రగతి కోసం ఆయన చిత్తశుద్ధితో ఎంతగానో కృషి చేశారంటూ కొనియాడారు. ''ఆసియా మూలాలున్న తొలి బ్రిటిష్ ప్రధానిగా సునాక్ ఎంతో సాధించారు. ఆ ఘనతలను ఏ మాత్రం తక్కువ చేసి చూడలేం. ప్రధానిగా ఆయన పనితీరుకు జోహార్లు'' అన్నారు. ఫలితాలు వెలువడగానే స్టార్మర్ బకింగ్‌హాం రాజ ప్రాసాదానికి వెళ్లి రాజు చార్లెస్-3తో భేటీ అయ్యారు. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా స్టార్మర్‌ను రాజు లాంఛనంగా ఆహ్వానించారు.

కేబినెట్‌లోకి లీసా నంది



స్టార్మర్ మంత్రివర్గంలో భారతీయ మూలాలున్న 44 ఏళ్ల లీసా నందికి చోటు దక్కింది. ఆమెను సాంస్కృతిక, క్రీడా, సమాచార ప్రసార మంత్రిగా నియమించారు. విగాన్ నుంచి ఆమె వరుసగా రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. లీసా తండ్రి దీపక్ విద్యావేత్త. 1950ల్లో బ్రిటన్ వెళ్లారు. అక్కడి అమ్మాయిని పెళ్లాడారు. జాతుల సయోధ్యకు బ్రిటన్‌లో గుర్తింపు పొందారు. లీసా 2020లో లేబర్ పార్టీ నాయకత్వం కోసం స్టార్మర్‌తో పోటీపడి మూడోస్థానంలో నిలిచారు.


డౌనింగ్ స్ట్రీట్



ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక స్టార్మర్ దంపతుల అభివాదం



అధికార నివాసాన్ని వీడుతున్న సునాక్ దంపతులు



బ్రిటన్ ఎన్నికల్లో భారతీయం

రికార్డు స్థాయిలో 28 మంది బ్రిటిష్ ఇండియన్ల గెలుపు

లండన్: భారతీయమూలాలున్న వ్యక్తులు బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి విదేశంలోనూ తమ సత్తా చాటారు. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో 28 మంది భారతీయసంతతి నేతలు విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీ ఓడినా మాజీ ప్రధాని, భారతీయ మూలాలున్న రిషిసునాక్ తన రిచ్‌మండ్ నార్త్ అలెర్టాన్ నియోజకవర్గంలో గెలిచారు. ఈసారి అన్ని పార్టీల తరఫున 107 మంది బ్రిటిష్ ఇండియన్లు బరిలో దిగగా 28 మంది గెలిచారు! ఇవి రెండూ రికార్డులే. కేరళ నుంచి పంజాబ్‌దాకా పలు రాష్ట్రాల నుంచి వలసవచ్చిన భారతీయ సంతతి వ్యక్తులు ఎక్కువగా ఎన్నికల్లో పోటీచేశారు. విజేతల్లో ఎక్కువ మంది లేబర్ పార్టీ అభ్యర్థులు కావడం విశేషం!

గెలిచిన మహిళా మంత్రులు

కన్జర్వేటివ్ పార్టీ నేతలు, మాజీ హోం శాఖ మహిళా మంత్రులు సుయెల్లా బ్రేవర్‌మ్యాన్, ప్రీతిపటేల్ గెలిచారు. ఎసెక్స్ పరిధిలోని వీథెమ్ నియోజకవర్గంలో ప్రీతి, ఫేర్‌హామ్ వాటర్‌లూవిల్లే నియోజకవర్గంలో బ్రేవర్‌మ్యాన్ విజయం సాధించారు. లీసెస్టర్‌లో పుట్టిపెరిగిన శివానీ రాజా కన్జర్వేటివ్ అభ్యర్థినిగా లీసెస్టర్ ఈస్ట్ స్థానంలో గెలిచారు. పంజాబ్ నుంచి వలసవచ్చిన గగన్ మోహేంద్ర కన్జర్వేటివ్ నేతగా మరోసారి హార్ట్‌ఫోర్డ్‌షైర్ నుంచి జయకేతనం ఎగరేశారు. ఈయన తాత బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో పనిచేశారు. గోవా నుంచి వలసవచ్చిన క్లెయిర్ కాటిన్హో కన్జర్వేటివ్ నాయకురాలిగా ఈస్ట్ సర్రే నుంచి విజయం సాధించారు. 12 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి బ్రిటన్‌కు వలసవచ్చిన కనిష్క నారాయణ్ లేబర్ పార్టీ నేతగా బరిలో దిగి వేల్స్ స్థానంలో గెలిచారు. ఈయన గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా డేవిడ్ కామెరూన్, లిజ్ ట్రస్ ప్రభుత్వాల్లో పనిచేశారు. 13 ఏళ్లుగా ఎంపీగా కొనసాగుతున్న లేబర్ పార్టీ నాయకురాలు సీమా మల్హోత్రా ఫెల్తామ్ హీస్టన్ నుంచి గెలిచారు. గోవా మూలాలున్న లేబర్ నేత వలేరీ వజ్ మరోసారి వాల్‌సేల్ బ్లాక్స్‌విచ్ నుంచి విజయం సాధించారు. పంజాబీ సిక్కు కుటుంబానికి చెందిన నాదియా ఎడిత్ విట్టోమే లేబర్ పార్టీ తరఫున నాటింగ్‌హామ్ ఈస్ట్ నుంచి గెలుపొందారు. 2019లో 23 ఏళ్లవయసులోనే ఎంపీగా గెలిచిన అతిపిన్న వయస్కురాలిగా రికార్డ్ నెలకొల్పారు. సిక్కు నాయకురాలు, లేబర్ పార్టీ నేత అయిన ప్రీతి కౌర్ గిల్ మరోసారి బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ నుంచి గెలిచారు. పార్లమెంట్‌లో తొలి సిక్కు మహిళా ఎంపీగా నాడు చరిత్ర సృష్టించారు. బ్యాగీ శంకర్ (డర్బీ సౌత్), హర్‌ప్రీత్ ఉప్పల్ (హడర్స్‌ఫీల్డ్), సోనియా కుమార్ (డడ్లే) తదితరులూ విజయం సాధించారు.

భారత్‌పై ప్రభావం ఎంత?

న్యూఢిల్లీ/లండన్: బ్రిటన్‌లో రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్‌లు ఓటమి చవిచూసి లేబర్ పార్టీ గద్దెనెక్కడంతో ఈ అధికార మార్పిడి ప్రభావం భారత్‌పై ఎలా ఉండనుందన్న చర్చ జోరందుకుంది. దానికి భారత వ్యతిరేక, పాక్ అనుకూల పార్టీగా పేరుండటమే ఇందుకు కారణం. 1997లో బ్రిటన్ రాణి ఎలిజబెత్-2 భారత పర్యటనకు వచ్చారు. పాలక లేబర్ పార్టీ సలహా మేరకు ముందుగా పాకిస్తాన్‌లో ఆగడమే గాక, 'ఇరు దేశాలూ కశ్మీర్‌పై విభేదాలను పరిష్కరించుకో'వాలని పాక్ గడ్డ నుంచి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అందుకు తాను మధ్యవర్తిత్వం వహిస్తానంటూ బ్రిటన్ విదేశాంగ మంత్రి రాబిన్ కుక్ నోటి దురుసు ప్రదర్శించడంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. దీనిపై భారత్ భగ్గుమనడమే గాక, బ్రిటన్‌ను థర్డ్ రేట్ దేశంగా నాటి ప్రధాని ఐకే గుజ్రాల్ ఛీత్కరించుకునేదాకా వెళ్లింది. ఉద్రిక్తతల నడుమ రాణి భారత పర్యటన మొక్కుబడిగా ముగిసింది. 2019లో లేబర్ పార్టీ నేత జెరెమీ కోర్బిన్ కశ్మీర్ సమస్యకు ఐరాస ఆధ్వర్యంలో రిఫరెండం నిర్వహించాలంటూ బ్రిటన్ పార్లమెంట్‌లో తీర్మానమే ప్రవేశపెట్టారు! దాంతో బ్రిటన్‌లో ప్రబల శక్తిగా ఉన్న భారతీయులు ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారు. పార్టీ ఘోర ఓటమికి ఇది కూడా ముఖ్య కారణంగా నిలిచింది. పైగా ఆ పార్టీ నేతల్లో ఖలిస్తానీ సానుభూతిపరుల సంఖ్య ఎక్కువ. సారథిగా స్టార్మర్ రాకతో చాలా సానుకూల మార్పు వచ్చిందంటున్నారు. ఎన్నికల్లో బ్రిటిష్ ఇండియన్ల మద్దతు కోసం ఆయన పలు చర్యలు చేపట్టారు. స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించారు. పార్టీలోని ఖలిస్తానీ అనుకూల నేతల ప్రాధాన్యాన్ని బాగా తగ్గించారు. ''భారత్‌తో సన్నిహిత సంబంధాలే మా ప్రాథమ్యం. హిందూఫోబియాకు బ్రిటన్‌లో ఏ మాత్రమూ స్థానం లేదు. వాణిజ్యంలోనే గాక పర్యావరణ, భద్రత వంటి పలు రంగాల్లో భారత్‌తో మరింత సన్నిహితంగా కలిసి పని చేస్తాం'' అని ప్రధానిగా తొలి ప్రసంగంలో స్టార్మర్ ప్రకటించారు.

ఆగస్ట్ 11న నీట్-పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నీట్-పీజీ 2024 ప్రవేశ పరీక్ష కొత్త తేదీ ఖరారైంది. ఆగస్ట్ 11న రెండు షిఫ్టుల్లో పరీక్ష జరగనుంది. జూన్ 23న జరగాల్సిన ఈ పరీక్షను కొన్ని పోటీ పరీక్షల సమగ్రతపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ జూన్ 22వ తేదీన ప్రకటించడం తెల్సిందే. పరీక్ష విధానం సమగ్రతపై సంబంధిత నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) తదితర విభాగాలతో ప్రభుత్వం సమీక్ష జరిపింది. అనంతరం, పరీక్షను ఆగస్ట్ 11వ తేదీన రెండు షిఫ్టుల్లో జరపాలని నిర్ణయించినట్లు ఎన్‌బీఈఎంఎస్ శుక్రవారం తెలిపింది.

రాజకీయం చేయదల్చుకోలేదు

- సత్సంగ్ ఘోరంపై రాహుల్
- బాధితులకు పరామర్శ



హత్రాస్/అలీగఢ్: హత్రాస్ తొక్కిసలాట ఘటనపై రాజకీయం చేయదల్చుకోలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. 121 మందిని బలితీసుకున్న తొక్కిసలాట ఘటన బాధితుల కుటుంబాలను ఆయన శుక్రవారం పరామర్శించారు. తొలుత యూపీలో అలీగఢ్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. తర్వాత హత్రాస్ జిల్లాకు చెందిన 19 మంది కుటుంబీకులను పరామర్శించారు. తర్వాత ఘటన జరిగిన పుల్‌రయీ వెళ్లి బాధితుల కుటుంబాలను ఓదార్చారు. తొక్కిసలాట వంటి నిర్లక్ష్యపూరిత ఉదంతాలపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని చెప్పారు. నష్టపరిహారం త్వరగా ఇవ్వాలని సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. '''బాధితుల్లో ఎక్కువ మంది మహిళలే. పేద కుటుంబాలకు తక్షణ సాయం అవసరం. ఆరు నెలలు, ఏడాది తర్వాత అందే నష్టపరిహారం, సాయం అనవసరం. ఆలస్యం చేయకుండా వెంటనే గరిష్ఠ మొత్తంలో నష్టపరిహారం సీఎం యోగి అందివ్వాలి'' అని రాహుల్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు యూపీ సర్కార్ ప్రకటించడం తెల్సిందే. '' సత్సంగ్ వద్ద పోలీస్ చెబుతున్న రక్షణ ఏర్పాట్లేవీ చేయలేదని బాధితుల కుటుంబసభ్యులు చెప్తున్నారు. ఇది దిగ్భ్రాంతికరం'' అని రాహుల్ అన్నారు.

భోలే బాబా ఆస్తులు... రూ.100 కోట్ల పైనే..

లక్నో: సత్సంగ్ నిర్వహణలో అవకతవకలతో 121 మంది మరణానికి కారణమైన సూరజ్ పాల్ అలియాస్ సాకార్ నారాయణ్ హరి అలియాస్ భోలే బాబాకు ఏకంగా రూ.100 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. భోలే బాబాకు దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు ఉన్నాయి. వీటిలో అత్యధికం ఆయన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. శ్రీనారాయణ్ హరి సాకార్ ట్రస్టు పేరిట వీటిని నిర్వహిస్తున్నారు. బాబాకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులే ఆశ్రమాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తుంటారు. బాబా ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి ఆశ్రమంలో నివసిస్తున్నారు. దాదాపు 14 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఆశ్రమాన్ని హరినగర్ అని పిలుస్తుంటారు. ఇందులో బాబా దంపతుల కోసం ఆరు అత్యాధునిక గదులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావాలో బాబా కోసం మరో కొత్త ఆశ్రమం నిర్మాణంలో ఉంది. భోలే బాబాకు ఖరీదైన కార్లున్నాయి. ఆయన ఎల్లప్పుడూ తెల్లరంగు సూటు, టై, బూట్లు, నల్ల కళ్లద్దాలతో దర్శనమిస్తుంటారు. బాబా రక్షణ కోసం సుశిక్షితులైన 17 మంది వ్యక్తిగత కమాండోలు ఉన్నారు. ఆయన కారుకు ముందు 16 మంది అంగరక్షకులు ఖరీదైన బైక్‌లపై ప్రయాణిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తుంటారు. బాబా కాన్వాయ్‌లో 30 కార్లుంటాయి. తొక్కిసలాట కేసులో ప్రధాన నిందితుడు దేవప్రకాశ్ మధుకర్ లొంగిపోయాడు.

త్వరలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు!

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ దృష్టి పెట్టింది. ఆ రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. అమర్‌నాథ్ యాత్ర తర్వాత ఎన్నికలు జరగవచ్చని ఈ సందర్భంగా షా స్పష్టం చేసినట్లు తెలిసింది. అన్ని స్థానాల్లోనూ బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయనన్నారు. అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 19న ముగియనుంది. సెప్టెంబర్‌లోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఎంపీలుగా అమృత్‌పాల్, రషీద్ ప్రమాణం

న్యూఢిల్లీ: స్వతంత్ర అభ్యర్థులుగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన సిక్కు వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ (31), జమ్మూకశ్మీర్ నాయకుడు షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ (56) శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పలు కేసుల్లో జైల్లో ఉన్న వారికి ప్రమాణం చేయడానికి షరతులతో పెరోల్ లభించింది. కట్టుదిట్టమైన భద్రతమైన పార్లమెంట్‌కు వచ్చి స్పీకర్ చాంబర్‌లో వారు ప్రమాణ స్వీకారం చేశారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి, రషీద్ కశ్మీర్‌లోని బారాముల్లా నుంచి గెలిచారు. కోర్టు నుంచి సకాలంలో పెరోల్ రాకపోవడంతో జూన్ 24, 25న మిగతా ఎంపీలతో కలిసి వారు ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. జాతీయ భద్రతా చట్టం కింద 2023 ఏప్రిల్‌లో అరెస్టయిన అమృత్‌పాల్ అసోంలోని దిబ్రూగఢ్ జైలులో ఉంటున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చిన కేసులో రషీద్ 2017లో అరెస్టయ్యారు. 2019 నుంచి ఢిల్లీలోని తీహార్ జైలులో ఉంటున్నారు.

ఆగస్ట్‌లో ప్రభుత్వం కూలొచ్చు: లాలూ

పట్నా: మోదీ సర్కార్ ఆగస్టులో పడిపోవచ్చని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ శుక్రవారం జోస్యం చెప్పారు. ఈ తరుణంలో ఆర్జేడీ పుంజుకోవాలని పిలుపునిచ్చారు. లాలేవి పగటి కలలేనని బీజేపీ ఎద్దేవా చేసింది. ''లాలూ పగటి కలలు కంటున్నారు. మోదీకే ఓటర్లు మళ్లీ పట్టంకట్టారని లాలూ మర్చిపోయినట్లున్నారు. డీలా పడ్డ ఆర్జేడీ కార్యకర్తల కోసం లాలూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు'' అని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అన్నారు.

రోబో ఆత్మహత్య!?

సియోల్: పరీక్ష సరిగా రాయలేదని, ప్రేమ విఫలమైందని, ఆర్థిక సమస్యలతో ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు తీసుకుంటున్న జనం వార్తలను మనం చూశాం. కానీ మరమనిషి సైతం ఆత్మహత్య చేసుకుంటాడన్న వార్త వింటానికి కొత్తగా ఉన్నా ఇది నిజంగా జరిగిందని దక్షిణకొరియా వార్తాసంస్థలు కోడై కూస్తున్నాయి. రోబో సేవలను విపరీతంగా వాడే దక్షిణ కొరియాలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. డాక్యుమెంట్ల డెలివరీ వంటి పనుల్లో తెగ బిజీగా ఉండే ఓ రోబో సూసైడ్ చేసుకుందన్న వార్త సంచలనం సృష్టించింది. పని ఒత్తిడి వల్లే రోబోట్ ఆత్మహత్య చేసుకుందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

చక్కర్లు కొట్టి.. మెట్లపై పడి

గత గురువారం సాయంత్రం గుమీ నగర సిటీ కౌన్సిల్ భవనంలో ఈ రోబో 'సూపర్‌వైజర్' బాధ్యతల్లో ఉండగా ఉన్నట్టుండి ఆగిపోయి గుండ్రంగా తిరిగి మెట్లపై నుంచి పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఏకబిగిన పని చేయాల్సి రావడంతో విపరీత పని ఒత్తిడితోనే అది ఇలా చనిపోయిందని వార్తలొచ్చాయి. అమెరికాకు చెందిన బేర్‌రోబోటిక్స్ సంస్థ ఈ రోబోను తయారు చేసిచ్చింది. గత ఆగస్ట్ నుంచి అది చురుగ్గా పనిచేస్తోందట. ఈ రోబోకు సొంతంగా పౌరసేవల గుర్తింపు కార్డుంది! అంటే ఒకే ఫ్లోర్‌లో కాకుండా లిఫ్ట్‌లో తిరుగుతూ వేర్వేరు అంతస్తుల్లో పనులు చక్కబెట్టగలదు. ఇలాంటి రోబోట్ పొరపాటున మెట్ల పై నుంచి పడిందా? లేదంటే సాంకేతిక లోపమా? లేదంటే మరేదైనా సమస్యా? అన్న కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. రోబో శకలాలను స్వాధీనంచేసుకుని ల్యాబ్‌కు పంపించారు. అనూహ్య ఘటన తర్వాత ఈ బిల్డింగ్‌లో మరో రోబోను పనిలో పెట్టుకోబోమని గుమీ సిటీ కౌన్సిల్ చెప్పింది. అయితే ద.కొరియాలో రోబోట్ సేవలు అత్యధికం. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రోబోటిక్స్ గణాంకాల ప్రకారం ద.కొరియాలో ప్రతి పది మంది ఉద్యోగులకు ఒక పారిశ్రామిక అవసరాల రోబోట్‌ను వినియోగిస్తున్నారు.



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 6 । జూలై । 2024

సంధి సరిచేసి.. అర్థం చెప్పి

శివాజీనగర: చామరాజపేటలో మొరార్జీ దేశాయ్ వసతి పాఠశాలను సీఎం సిద్దరామయ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఎలా చదువుకుంటున్నారు అంటూ విద్యార్థులను అడిగారు. సంధి అంటే ఏమిటి, సంధులలో కన్నడ అక్షర మాల తదితర వాటిపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం ఆయన పిల్లల సమాధానాలను సరిచేసి వారికి వివరించారు.



వరుణుడి హోరు.. నదులకు జీవం

- కరావళి, మలెనాడును ముంచెత్తిన వర్షాలు
- జనజీవనం అస్తవ్యస్తం
- ఉడుపి జిల్లాల్లో నీట మునిగిన గ్రామాలు
- వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- ఉడుపి, శివమొగ్గ జిల్లాల్లో ఇద్దరి మృతి
- ఉత్తర కన్నడ, దక్షిణ జిల్లాల్లో పాఠశాలలకు సెలవు
- రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ



వంద అడుగుల నీటిమట్టానికి చేరుకున్న కేఆర్ఎస్ డ్యాం



ఉడుపి జిల్లా బైందూరులో నీట మునిగిన ఇల్లు

సాక్షి బెంగళూరు: కరువుతో అల్లాడుతున్న కర్ణాటకను వరుణుడు కరుణించాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరావళి, మలెనాడుల్లో వానలు దంచికొడుతున్నాయి. కాలువలు, నదులు, చెరువులు, నాలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలకు వర్షపు నీటితో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. దక్షిణ కన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, ఉత్తర కన్నడ జిల్లాల్లో రెండు, మూడు రోజులుగా భారీ వానలు కురుస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర కన్నడ జిల్లాలో వరుణుడి బీభత్సం తీవ్రంగా ఉంది.

శివమొగ్గలోనూ భారీ వర్షపాతం నమోదు

కరావళి ప్రాంతంలో ఉదయం నుంచే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. బుధవారం నుంచి ఆయా తాలూకాల్లో మబ్బులు కమ్మేసిన పరిస్థితులు కనిపించాయి. బుధవారం ప్రారంభమైన చిరుజల్లులు గురు, శుక్రవారాల్లో తమ ప్రతాపాన్ని చూపించాయి. ఉడుపిలో గురువారం నుంచి ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. కుందాపుర, బైందూరు తాలూకాల్లో కురుస్తున్న వర్షాలకు చాలావరకు గ్రామాలు నీట మునిగాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఉడుపి జిల్లా కొల్లూరులో వర్షపు ధాటికి కొండ చరియ విరిగిపడి ఇంటిపై పడడంతో హళ్లిబేరు నివాసి అంబా (45) అనే వ్యక్తి మరణించారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు

కార్వార, అంకోలా వంటి ఉత్తర కన్నడ జిల్లా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం ధాటికి ప్రజలకు దాదాపుగా ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ వర్షాల కారణంగా ఉత్తర కన్నడ జిల్లాలోని నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఐదు చోట్ల సహాయ కేంద్రాలను ప్రారంభించారు. శుక్రవారం ఉత్తర కన్నడ జిల్లాల్లోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. అంకోలా, కుమటా, హొన్నావర, భట్కళ వంటి నదీ తీర ప్రాంతాల ప్రజల మధ్యకు వరద నీరు వచ్చి చేరుతోంది. అంకోలా తాలూకాలో గంగావళి నది నీరు పొంగి ప్రవహిస్తోంది. బిళిహోంయిగి గ్రామం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. బిళిహోంయిగి, లింగనమక్కి, హడవ గ్రామాల్లోని సుమారు 35 ఇళ్లు నీటిలో మునిగిపోయాయి. చిక్కమగళూరు జిల్లా శృంగేరి తాలూకాను గురువారం వర్షాలు పలకరించాయి. ఈ వర్షం కారణంగా పట్టణంలోని బైపాస్ రోడ్డు, శారదా మందిరం వద్ద ఉన్న కప్పె శంకర లింగం తుంగా నీటిలో మునిగిపోయింది. రాత్రికిరాత్రికి కురిసిన భారీ వర్షానికి తుంగా నదిలో నీటి ప్రవాహం పెరిగిపోయింది. జాతీయ రహదారి 169 సమీపం వరకు వరద నీరు వచ్చి చేరింది. అలాగే కళస, నరసింహరాజపుర, బాళెహొన్నూరు, కొట్టిగెహార ప్రాంతాల్లో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది.

నదుల్లో పెరుగుతున్న నీటిమట్టం

దక్షిణ కన్నడ జిల్లాలో కురుస్తున్న వర్షానికి కుందాపుర, బైందూరు, బ్రహ్మావర తాలూకాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ ఈదురు గాలులతో కురుస్తున్న వర్షానికి జిల్లాలో ఐదు ఇళ్లకు నష్టం వాటిల్లింది. తెంకకారందూరు సంతాన గోపాలకృష్ణ దేవస్థానం గోడ కూలిపోయింది. కాపు సమీపంలో మృత్యుంజయ నది వరద నీటితో పొంగి ప్రవహిస్తోంది. భారీ వర్షాల కారణంగా కుమారధార నదిలో తీర్థ స్నానాలను నిలిపేశారు. స్నాన ఘట్టం డ్రెస్సింగ్ రూమ్ పక్కనే డ్రమ్ములను ఏర్పాటు చేసి తీర్థ స్నానాలు చేసేందుకు కుక్కే సుబ్రహ్మణ్య దేవస్థానం అవకాశం కల్పించింది. శివమొగ్గ జిల్లాలో భీకర వర్షాలు కురుస్తున్నాయి. భూమికి నెర్రలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి ప్రమాదాలు జరిగాయి. తుమకూరులో సుమారు 10 స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రవాణాకు ఆటంకంగా మారింది. ఆగుంబె ఘాటిలో కారు బోల్తా పడింది. కారులోని వారు గాయపడ్డారు. తీర్థహళ్లి, హొసనగర, సాగర తాలూకాల్లో భారీ వర్షం కారణంగా శరావతి, తుంగా, మాలతి, కుముద్వతి, దండావతి నదుల నీటి మట్టం పెరిగింది.



నిండుకుండలా తుంగా జలాశయం

7 నుంచి 9 వరకు ఎల్లో అలర్ట్

కరావళి జిల్లాల్లో అకాల వర్షాలు తమ రుద్రప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. రానున్న 48 గంటల పాటు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. జూలై 7 నుంచి 9వ తేదీ వరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. మలేనాడు జిల్లాలైన చిక్కమగళూరు, శివమొగ్గకు రెండు రోజుల పాటు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. జూలై 7, 9వ తేదీల మధ్య ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. దక్షిణ కన్నడ, ఉడుపి, ఉత్తర కన్నడ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదవుతుందని ప్రకటించింది. అలాగే చిక్కమగళూరు, శివమొగ్గ జిల్లాల్లో గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు ఉంటుందని చెప్పింది. బెంగళూరు గ్రామీణం, బెంగళూరు, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, హాసన్, కోలారు, దావణగెరె, మండ్య, మైసూరు, రామనగర, తుమకూరు, విజయనగర, బళ్లారి జిల్లాల్లో అక్కడక్కడ చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది.

ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టాలు (మీటర్లలో)

రిజర్వాయర్ పేరు	పూర్తి నీటి సామర్థ్యం	శుక్రవారం నీటి సామర్థ్యం	శుక్రవారం ఇన్‌ఫ్లో(క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో
లింగనమక్కి	554.44	531.13	44,024	1341
సూపా	564	525.58	25678	1370
వారాహి	594.36	570.96	2669	0
హారంగి	871.38	860.71	5048	200
హేమావతి	890.58	880.71	8447	250
కేఆర్ఎస్	38.04	23.94	9686	546
కబిని	696.13	686.25	8321	2917
భద్రా	657.73	642.84	16171	350
తుంగభద్ర	497.71	480.55	19201	396
ఘటప్రభ	662.91	633.11	12173	194
ఆల్మట్టి	519.60	507.77	53901	430
నారాయణపుర	492.25	486.87	218	218
వాణి విలాస్ సాగర్	652.24	650.23	0	147

నిండుకుండలా తుంగా జలాశయం

శివమొగ్గ: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాజలాశయంలోకి భారీగా వరదనీరు చేరుతోంది. డ్యాంలోకి 16,171 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 350 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగా జలాశయం ఇప్పటికే గరిష్టనీటి మట్టం 588.24 అడుగులకు చేరుకుంది. 34,477 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 37,104 క్యుసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. లింగనమక్కి జలాశయంలోకి 44,024 క్యుసెక్కుల నీరు చేరుతుండగా 1340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

భారీ వర్షాలకు ఒకరు బలి



గాలింపు చేపడుతున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మహిళ బలైంది. హొసనగర తాలూకాలో కురిసిన వర్షాలకు వంకలు, వాగులు ఏరులై పారుతున్నాయి. ఈక్రమంలో బైసె గ్రామంలో శశికళ(43) అనే మహిళ గురువారం ఉదయం పొలానికి వెళ్తూ కాలువ దాటేందుకు యత్నిస్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. స్థానికులు ఆమెను రక్షించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. రెండు గంటల అనంతరం అగ్నిమాపక, పోలీసు సిబ్బంది వచ్చి గాలించగా మృతదేహం లభ్యమైంది.

పోలీసుల విచారణకు హాజరైన డెవిల్ డైరెక్టర్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో రోజుకో కొత్త వ్యక్తి తెరమీదకు వస్తున్నారు. హత్య జరిగిన రోజు నిందితులతో కాంటాక్ట్‌లో ఉన్న ప్రతీ ఒక్కరినీ పోలీసులు విచారణకు పిలుస్తున్నారు. తాజాగా దర్శన్ నటించిన డెవిల్ సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్ మిలన ప్రకాశ్‌కు పోలీసులు నోటీసులు ఇవ్వగా ఆయన శుక్రవారం బసవేశ్వరనగర్‌లోని ఏసీపీ చందన్‌కుమార్ కార్యాలయానికి విచ్చేశారు. రేణుకాస్వామి హత్య తరువాత దర్శన్ మైసూరు వెళ్లి డెవిల్ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నాడు. దీంతో దర్శన్ ఎన్ని గంటలకు వచ్చాడు, ఎంత సమయం షూటింగ్‌లో గడిపాడు అనే విషయాల గురించి ఆరా తీయడానికి పోలీసులు విచారణకు పిలిచారు.

పాపం పసికందు

యశవంతపుర: మహిళకు కాన్పు చేస్తున్న సమయంలో శిశువు మర్మాంగం కట్ కావడంతో పసికందు మృతి చెందింది. ఈఘటన గురువారం రాత్రి కర్ణాటకలోని దావణగెరె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. దావణగెరె కొండజ్జి రోడ్డులో నివాసం ఉంటున్న అర్జున్ భార్య అమృత ప్రసవం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు పరీక్షలు చేయగా సాధారణ కాన్పు కష్టమని చెప్పారు. సిజేరియన్‌కు అంగీకరించడంతో శిశువును బయటకు తీశారు. వైద్యుడు నిజాముద్దీన్ పసికందు పేగును కత్తిరించటానికి బదులు మర్మాంగాన్ని కత్తిరించటంతో శిశువు మృతి చెందింది. శిశువు మృతికి వైద్యుడి నిర్లక్ష్యం కారణమని తల్లిదండ్రులు ఆక్రోశం వ్యక్తం చేశారు. వైద్యుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

12 లక్షల ఇళ్లకు మంచినీరు



కేంద్రమంత్రి సోమణ్ణను సన్మానిస్తున్న దృశ్యం

తుమకూరు: జలజీవన్ మిషన్ ద్వారా తుమకూరు జిల్లాలో 12 లక్షల గృహాలకు రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టామని కేంద్రమంత్రి వి.సోమణ్ణ తెలిపారు. అన్నారు. జిల్లాలోని చిక్కనాయకనహళ్లిలో కన్నడ సంఘం వేదిక సమావేశం హాలులో చిక్కనాయకనహళ్లి నాగరిక సమాజం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సన్మానం స్వీకరించి మాట్లాడారు. జలజీవన్ పథకానికి రాష్ట్రంలో లక్ష కోట్లు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు.

నిధుల వ్యయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: సీఎం

శివాజీనగర: ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ నిధులను నిర్దేశించిన గడువులోపు ఖర్చు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శుక్రవారం విధానసౌధలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధిపై సమావేశం జరిగింది. కర్ణాటకలో మాత్రమే ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ చట్టం అమలులో ఉందన్నారు. 2024–25వ సంవత్సరంలో ఎస్‌సీఎస్‌పీ పథకం కింద రూ.27,673.96 కోట్లు, టీఎస్‌పీ కింద రూ.11,447.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత సంవత్సరం రూ.35221.84 కోట్లు కేటాయించగా 99.64 శాతం ఖర్చు చేశారని, మిగతా సొమ్ము ఖర్చు కాలేదన్నారు. వందశాతం నిధులు ఆయా వర్గాల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 11 శాతం రూ.3,897 కోట్ల నిధులు పెంచామన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖకు రూ.8,480 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు రూ.4,174కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.3,403 కోట్లు, గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.3,163 కోట్లు కేటాయించిట్లు తెలిపారు. ఈ నిధులను వంద శాతం ఖర్చు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల మండలికి కేటాయించిన నిధులు కూడా ఖర్చు కాలేదన్నారు. ఎమ్మెల్యేలు జాబితా ఇవ్వలేదని కారణం చెబుతుండటం సరికాదని, లబ్ధిదారుల జాబితా అందజేయాలని అధికారులు మండలి అధ్యక్షులు, సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు చెప్పాలని సూచించారు. డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్, మంత్రులు హెచ్.సీ.మహాదేవప్ప, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజనీశ్ గోయల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'నా కుమారుడిని చంపిన వారికి శిక్ష పడాలి'

దొడ్డబళ్లాపురం: తన కుమారుడిని దారుణంగా హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడాలని రేణుకాస్వామి తల్లి రత్నప్రభ అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు.దర్శన్ తల్లి, కుటుంబ సభ్యులు దర్శన్‌ను కలవడానికి జైలుకు వెళ్లి వస్తున్నారని, తాను తన చేతులతోనే కుమారుడిని మట్టిలో కలిపానని, తన కుమారుడిని చూసే భాగ్యం తనకు ఇక లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేణుకాస్వామి అశ్లీల మెసేజ్ పంపించాడని అందరూ ఇప్పుడు చెబుతున్నారని, ముందే చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని ఉంటే తన కుమారుడు దక్కేవాడన్నారు.

విచారణకు హాజరైన మాజీ ఉప మేయర్

నటుడు దర్శన్‌కు నగదు ఇచ్చిన ఆరోపణలపై మాజీ ఉప మేయర్ మోహన్ రాజ్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. రేణుకాస్వామి హత్య జరిగాక కేసు తనపై రాకుండా ఉండాలని నిందితులకు ఇవ్వడానికి ఖర్చుల కోసం దర్శన్.. మోహన్‌రాజ్ వద్ద రూ.30 లక్షలు నగదు తీసుకున్నారని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పోలీసులు విచారణకు హాజరు కావాలని మోహన్‌రాజ్‌కు నోటీసులు ఇచ్చారు. ఈమేరకు మోహన్‌రాజ్ శుక్రవారం పోలీసుల ముందు హాజరయ్యారు.

కాళికామాత సన్నిధిలో కేంద్రమంత్రి



అమ్మవారిని దర్శించుకుంటున్న కుమారస్వామి

మండ్య: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమార స్వామి శుక్రవారం మండ్యలో శక్తిదేవత శ్రీ కాలికాలంబ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

డెంగీతో బాలిక మృతి

యశవంతపుర: హాసన జిల్లాలో డెంగికి మరొకరు బలయ్యారు. హొళెనరసీపుర తాలూకా దొడ్డళ్లి గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలిక నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో బాలికను హిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ నయం కాకపోవడంతో మైసూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది.

రేణుకాస్వామి హత్యకేసులో బ్లూప్రింట్ కోసం లేఖ

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్న విధానం ఆశ్చర్యం కలిగిస్తోంది. పక్కా ప్రణాళికతో పోలీసులు సాక్ష్యాధారాలు సేకరిస్తూ కేసుతో సంబంధం ఉన్న ఏ ఒక్క వ్యక్తిని, వస్తువునీ వదలకుండా విచారణ చేసి, సాక్ష్యంగా మలచుకుంటున్నారు. ఈక్రమంలో కామాక్షిపాళ్య పోలీసులు తాజాగా పీడబ్ల్యూడీ అధికారులకు బ్లూప్రింట్ తయారుచేసి ఇవ్వాలని లేఖ రాశారు. కామాక్షిపాళ్యలోని పట్టణగెరె మెకానిక్ షెడ్డు నుంచి రేణుకాస్వామి శవాన్ని ఏ మార్గాన తరలించారు? ఎక్కడ విసిరేసారు?, తర్వాత ఏ మార్గాల్లో ఎవరెవరు సంచరించారనే పూర్తి సమాచారం ఆధారంగా బ్లూ ప్రింట్ తయారు చేసి ఇవ్వాలని లేఖ రాశారు.

రేణుకాస్వామి హత్య కేసులో మరొకరికి నోటీసు

రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు మరో వ్యక్తికి నోటీసులు ఇచ్చారు. రేణుకాస్వామి హత్య జరిగాక ఘటనాస్థలానికి వచ్చిన కార్తీక్ పురోహిత్ అనే వ్యక్తికి పోలీసులు విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. హత్యోదంతం వెలుగు చూశాక భయపడ్డ కార్తీక్ పరారయ్యాడు. నిందితుల్లో ఒకడైన ప్రదోష్ అనే వ్యక్తి కోరిక మేరకు కార్తీక్ సంఘటనాస్థలికి వచ్చాడు. ఈకేసులు మరో రహస్య వ్యక్తి ఉన్నాడని పోలీసులు ఇప్పటికే కోర్టుకు తెలిపారు.

క్లుప్తంగా

బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

మైసూరు: ఎస్‌సీపీ, టీఎస్‌పీ పథకం కింద తవ్విన బోర్లకు వెంటనే విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలని చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆదేశించారు. మైసూరులోని జలదర్శిని సమావేశం హాలులో శుక్రవారం ఆయన చిన్ననీటి పారుల శాఖ అధికారులతో సమావేశమై నాబార్డు, ఎస్ఆర్ డీఎఫ్ కింద ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. అనేక చోట్ల బోర్లు తవ్వినా వాటికి కరెంటు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. అలాంటి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

చిన్నారిపై లైంగిక వేధింపులు

యశవంతపుర: బెంగళూరులో అమానుషం చోటు చేసుకుంది. మూడేళ్ల బాలికపై ప్రైవేటు నర్సరీ పాఠశాల ఉపాధ్యాయురాలు లైంగిక వేధింపులకు పాల్పడింది. ఈఘటన బెంగళూరులోని కేజీహళ్లిలో జరిగింది. బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కేజీహళ్లి వెంకటేశ్వరపుర అన్వర్‌లేఔట్‌లోని ప్రైవేటు నర్సరీ పాఠశాలలో జూన్ ఆరు నుంచి తరగతులు జరుగుతున్నాయి. స్కూల్‌కు వెళ్తున్న మూడేళ్ల బాలికపై ఇక్కడ పనిచేస్తున్న టీచర్ లైంగిక వేధింపులకు పాల్పడింది. 10 రోజులపాటు పాఠశాలకు వెళ్లిన బాలిక అనంతరం మొండికేసింది. బడికి ఎందుకు వెళ్లవని తల్లిదండ్రులు అడగ్గా టీచర్ అకృత్యం వెలుగు చూసింది. ఆమె పేరు చెప్పాలని సూచించగా తనకు తెలియదని తెలిపింది. గురువారం సాయంత్రం బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. తర్వాత కేజీహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పాఠశాలకు వెళ్లి సదరు టీచర్‌ను గుర్తించి పోక్సో కేసు నమోదు చేశారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా

బనశంకరి: బెంగళూరు నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేస్తే రూ.500 జరిమానా విధించాలని అధికారులకు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ సూచించారు. శుక్రవారం నగరంలో విలేకరులతో తుషార్ మాట్లాడుతూ... చెత్త ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో దోమల ఉత్పత్తి పెరిగి డెంగీ లాంటి అంటురోగాలు ప్రబలుతున్నాయని, ఈ దృష్టితో బీబీఎంపీ చర్యలు తీసుకుందన్నారు. ఇంటి పరిసరాల్లో స్వచ్ఛత కాపాడి డెంగీ నియంత్రణకు పాలికెతో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో డెంగీ జ్వరం కేసులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. ఆరోగ్యశాఖ డెంగీ నియంత్రణకు చర్యలు చేపడుతోందని, ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి డెంగీపై జాగృతం చేస్తున్నారన్నారు.

ముడా అక్రమాల్లో రాజకీయ కోణం

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా)లో జరిగిన ఇళ్ల స్థలాల కేటాయింపులో జరిగిన అక్రమాల్లో రాజకీయ కోణం ఉందని కేంద్ర మంత్రి హెచ్.డి.కుమార స్వామి ఆరోపించారు. శుక్రవారం ఆయన మైసూరుకు విచ్చేసి చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం సీటుపై కన్నేసిన వారే ముడా అక్రమాలను బయట పెట్టారని తెలిపారు. సీఎంను ఈకుంభకోణంలో ఇరికిస్తే కుర్చీ ఖాళీ అవుతుందని, అందులో ఖర్చీఫ్ వేసి తాను కూర్చోవచ్చని పరోక్షంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై ఆరోపణ చేశారు. కాగా సీఎం సిద్ధరామయ్య భార్య పేరుతో కోట్ల రూపాయల విలువైన భూమి ఎలా వచ్చిందని కుమారస్వామి ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో పేదల భూములు స్వాధీనం చేసుకోవడం సరి కాదన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు సంచరిస్తే సీజ్

శివాజీనగర: నగరంలోని 11 ఆర్‌టీఏ కార్యాలయాల పరిధిలో నిషేధించిన ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు రోడ్లపై కనిపిస్తే సీజ్ చేయాలని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. బైక్ ట్యాక్సీలతో ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లకు డిమాండ్ పడిపోయింది. దీంతో వాటిపై ఆధారపడిన డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారు. బైక్ ట్యాక్సీలను నిషేధించాలని 2021లో ఆటో, ట్యాక్సీ వాహనాల డ్రైవర్లు, యజమానులు ధర్నాలు నిర్వహించారు. దీంతో ప్రభుత్వం బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించింది. అయితే కొన్ని సంస్థలు అనధికారికంగా ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రైవేట్ రవాణా వాహనాల సంఘం ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. రవాణా కమిషనర్ యోగేశ్‌ను భేటీ చేసి తమ గోడు వెల్లబోసుకున్నారు. దీంతో ఎల్క్రానిక్ బైక్ ట్యాక్ ట్యాక్సీలు రోడ్లపై సంచరిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.



మైసూరు సిటీ పోలీస్ కమిషనర్‌గా సీమా లాట్కర్ బాధ్యతలు చేపట్టారు. సిటీ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ కూడా ఈమే

కోరలు చాస్తున్న డెంగీ

- జిల్లా వ్యాప్తంగా 57 కేసులు నమోదు
- అదుపులో ఉందంటున్న అధికారులు




కోలారులో డ్రమ్ముల్లో లార్వాలు పరిశీలిస్తున్న అధికారులు



రాయచూరులో నీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు

కోలారు : వర్షాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈక్రమంలో కోలారు జిల్లాలో డెంగీ నియంత్రణలో ఉన్నా చాపకింద నీరులా ప్రబలుతోంది. జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు 686 రక్త పరీక్షలు నిర్వహించగా వీటిలో 57 డెంగీ కేసులు వెలుగు చూశాయి. జిల్లాలో ఎక్కడా సామూహిక డెంగీ కేసులు, జ్వరాలు ఎక్కడా నమోదు కాలేదు. ఆరోగ్య శాఖ జ్వరంతో బాధపడుతున్న వారు, అనుమానాస్పద కేసులపై దృష్టి పెట్టి పరీక్షలు చేస్తోంది. రక్త నమూనాలను సేకరించి ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన కేసులపై మాత్రమే ఆరోగ్య శాఖకు సమాచారం అందిస్తున్నారు. అత్యవసర కిట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ అని తేలితే ఆరోగ్య శాఖకు సమాచారం ఇస్తున్నారు. ప్రస్తుతం సేకరించిన రక్తం నమూనాల్లో 22 చికెన్ గున్యా, మలేరియా కేసులు కూడా వచ్చాయి.



డెంగీ వ్యాప్తికి కారణమయ్యే ఈడిస్ దోమ

పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాధుల వ్యాప్తి

పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారి నుంచి కూడా డెంగీ మలేరియా, చికెన్‌గున్యా వ్యాపిస్తోంది. శ్రీనివాసపుర తాలూకాలోని మామాడిమండిలో ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు కార్మికులకు మలేరియా సోకింది. చుట్టుపక్కల 75 మందికి కూడా రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరిలో కేసులు కనిపించలేదని సీజనల్ వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఆశా కార్యకర్తలు జాగృతి కల్పించడంతో పాటు నిఘా ఉంచారు. గ్రామాల్లో లావా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వెళ్లి లార్వా పరీక్షలు చేస్తున్నారు. నిలిచిన నీటిలో 15 రోజులకోసారి దోమ పెట్టే గుడ్లను నాశనం చేయడం తమ ఉద్దేశమని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. ఆరోగ్యవంతులను ఈడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాపించే డెంగీతో వారంలోగా ఒళ్లునొప్పులు, తలనొప్పి, జ్వరం, కీళ్ల నొప్పులు ప్రారంభం అవుతాయని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. ఇంతవరకు జిల్లాలోని శ్రీనివాసపురలో 5, ముళబాగిలులో 7, బంగారుపేటలో 11, కేజీఎఫ్‌లో 7, కోలారులో 19, మాలూరులో 8 కలిపి మొత్తం 57 కేసులు నమోదయ్యాయి.

డెంగీ నియంత్రణకు జనజాగృతి

రాయచూరు రూరల్: జిల్లాలో డెంగీ వ్యాధి నియంత్రణకు జనజాగృతి అవసరమని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి సురేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆజాద్ నగర్‌లో ఆయన తమ శాఖ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి తొట్టెలను పరిశీలించి మాట్లాడారు. నగర పరిధిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాలువల వద్ద శుభ్రతను పాటించాలన్నారు. ఆరోగ్యానికి తొలిమెట్టు పరిశుభ్రతే అని అన్నారు.

> **నియంత్రణలోనే డెంగీ**
>
> జిల్లాలో డెంగీ నియంత్రణలోనే ఉంది. మిగిలిన జిల్లాలతో పోలిస్తే కోలారు జిల్లాలో డెంగీ వ్యాప్తి తక్కువగా ఉంది. డెంగీపై జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
>
> –డాక్టర్ రవికుమార్, సీజనల్ వ్యాధుల నియంత్రణ అధికారి



మైసూరు జిల్లా కలెక్టర్‌గా లక్ష్మీకాంత రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న కేవీ రాజేంద్ర ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

సిద్ధారూఢ పోస్టల్ స్టాంప్ విడుదల నేడే

హుబ్లీ: ప్రజల ఆరాధ్య దైవం సిద్ధారూఢ స్వామి మఠంలో శనివారం సిద్ధారూఢ స్వామీజీ చిత్రంతో కూడిన రూ.5 విలువ చేసే పోస్టల్ స్టాంప్ విడుదల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మఠం ట్రస్ట్ కమిటీ అధ్యక్షులు బసవరాజ కళ్యాణ శెట్టర్ తెలిపారు. భక్తుల, ధర్మకర్తల ఆశయం మేరకు సిద్ధారూఢ పోస్టల్ స్టాంప్‌ల కల సాకారం కానుందన్నారు. స్టాంప్ విడుదల సమితి అధ్యక్షుడు చెన్నవీర ముంగరవాడి మాట్లాడుతూ మఠం ట్రస్ట్ ఢిల్లీ శాఖ, కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ, పోస్టల్ శాఖల సహకారంతో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ్ హొరట్టి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి స్టాంప్‌ను విడుదల చేస్తారన్నారు. జోన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ ఎస్.రాజేంద్ర కుమార్ పోస్టల్ స్టాంప్ ప్రాధాన్యతను వివరిస్తారన్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారన్నారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు మంజునాథ మునవళ్లి, గౌరవ కార్యదర్శి సర్వమంగళ పాతక, ట్రస్టీలు రమేష్ బెళగావి, వినాయక ఘోర్పడె, గీతా కలబుర్గి, శ్యామానంద పూజారి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బాగేపల్లి: పరిసరాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతి ఏడాది కనీసం ఐదు మొక్కలను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బాగేపల్లి పట్టణంలోని పర్యాటక మందిరంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో పాల్గొని ఆయన మొక్కలు నాటి మాట్లాడారు.

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌కు అభినందనలు

బనశంకరి: బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఎంపీ డాక్టర్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, సహ ఇన్‌చార్జ్‌గా నియమితులైన సుధాకర్‌రెడ్డికి బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర శుక్రవారం స్వాగతం తెలిపి అభినందనలు తెలిపారు. రాధా మోహన్, అగరాల్‌లు కర్ణాటక లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేసి కార్యకర్తలు, నేతలకు సమర్థవంతంగా మార్గదర్శనం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి ఉన్నప్పటికీ 17 ఎంపీ స్థానాల్లో గెలుపొందామని, త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని విజయేంద్ర అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



నుజ్జయిన కారు

తుమకూరు: హులియూరు సమీపంలోని కెరెసోరగొండనహళ్లి వద్ద గురువారం రాత్రి బొలెరో పికప్ వాహనం, కారు పరస్పరం ఢీకొని ఇద్దరు మృతి చెందారు. మృతులను యళనాడు మంజునాథ్(42), ఓబాలాపుర ఎం.ఉమేష్(40)గా గుర్తించారు. గంగాధర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావంతో ఆస్పత్రికి తరలించారు. హులియూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దుస్తుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం



ఎగసిపడుతున్న మంటలు

దొడ్డబళ్లాపురం: విమానాశ్రయం రోడ్డులో చిక్కజాల వద్ద ఉన్న జాకీ దుస్తుల షోరూంలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. హఠాత్తుగా మంటలు చెలరేగి దుకాణం మొత్తం దట్టమైన పొగ ఆవరించింది. దీంతో సిబ్బంది బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం. చిక్కజాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మైసూరు కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

మైసూరు: మైసూరు జిల్లా అధికారిగా లక్ష్మీకాంతరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన చాముండి కొండకు వెళ్లి శక్తి దేవత చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్ చేరుకుని కేవీ రాజేంద్ర నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్సీగా బాదర్లి ఏకగ్రీవం

బనశంకరి: విధాన పరిషత్ సభ్యుడిగా బసనగౌడ బాదర్లి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాసనసభ కార్యదర్శి ఎంకే.విశాలాక్షి శుక్రవారం ప్రకటించారు. పరిషత్ సభ్యుడిగా ఉన్న జగదీశ్‌షెట్టర్ రాజీనామాతో ఖాళీగా ఉన్న స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించడంతో బసనగౌడ బాదర్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'నా నగరం- నా ఆరోగ్యం- నా పోరాటం'పై సదస్సు

శివాజీనగర: నా నగరం, నా ఆరోగ్యం, నా పోరాటం అనే నినాదంతో బెంగళూరు సైన్స్-సాంకేతిక పరిజ్ఞాన క్లస్టర్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియంలో ఆ మ్యూజియం సహకారంతో గురువారం సదస్సు ఏర్పాటు చేశారు. 12కి పైగా ప్రధాన సంస్థల నిపుణులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యానికి సవాల్‌గా మారిన డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడం, డెంగీపై నగరవాసుల్లో జాగృతి తీసుకురావడం తదితర అంశాలపై నిపుణులు చర్చించారు. బీబీఎంపీ, అశోక్ ట్రస్ట్ ఫర్ రిసర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనిటిక్స్ అండ్ సొసైటీ, బెంగళూరు సస్టైనబిలిటీ సంస్థలు పాల్గొన్నాయి.

మహిళా టెక్కీ ఆత్మహత్య

యశవంతపుర: వేధింపులు తాళలేక మహిళా టెక్కీ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరు గంగమ్మనగుడి మెయిన్‌రోడ్డులో జరిగింది. విజయనగర జిల్లా హూవినహడగలి తాలూకా తెగ్గి బసాపురకు చెందిన పూజా (22) ఆత్మహత్య చేసుకుంది. 2022లో సునీల్‌తో పూజకు వివాహం జరిగింది. భర్త సునీల్, మరిది అనిల్ ఇద్దరు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండటంతో తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాధ్యతల స్వీకరణ

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం అదనపు కలెక్టర్‌గా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జిల్లా ఉప కార్యదర్శిగా, చిక్క నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

మాజీ మంత్రి నాగేంద్రకు సిట్ నోటీస్ ?

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో నగదు కుంభకోణం కేసుకు సంబంధించి సిట్ అధికారులు మాజీ మంత్రి బీ.నాగేంద్రకు నోటీసు ఇచ్చినట్లు సమాచారం. అదే విధంగా మండలి అధ్యక్షుడు బసనగౌడ దద్దలకు కూడా విచారణకు రావాలని సిట్ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది.

సీబీఐకి అప్పగించాలి



మైసూరు: మైసూరు నగరంలో ముడా ఇంటి స్థలాల కేటాయింపులో జరిగిన అవినీతిపై దర్యాప్తునకు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక సేనాపడె కార్యకర్తలు శుక్రవారం మైసూరు నగరంలో ధర్నా నిర్వహించారు. పాత జిల్లా అధికారి కార్యాలయం చేరుకున్న కార్యకర్తలు అక్కడ ధర్నా చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

రూ. 62 కోట్ల పరిహారమా

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో ఇళ్ల స్థలాల పంపిణీలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని శాసన మండలి సభ్యుడు హెచ్. విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడారు. తన భార్య పేరుపై ఉన్న భూమికి రూ. 62 కోట్ల పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరడం సరికాదన్నారు. ప్రభుత్వానికి ఇచ్చిన రూ.6 కోట్ల విలువైన భూమికి రూ. 62 కోట్లు ఎలా పరిహారం ఇస్తారని ఆయన ప్రశ్నించారు. సీఎం భార్య పేరుతో ఉన్న భూమిని ప్రభుత్వానికి అప్పగించాలన్నారు.

విద్యార్థులకు నిర్దిష్ట లక్ష్యం అవసరం



పాఠశాలకు గూగల్ టీవీలను అందించిన దృశ్యం

శ్రీనివాసపురం: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిర్దిష్ట లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని నేతాజీ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్రరావ్ సలహా ఇచ్చారు. శుక్రవారం తాలూకాలోని కొట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నేతాజీ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.40 వేల విలువ చేసే గూగల్ టీవీలను విరాళంగా అందించి మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లను కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు కన్న కలలు నెరవేర్చడానికి శ్రమించాలన్నారు. ఉన్నత విద్య పొందినప్పుడే సమాజంలో ప్రధాన వాహినిలోకి రావచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ ఇంద్రప్రకాష్‌రెడ్డి, ఎంఎస్ కోటేష్, సుభాష్, ఆర్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపనుల శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: తాలూకాలో పీడబ్ల్యూడీ(ప్రజాపనుల శాఖ) వ్యాప్తిలో రహదారుల నిర్మాణం, నిర్వహణ, మరమ్మతు పనుల కోసం, ప్రభుత్వ కార్యాలయాల కట్టడాలు, ప్రభుత్వ వసతి గృహాల నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో పీడబ్ల్యూడీ శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. శుక్రవారం నగరసభ మైదానం ముందున్న శాఖ భవనంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. గతంలో పీడబ్ల్యూడీ కార్యాలయం బంగారుపేటలో ఉండేది. కేజీఎఫ్ ప్రత్యేక తాలూకా ఏర్పడిన తరువాత ప్రత్యేక కార్యాలయం అవసరం ఏర్పడిందన్నారు. అందువల్ల తాలూకా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నగరంలో పీడబ్ల్యూడీ కార్యాలయం ప్రారంభించామన్నారు. కార్యాలయం ప్రారంభానికి సహకరించిన ఆ శాఖా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కుమారస్వామికి మతిస్థిమితం లేదు : డీసీఎం

శివాజీనగర: కేంద్ర మంత్రి హెచ్.డీ.కుమారస్వామికి మతిస్థిమితం లేదని, ఆయన ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయటం మంచిదని డీసీఎం డీ.కే.శివకుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముడా అక్రమాలు వెలుగులోకి రావటంలో డీసీఎం శివకుమార్ ప్రమేయముందని కుమారస్వామి చేసిన ఆరోపణపై దృష్టి సారించిన శివకుమార్, ఈ విధంగా ధ్వజమెత్తారు. విధానసౌధలో మీడియా వారు అడిగిన ప్రశ్నకు శుక్రవారం సమాధానమిచ్చిన శివకుమార్, ముడా అక్రమ విషయంలో కుమారస్వామి చేస్తున్నది ఆధార రహితమైన ఆరోపణ. మతిస్థిమితం లేని కారణాన ఆయన ఈ విధంగా అపద్దపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

కోలారు వార్తలు...

మత్తుకు యువత దూరంగా ఉండాలి



05కెజీఎల్05 మాట్లాడుతున్న న్యాయమూర్తి మంజునాథ్

కోలారు : యువతకు మత్తు పదార్థాల సేవనంతో కలుగుతున్న దుష్పరిణామాల గురించి తెలియజేసి వారిని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలని, వ్యసనముక్త సమాజానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని న్యాయమూర్తి జీపీ మంజునాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సభాంగణంలో మాదక వస్తువుల సేవనం, పిల్లల దొంగ రవాణా వ్యతిరేక సప్తాహ కార్యక్రమంలో భాగంగా పీడీఓలు, పోలీస్ శాఖ అధికారులకు నిర్వహించిన రెండు రోజుల సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారు సమాజానికి భారమన్నారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచడంలో తల్లిదండ్రులు ఎక్కువ బాధ్యత తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పిల్లలు దారి తప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేవరాజ్ అరస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక వస్తువుల రవాణా, విక్రయం చట్ట వ్యతిరేకమనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. యువకులు మాదక ద్రవ్యాలకు బానిసలు అవుతుండడం వల్ల వారు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. కలెక్టర్ అక్రం పాషా మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల సమీపంలో మత్తు కలిగించే పదార్థాలను, పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నేరం అని, దీనికి కఠిన శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో కేజీఎఫ్ ఎస్పీ శాంతరాజు, జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, పానీపూరి సెంటర్లపై దాడి



బేకరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కేజీఎఫ్: కృత్రిమ రసాయనాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న హోటళ్లు, పానీపూరి సెంటర్లు, బేకరీల్లో శుక్రవారం నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ దాడులు నిర్వహించారు. నగరంలోని ఎంజీ మార్కెట్, కువెంపు బస్టాండు, 2వ క్రాస్, 3వ క్రాస్, గీతా రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ దాడులు జరిపి పరిశీలించారు. నియమాలను ఉల్లంఘించి కృత్రిమ రసాయన పదార్థాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న వారిపై రూ.లక్ష వరకు జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ దుకాణాల యజమానులు డబ్బులు సంపాదించడం కోసం ఆహార పదార్థాలకు కృత్రిమ రసాయనాలతో తయారు చేస్తున్న ఆహార పదార్థాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తినే ప్రమాదం ఉన్నందున ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. హోటల్ యజమానులు వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలకు కృత్రిమ రసాయనాలను కలపరాదన్నారు. నగర వ్యాప్తిలో ఈ దాడులు నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. దాడిలో నగరసభ మేనేజర్ శశికుమార్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ ఫేం వర్తూరు సంతోష్ కోర్టుకు హాజరు



మాట్లాడుతున్న వర్తూరు సంతోష్

మాలూరు : పాత్రికేయుడిని నిందించిన కేసులో పట్టణంలోని జేఎంఎఫ్‌సీ కోర్టుకు బిగ్‌బాస్ ఫేం వర్తూరు సంతోష్ హాజరయ్యారు. ఘటనకు సంబంధించి న్యాయమూర్తి విచారణను ఈనెల 10కి వాయిదా వేశారు. గతేడాది సఫలాంబ జాతరలో తాలూకాలోని తోర్నహళ్లి గ్రామంలోని శ్రీసఫలాంబ దేవి జాతర మహోత్సవంలో కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి పశువుల జాతర నిర్వహించడంపై పత్రికల్లో వార్తలు రావడంతో వార్త రాసిన పాత్రికేయుడిని వర్తూరు సంతోష్ అవాచ్య శబ్దాలతో నిందించాడు. దీంతో అతనిపై పట్టణ జేఎంఎఫ్‌సీ కోర్టులో కేసు నమోదైంది. సుదీర్ఘ విచారణ అనంతరం వర్తూరు సంతోష్ పాత్రికేయుడిని క్షమాపణ కోరారు.

9 మంది జూదరుల అరెస్టు

కోలారు : తాలూకాలోని గట్టహళ్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు దాడి జరిపి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. ఆ సమయంలో వారి వద్ద నుంచి రూ.9500 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మంజునాథ్

కోలారు : జిల్లాలోని కోర్టుల్లో ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా రాష్ట్రంలోని వివిధ నగరాల్లో స్థానిక సంస్థల వ్యాప్తిలో లోక్‌అదాలత్ సందర్భంగా ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ కల్పించాలని సివిల్ జడ్జి మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఈ సమాచారం అందించిన ఆయన రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సూచనల మేరకు పూర్తి ప్రమాణంలో ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం వరకు రాయితీ ఇవ్వాలని నగరాభివృద్ధి శాఖకు తెలియజేశామన్నారు. ప్రజలు నగర, స్థానిక సంస్థల వ్యాప్తిలో బకాయి ఉన్న ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లించాలన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగడాన్ని తప్పించడానికి జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయాలయాల్లో ఈ నెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు, సివిల్ న్యాయమూర్తి సుశీల్ ఎస్.హొసమని తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మారమ్మదేవికి ప్రత్యేక పూజలు



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని పరంగిపాళ్య గ్రామంలో వెలసిన గ్రామదేవత మారెమ్మ దేవికి శుక్రవారం సందర్భంగా తెల్లవారుజామునే విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుండెపోటుతో యక్షగాన కళాకారుడి మృతి

యశవంతపుర: ప్రముఖ యక్షగాన కళాకారుడు కుంబ్లె శ్రీధరరావ్ (76) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కేరళ కాసరగోడుకు చెందిన కుంబ్లె శ్రీధరరావ్ ఉప్పినంగడి నెక్కిలాడి పట్టణంలోని శాంతినగర సమీపంలోని బెరికెలో నివాసం ఉంటున్నారు. ఈయన ధర్మస్థల మంజునాథేశ్వర కృపాపోషిక యక్షగాన మండలిలో 50 ఏళ్లగా పనిచేస్తున్నారు. శ్రీధరరావ్‌కు గుండెపోటు రావటంతో హుటాహుటిన పుత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి



మృతి చెందిన భరత్

గౌరిబిదనూరు: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వాటంకొత్తపల్లి గ్రామానికి చెందిన భరత్ (21) మృతి చెందాడు. భరత్ ఇన్నోవా కారులో వాటం కొత్తపల్లి గ్రామానికి స్నేహితులతో కలిసి వచ్చాడు. కుటుంబ సభ్యులతో మాట్లాడి తిరిగి ఇన్నోవా కారులో బయలుదేరాడు. తాలూకాలోని హుదగూరు సమీపంలోని మలుపు వద్ద ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో భరత్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని బెంగళూరు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రజ్వల్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

బనశంకరి: అత్యాచారం ఆరోపణలకు సంబంధించి మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ హైకోర్టులో వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు రెండువారాలపాటు వాయిదా వేసింది. శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి కృష్ణ ఎస్.దీక్షిత్‌తో కూడిన న్యాయపీఠం ప్రజ్వల్ రేవణ్ణ వేసిన బెయిల్ పిటిషన్ విచారణ చేపట్టి ఈ కేసుపై అఫిడవిట్ వేయాలని సిట్‌కు సూచించింది. రెండు వారాలపాటు కేసు విచారణ వాయిదా వేస్తూ ఆదేశాలు జారీచేశారు.

రౌడీ ఫ్యాన్స్ పేజీలకు అడ్డుకట్ట

బనశంకరి: సోషల్ మీడియాలో రౌడీల అభిమానులు ఫ్యాన్స్ పేజీలకు అడ్డుకట్ట వేయడానికి సీసీబీ పోలీసులు సన్నద్ధమయ్యారు. సైబర్ క్రైం పోలీసులు సాయంతో రౌడీలు ఫ్యాన్స్ పేజీలను సోషల్ మీడియాలో తొలగిస్తున్నారు. నగరంలో పేరుపొందిన రౌడీలైన విల్సన్‌గార్డెన్ నాగ, సైలెంట్ సునీల్, సైకిల్ రవితో పాటు పలువురు పేర్లతో బాస్ ట్యాగ్ లైన్‌లో సోషల్ మీడియాలో ఫ్యాన్‌పేజీలు తెరిచారు. సినిమా డైలాగ్, పాటలతో ప్రేరేపిస్తున్నారు. ఇలాంటి పేజీలకు ఫాలోవర్స్ సంఖ్య రౌడీమూకలు ఆకర్షితులౌతున్న యువకుల సంఖ్య పెరుగుతుంది. దీనిని తీవ్రంగా పరిగణించిన సీసీబీ పోలీసులు సైబర్‌క్రైం పోలీసుల సాయంతో ఇప్పటికే అనేక అకౌంట్లను తొలగించారు. రానున్న రోజుల్లో సోషల్ మీడియాలో ఇలాంటి అకౌంట్లు తెరిచేవారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

కార్యకర్తల హడావుడి, కేంద్రమంత్రి ఆగ్రహం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కుమారస్వామి

మండ్య: మండ్య ఎంపీగా విజయం సాధించిన అనంతరం కేంద్రమంత్రిగా ఎన్నికైన ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామి శుక్రవారం మండ్య నగరంలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన రాకను తెలుసుకున్న అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ క్రమంలో సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి కుమారస్వామి కార్యకర్తలపై మండిపడ్డారు. జనతా దర్శన్‌కు వచ్చి ప్రజలు గంటల కొద్ది వేచి చూసి అసహనంతో వెనుతిరిగారు.

బదిలీలకు సిఫారసు తీసుకురావొద్దు

- నగర పోలీస్ కమిషనర్ దయానంద్ హెచ్చరిక
- నెలవారి కవాతులో గౌరవ వందనం స్వీకరించిన సీపీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీస్ కమిషనర్ దయానంద్



బలగాల కవాతు

బనశంకరి: బదిలీలకు ఎలాంటి సిఫారసు తీసుకురావద్దని పోలీస్ సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ దయానంద్ హెచ్చరించారు. శుక్రవారం ఆడుగోడి సీఏఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన నెలవారి కవాతులో వివిధ బలగాలతో గౌరవవందనం స్వీకరించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. పదోన్నతి, బదిలీలు పారదర్శకంగా ఉంటాయని ఏకరూప విధానంలో కౌన్సెలింగ్ చేపడతారని ఎలాంటి ప్రలోభాలకు గురికారదని బదిలీ జాబితా సిద్ధమౌతుందని తమ శాఖ కాకుండా వేర్వేరు శాఖల్లో కూడా బదిలీలు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటికే ఏఎస్ఐ స్థాయి అధికారులకు పీఎస్ఐ భర్తీ చేశామని ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ, కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. నగర పోలీసులు కార్యవైఖరి, వృత్తి నైపుణ్యతను దయానంద్ ప్రశంసించారు. ఇటీవల కొన్ని కేసులు దర్యాప్తుతో పోలీసుల కార్యవైఖరి గురించి అన్ని వైపుల నుంచి ప్రశంసలు రావడం అభినందనీయమన్నారు. ప్రధానంగా నేర కార్యకలాపాలు పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. ప్రజలు కష్టపడి కూడబెట్టిన డబ్బు, భూమి, చోరీలు, తదితర వాటిపై త్వరితగతిన స్పందించాలి. వస్తువులు కోల్పోయినవారు బాధలో ఉంటారని అలాంటి వారి కష్టాలపై స్పందించాలన్నారు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజలతో సంయమనంతో వ్యవహరించాలని సిబ్బందికి హితవు పలికారు. రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన మూడు కొత్తచట్టాల గురించి తెలుసుకోవాలని వీటిలో లోపాలు తలెత్తకుండా సరైన రీతిలో పాటించాలి. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మూడు న్యాయచట్టాలను సరైనరీతిలో అమలు చేయాలన్నారు. ప్రతినెల కవాతు అమల్లోకి తీసుకువచ్చామని నిరంతరంగా కవాతులో సిబ్బంది అందరూ పాల్గొనాలని అందులోను నిత్య కర్తవ్యంతో పాటు ట్రాఫిక్, రాత్రి సమయాల్లో గస్తీ పోలీస్ స్టేషన్లలో విధులు కవాతును అలవాటు చేసుకోవాలని తెలిపారు.

తాలూకాలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు



స్మార్ట్ ఫోన్లను అందజేసిన దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ తాలూకాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, ఈ విషయంపైన ఇప్పటికే మంత్రితో మాట్లాడామని, త్వరలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే శివణ్ణ తెలిపారు. శుక్రవారం ఆనేకల్ తాలూకాలో అంగన్‌వాడీలు, పరిశీలకులకు స్మార్ట్‌ఫోన్లను అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆనేకల్ తాలూకాలో 16 ప్రాంతాల్లో అంగన్‌వాడీలకు సొంత భవనాలు ఉన్నాయని, మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లో నిర్వహణ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.సిద్ధ రామణ్ణ, సీడీపీఓ కవిత, పురసభ మాజీ అధ్యక్షుడు ఎన్.ఎస్.పద్మనాభ, సీఐ తిప్పేస్వామి, పురసభ సభ్యుడు రాజప్ప,బాబు, మహంతేష్ రవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

23 మంది ఐఏఎస్‌ల బదిలీ

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మైసూరు డీసీ సహా 23 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ అర్ధరాత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా మైసూరు జిల్లా అధికారి కేవీ రాజేంద్రను పర్యాటక శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ బెంగళూరుకు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు..

- డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్, అదనపు కార్యదర్శి నగరాభివృద్ధి శాఖ, బెంగళూరు జలమండలి.
- బీ.శరత్-మేనేజింగ్ డైరెక్టర్, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక మండలి
- సెల్వమణి-మేనేజింగ్ డైరెక్టర్, కర్ణాటక నగర నీటి సరఫరా, శ్యానటరీ మండలి.
- నితీశ్ పాటిల్-ఐఏఎస్ డైరెక్టర్, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, బెంగళూరు
- డాక్టర్ అరుంధతి చంద్రశేఖర్-కమిషనర్, పంచాయితీరాజ్ శాఖ, బెంగళూరు
- జ్యోతి కే-కమిషనర్, డైరెక్టర్, పట్టు అభివృద్ధి చేనేత మండలి బెంగళూరు.
- శ్రీధర్ సీ.ఎన్.డైరెక్టర్, సామాజిక లెక్క పరిశోధనా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ, బెంగళూరు.
- డాక్టర్ రాజేంద్ర కే.వీ.మేనేజింగ్ డైరెక్టర్, కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి, బెంగళూరు.
- చంద్రశేఖర్ నాయక ఎల్-అడిషనల్ కమిషనర్, వాణిజ్య పన్నులు, బెంగళూరు
- విజయమహంతేశ బీ.దానమ్మనవర్-జిల్లాధికారి హావేరి జిల్లా.
- గోవిందరెడ్డి-జిల్లాధికారి, గదగ
- రఘునందన్ మూర్తి-ఖజానా కమిషనర్, బెంగళూరు
- డాక్టర్ గంగాధరస్వామి జీ.ఎం.-జిల్లాధికారి, దావణగెర
- లక్ష్మీకాంత్‌రెడ్డి-జిల్లాధికారి, మైసూరు
- నితీశ్ కే-జిల్లాధికారి, రామచూరు జిల్లా
- శిల్పా శర్మా-జిల్లాధికారి, బీదర్ జిల్లా
- డాక్టర్ దిలీశ్ ససి-సీఇఓ, సెంటర్ ఫార్ ఇ-పరిపాలన, బెంగళూరు
- లోఖండ స్నేహల్ సుధాకర్-మేనేజింగ్ డైరెక్టర్, కర్ణాటక విద్యుత్ కర్మాగారం

డెంగీ నియంత్రణకు జాగృతి అభియాన్



డెంగీ నియంత్రణ అభియాన్ కార్యక్రమంలో విద్యార్థులతో మంత్రి రామలింగారెడ్డి, ఎన్.నాగరాజు తదితరులు

బనశంకరి: మన నగరం మన లేఔట్ అనే అభియాన్‌తో డెంగీ నియంత్రణకు ప్రభుత్వంతో ప్రజలు సహకారం ముఖ్యమని మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం జయనగర మూడోబ్లాక్ రాణి కిత్తూరు చెన్నమ్మ క్రీడామైదానంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో డెంగీ జ్వరంపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాన్ని జయనగర గ్యారంటీ పథకాల అమలు సమితి అధ్యక్షుడు ఎన్.నాగరాజుతో కలిసి మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మన నగరం, మనలేఔట్ అనే అభియాన్ ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని నగర ప్రజలకు హితవు పలికారు. ఇంటిచుట్టూ స్వచ్ఛత కాపాడుకోవాలని రెండురోజులైనా జ్వరం తగ్గుముఖం పట్టనట్లయితే తక్షణం బీబీఎంపీ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకారం అవసరమని తెలిపారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయరాదని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. జయనగర గ్యారంటీ పథకాల అమలు అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. డెంగీజ్వరం గురించి జాగృతి కార్యక్రమం చేపట్టామని తెలిపారు. స్వచ్ఛత కాపాడాలని, వర్షంనీరు నిల్వకుండా చేయడం, నీటి డ్రమ్ములను శుభ్రం చేయడం, దోమలు ఉత్పత్తి పెరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. డెంగీ అవగాహన జాతాలో క్రీడలు విద్యార్థులు, కాంగ్రెస్‌నేత సుకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్టణ ఉప ఎన్నికలో కూటమి అభ్యర్థి నేనే

దొడ్డబళ్లాపురం: త్వరలో జరగనున్న చెన్నపట్టణ ఉప ఎన్నికలో కూటమి అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నట్టు ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం చెన్నపట్టణలో మీడియాతో మాట్లాడిన ఆయన గతవారం తాను ఢిల్లీలో కుమారస్వామిని కలిసానన్నారు. వీలయినంత త్వరగా అభ్యర్థిగా ప్రకటించాలని కోరడం జరిగిందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ వారు ఎన్నికల ఏర్పాట్లు చేసుకుంటున్నారని, అందువల్ల మీరే వచ్చి అభ్యర్థి పేరు ప్రకటించాలని కుమారస్వామిని అడిగానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులతో ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, డీకే శివకుమార్ కనకపురలో గెలిచి రామనగర ఇన్‌చార్జ్ తీసుకోకుండా బెంగళూరు ఇన్‌చార్జ్ ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో డీకే శివకుమార్ చెన్నపట్టణలో తిరుగుతూ ప్రజలను మభ్యపెట్టే వాగ్దానాలు, మాటలు చెబుతున్నాని మండిపడ్డారు

కేఐఏలో ఏటీసీ ఆధునికీకరణకు చర్యలు

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కొత్త ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ (ఏటీసీ) నిర్మించి కార్యాలయాన్ని అక్కడికి తరలించిన తరువాత ఇప్పుడు ఉన్న ఏటీసీని కొత్త టెక్నాలజీతో ఆధునీకరించడం జరుగుతుందని ఎయిర్‌పోర్టు అథారిటీ తెలిపింది. భవిష్యత్తులో ఏర్పడే ఎయిర్‌ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఏటీసీని డెవలప్ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఏటీసీ గత 16 సంవత్సరాలుగా పని చేస్తోంది. 2008 మే 24న ఎయిర్‌పోర్టులో మొదటిసారి ఏటీసీ సేవలు ప్రారంభించబడ్డాయి. ఇండియా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ఏటీసీని కంట్రోల్ చేస్తుంది. 1వ టర్మినల్ వద్ద ఉన్న ఏటీసీ టవర్ నుండి 730 విమానాల సంచారాన్ని కంట్రోల్ చేస్తోంది. భవిష్యత్తులో విమానాల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏటీసీని ఆధునీకరిస్తారు. ఇందుకు రూ.200 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుంది. ఆధునీకరణ పనులకు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఏటీసీ టవర్ మరో 12 ఏళ్ల పాటు సేవలు అందించగలదు.

ఉడుపి జిల్లాలో అమానవీయం

యశవంతపుర: విద్యార్థులతో మరుగుదొడ్డిని శుభ్రం చేయించిన మరో అమానవీయ ఘటన ఉడుపి జిల్లాలో జరిగింది. నిట్టూరు తాలూకా అనుదాన పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడు విద్యార్థులతో మరుగుదొడ్డిని శుభ్రం చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. విద్యార్థులచే మరుగుదొడ్డిని శుభ్రం చేయించరాదని ప్రభుత్వ ఆదేశాలున్న ఉపాధ్యాయులు పట్టించుకోవటంలేదని ఆరోపణలు వస్తున్నాయి. పీఈటీ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

ఈడీస్ దోమ వ్యాప్తిని అరికట్టండి

డెంగీ జ్వరానికి కారణమవుతున్న ఈడీస్ దోమ ఉత్పత్తిని పూర్తిగా అడ్డుకోవాలని కోరుతూ మంగళూరులో చేపట్టిన అభియాన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ ప్రారంభించారు. ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఈడిస్ దోమ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, ట్యూబులు, టైర్లను పరిశీలించారు. చుట్టు పక్కల శుభ్రంగా ఉంటేనే ఈడిస్ నివారణకు సాధ్యమన్నారు.

ప్రియురాలితో గొడవ.. బస్సును వదిలేసి వెళ్లిన డ్రైవర్

యశవంతపుర: ప్రైవేట్ బస్సు డ్రైవర్ తన ప్రియురాలితో వాగ్వాదానికి పాల్పడి కోపంతో బస్సును ఆపేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన ఉడుపిలో జరిగింది. ఉడుపి నుంచి సంతెకట్టెకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు నిట్టూరు వద్దకు రాగానే డ్రైవర్‌కు ప్రియురాలు ఫోన్ చేసింది. ఏదో విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన డ్రైవర్ బస్సును ఆశీర్వాద్ థియేటర్ వద్ద నిలిపివేశాడు. కండక్టర్ సముదాయించిన డ్రైవర్ వెళ్లిపోయాడు. డ్రైవర్ తీరుతో ప్రయాణికులు హతాశులయ్యారు. చేసేది లేక వేరే బస్సులో వెళ్లిపోయారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్

బనశంకరి: ప్రయాణికులకు అనుకూలమయ్యే విధంగా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా టికెట్ డబ్బు చెల్లించే వ్యవస్థను కేఎస్ఆర్టీసీ అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. చిల్లర కోసం నిత్యం ప్రయాణికులు కండక్టర్లు మధ్య గొడవలు చోటుచేసుకుంటుండంతో వీటిని నివారించాలని ఆర్టీసీ నిర్ణయించింది. దీని కోసం ప్రైవేట్ కంపెనీతో 10,245 ఇటీఎం టికెట్ మెషిన్ల కొనుగోలు చేయడానికి సిద్ధమైంది. ఈ మెషిన్‌లో క్రెడిట్, డెబిట్‌కార్డును కూడా ప్రయాణికులు వినియోగించి టికెట్ తీసుకోవచ్చు. అంతేగాక నగదు చెల్లించి టికెట్ కొనుగోలు చేయవచ్చని ఆర్టీసీ తెలిపింది.

రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న డెంగీ

- ఆరు జిల్లాల్లో డెంగీ తీవ్రత ఎక్కువ
- వ్యాధిగ్రస్తులతో ఆస్పత్రులు కిటకిట
- రాజధాని బెంగళూరులో డెంగీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

బనశంకరి: రాష్ట్రాన్ని డెంగీ పీడ పట్టి పీడిస్తోంది. నగరం, పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా డెంగీ పంజా విసిరి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోంది. డెంగీ బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రాజధాని బెంగళూరు, హాసన, శివమొగ్గ, హావేరి, చిక్కమగళూరు, మైసూరు, చిత్రదుర్గ, దారవాడ జిల్లాల్లో డెంగీ తీవ్రత ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకు డెంగీతో మృత్యువాతపడిన వారిసంఖ్య 6కు చేరుకుంది. బెంగళూరు నగరం, శివమొగ్గ, హావేరి, ధార్వాడలో ఒకరు చొప్పున, హాసనలో ఇద్దరు డెంగీతో మృతి చెందారు. డెంగీ కేసుల విషయానికొస్తే బెంగళూరులో 1,563, చిక్కమగళూరులో 491, మైసూరులో 479, హావేరిలో 451, చిత్రదుర్గలో 265, దక్షిణ కన్నడ 233 మంది డెంగీ లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మందిలో డెంగీ లక్షణాలు కనిపించాయి. డెంగీని కట్టడి చేసేందుకు ఆరోగ్యశాఖ కట్టుదిట్టమైన చర్యలకు దిగింది. ఆరోగ్యశాఖమంత్రి దినేశ్‌గుండూరావ్ వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో డెంగీ నియంత్రణపై చర్చించారు. పరిసరాల శుభ్రత, ఫాగింగ్, మురుగు కాలువలు శుభ్రం చేయించడం, నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. బెంగళూరులో డెంగీ విజృంభిస్తోంది. 1,563 డెంగీ లక్షణాల కేసులు వెలుగులోకి రాగా రెండురోజుల్లో 78 మంది శాంపిల్స్‌పైకి 12 మందిలో డెంగీ నిర్ధారణ అయ్యింది. పశ్చిమ వలయంలో 5, బొమ్మనహళ్లి , మహదేవపుర వలయాల్లో తలా 2 కేసులు వెలుగులోకి వచ్చాయి. డెంగీ నియంత్రణకు పాలికె 1500 మందితో బృందాలు ఏర్పాటు చేసింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం కార్యకర్తలు, ఆరోగ్యశాఖ అధికారులు ఈ బృందాల్లో ఉంటారు. ప్రతి వారం ఈబృందం ఇంటింటికి వెళ్లి డెంగీ పట్ల జాగృతం చేసే కార్యక్రమం చేపడుతుంది.12 లక్షల ఇళ్లను సందర్శించాలని కార్యాచరణ రూపొందించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదైన డెంగీ కేసుల వివరాలను ప్రభుత్వానికి సమాచారం అందించాలని బీబీఎంపీ కమిషనర్ సూచించారు. హావేరి జిల్లాల్లో డెంగీకేసులు హెచ్చుమీరుతుండటంతో జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి శివానందపాటిల్ సోమవారం జిల్లాలో పర్యటించారు. ఆస్పత్రులను సందర్శించి డెంగీవార్డులతో పాటు మహిళలు, చిన్నపిల్లలు ఆసుపత్రిని సందర్శించి సమాచారం తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు.

హోసూరు వార్తలు..

ఆర్టీవో చెక్‌పోస్ట్‌పై ఏసీబీ దాడి

- లెక్కకు రాని రూ. 2.25 లక్షల నగదు స్వాధీనం



ఏసీబీ స్వాధీనం చేసుకున్న నగదు

హోసూరు: హోసూరు -బెంగళూరు జాతీయ రహదారి జుజువాడి సరిహద్దు ఆర్టీవో చెక్‌పోస్ట్‌పై శుక్రవారం వేకువజాము లంచ నిరోధక శాఖ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా వారు లెక్కకు రాని రూ. 2.25 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు జుజువాడి వద్ద ఆర్టీవో చెక్‌పోస్ట్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి తమిళనాడు వైపు వెళ్లే వాహనాలను అనుమతించేందుకు పెద్ద ఎత్తున నగదు వసూలు చేస్తున్నట్లు ఏసీబీకి సమాచారం వచ్చింది. దీంతో డీఎస్పీ డీఎస్పీ వడివేల్ నేతృత్వంలో పోలీసులు ప్రభు, మంజునాథ్, మణివణ్ణన్, శ్రీధర్‌ల బృందం శుక్రవారం ఉదయం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. లెక్కలోకి రాని కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. అధికారులను విచారణ చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

క్రిష్ణగిరి: తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని మత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... మత్తూరు సమీపంలోని శివంబట్టి ప్రాంతం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ప్రత్యేక విభాగం పోలీస్ జయవేల్ నేతృత్వంలో పోలీసులు తిరుపత్తూరు-ధర్మపురి రోడ్డుపై తనిఖీ చేపట్టారు. ఆ మార్గంలో వచ్చిన మినీలారీని తనిఖీ చేయగా 2.5 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడింది. లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోలారు జిల్లా భూదికోట ప్రాంతానికి చెందిన శివ, సుదర్శన్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

ఏటీఎం దోపిడీకి విఫలయత్నం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ఆవులపల్లి హడ్కో ప్రాంతంలో నిర్వహిస్తున్న ఏటీఎం కేంద్రంలో గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడి విఫలమయ్యారు. వివరాలు... ఆవులపల్లి హడ్కో ప్రాంతంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రానికి వాచ్‌మెన్ లేకపోవడాన్ని పసిగట్టిన ఇద్దరు దొంగలు గురువారం అర్ధరాత్రి దోపిడీకి యత్నించారు. ఏటీఎం యంత్రాన్ని బద్దలుగొట్టే శబ్దం విన్న ఆ భవనానికి చెందిన వాచ్‌మెన్ నందీష్ వెంటనే ఏటీఎం కేంద్రం వద్దకు వెళ్లాడు. విషయం గమనించిన దొంగలు అక్కడి నుండి పరారయ్యారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నారు.

పశువులను బంధించిన కార్పొరేషన్ సిబ్బంది

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను పాలికె సిబ్బంది బంధించారు. శుక్రవారం ఉదయం అధికారి ప్రభాకర్ నేతృత్వంలోని సిబ్బంది పశువులను పట్టుకుని వాటి యజమానులను పిలిపించి జరిమానా విధించి హెచ్చరించారు. మరోసారి రోడ్లపై పశువులు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ముఖ్యం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ, డీఎస్పీ తదితరులు

హోసూరు: పారిశ్రామికంగా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు మహానగరంలో దోపిడీలు, దొంగతనాలు తదితర నేరాలను అరికట్టడానికి సీసీ కెమెరాల అవసరం ఎంతగానో ఉందని శుక్రవారం ఉదయం సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తంగదురై అన్నారు. హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్ ఆదేశాల మేరకు సిఫ్‌కాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ నేతృత్వంలో పారిశ్రామికవాడలోని కొంత మంది పరిశ్రమాధిపతుల ఆర్థిక సాయంతో హోసూరు- బెంగళూరు జాతీయ రహదారి జుజువాడి నుంచి అన్నామలై వరకు సుమారు 171 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తంగదురై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... హోసూరు మహానగరంలో దోపిడీలు, దొంగతనాలు, ప్రమాదాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన పరిశ్రమాధిపతులను ఎస్పీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. దాతలు సునీల్‌తవాన్, గణేష్, నవీన్‌కుమార్, కౌన్సిలర్ మురళి, కార్పొరేటర్ చైత్ర అరుణ్‌కుమార్, డీఎస్పీ బాబు ప్రశాంత్, ఎస్ఐ ప్రకాష్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్యాం నుంచి సాగునీరు విడుదల



హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని కేఆర్‌పీ డ్యాం నుంచి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. క్రిష్ణగిరి ఎంపీ కే.గోపీనాథ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ శరయు మాట్లాడుతూ... క్రిష్ణగిరి రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదల చేయడం ద్వారా పెరియముత్తూరు, సుండేకుప్పం, తిమ్మాపురం, చౌటహళ్లి, తళిహళ్లి, కాల్వేహళ్లి, గుండలంబట్టి, మిట్టపల్లి, ఎర్రహళ్లి, పెన్నేశ్వరమఠం, కావేరిపట్టణం, బాలేగుళి, మారిశెట్టిపల్లి, నాగోజనహళ్లి, జగదాబ్, పైయ్యూరు తదితర 16 గ్రామపంచాయతీలకు చెందిన 9012 ఎకరాల భూమి సాగులోకి వస్తుందని, నవంబర్ 11వ తేదీ వరకు 130 రోజుల పాటు రైతులకు సాగునీరు విడుదల చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు సెందిల్‌కుమార్, పచ్చయప్పన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.


భవనం కూల్చివేతపై ఫిర్యాదు



భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న కోఆప్‌టెక్స్ భవనాన్ని పంచాయతీ యంత్రాంగం కూల్చివేసిందని కోఆప్‌టెక్స్ సహాయక డైరెక్టర్ కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 30 ఏళ్ల క్రితం కెలమంగలం పట్టణ పంచాయతీలో చేనేత పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో కోఆప్‌టెక్స్ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా భవనాన్ని నిర్మించి చేనేత పరిశ్రమలకు అవసరమైన ముడి సరకులను అందజేస్తూ, వారు తయారు చేసే వస్త్రాలను కొనుగోలు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో రానురాను కెలమంగలం పట్టణంలో చేనేత వృత్తి అంతరించిపోవడంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం మూతపడిన ఈ భవనాన్ని పట్టణ పంచాయతీ యంత్రాంగం కోఆప్‌టెక్స్ అనుమతి లేకుండా కూల్చివేసింది. విషయం తెలుసుకొన్న సేలం మండల సహాయక డైరెక్టర్ నేరుగా ఘటనా స్థలానికి చేరుకొని అనుమతి లేక భవనాన్ని కూల్చివేయడంపై ఆరా తీశారు. అందుకు అధికారులు నిరుపయోగంగా ఉన్న ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంతో కూల్చివేసినట్లు బదులివ్వడంతో కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తొలకరి చినుకులు పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న రచయిత

బనశంకరి: అలిసిపోయిన బాటల్లో పూల తోటల నీడల విడిదులే కవితలు అని అన్నారు ఓ కవి. నిజమే జీవన యానంలో ఒత్తిడుల ఒరిపిడిలో మనిషి కోసం బుట్టెడు మెరుపుల్ని నేసి ఆకాశంపై నీలిగొంగళిని అలంకరించి ఆత్మీయతాసుమాల చినుకుల్ని చల్లి మట్టిపరిమళ రాగాల్ని ఆలాపన చేసేది కవిత్వమే. తన గమ్యం సరిగ్గా తెలుసుకుని కవిత్వమొక విశాలాకాశమని గమనించి తన అనుభవాల అనుభూతుల్ని కలం సిరాలో రంగరించి రాసిన స్వీయ కవితల్ని కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య బెంగళూరు ప్రధాన కార్యదర్శి కవి డాక్టర్ నరేంద్రబాబు సింగూరు తొలకరి చినుకులు సంపుటిగా పాఠక లోకానికి అందించారు. ఇది ఆయన తొలి కవితా సంపుటి అయినప్పటికీ చేయి తిరిగిన కవి రాసే పరిణిత కవితా వ్యాఖ్యలతో కూడిన 53 కవితలు ఇందులో ఉన్నాయి. కవితల క్రమానికి కూడా పుస్తక శీర్షికకు కలిపే విధంగా చినుకుల వరుస అని పేరుపెట్టారు.

జంతు ప్రేమికా.. జాగ్రత్త సుమా!

మూగజీవాల పెంపకంపై పెరిగిన ఆసక్తి

వ్యాధులపై అప్రమత్తత అవసరం

నేడు ప్రపంచ జునోసిస్ డే



ఉమ్మడి జిల్లాలో ఇలా..

రాజమహేంద్రవరం రూరల్ /రాయవరం/ కాకినాడ సిటీ: మూగజీవాల పెంపకంపై ఎంతో మంది శ్రద్ధ చూపుతున్నారు. అందుకే ప్రస్తుతం అవి మానవ జీవితంతో ముడిపడ్డాయి.. నిన్న మొన్నటి వరకూ సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారింది. అలాగే గుర్రాలు, కుందేళ్లు, పిల్లులతో పాటు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోతులు వంటి వాటినీ పెంచుకుంటున్నారు. ఎంతో ఇష్టంగా సాకుతున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. పరిశోధనల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. శనివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా వాటి గురించి తెలుసుకుందాం రండి.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైంది. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885 జూలై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడం వల్ల ప్రతి ఏటా ప్రపంచ జునోసిస్ దినోత్సవం జరుపుకొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో వీధికుక్కలు 1,15,771, పెంపుడు కుక్కలు 26,562, ఆవులు 74,778, గేదెలు 1,93,847, గొర్రెలు 1,71,263, మేకలు 69,265, పందులు 2,080 ఉన్నాయి. కోనసీమ జిల్లాలో మొత్తం పెంపుడు జంతువులు 63,953 ఉన్నాయి. ఇందులో కుక్కలు 22,570 ఉండగా, పిల్లులు, గుర్రాలు, కుందేళ్లు, పక్షులు, ఇతర పెంపుడు జంతువులు 41,383 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పశువైద్య శాలలు, ప్రాంతీయ, వెటర్నటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో జునోటిక్ వ్యాధుల నివారణకు శనివారం ఉచితంగా టీకాలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం జిల్లాకు 32 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేశారు.

ఏ వ్యాధులు వస్తాయంటే..

పాడి పశువుల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసిస్, లిస్టిరియోసిస్, రింగ్‌వార్మ్ వ్యాధులు వస్తాయి. గొర్రెలు, మేకల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసిస్, లిస్టిరియా, హైడాటిడోసిస్, సార్కోసిస్టిస్, సోల్మోనెల్లోసిస్, క్యూ-ఫీవర్, మేంజ్ వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కల నుంచి రేబిస్, లీష్మేనియా, బద్దెపురుగుల వ్యాధి, రింగ్ వార్మ్, హైడాటిడోసిస్, మీసిల్స్, మంప్స్, మేంజ్ వ్యాధులు వస్తాయి. అలాగే పందులు, పిల్లులు, గుర్రాలు, కోళ్ల రామచిలుకలు, కుందేళ్ల నుంచీ వివిధ వ్యాధులు సోకుతాయి.

శుభ్రత.. భద్రత

ముఖ్యంగా పిల్లులు, కుక్కలు వంటి పెంపుడు జంతువులు, పక్షులను పెంచుకోవడం బాగా పెరిగింది. పెంపుడు జంతువులతో ఆటలాడిన తర్వాత శుభ్రత పాటించకుంటే వ్యాధులకు గురవుతుంటారు. జంతువులను పెంచుకునే వారు తగిన జాగ్రత్తలు పాటించకుంటే వాటి నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఇందులో రేబిస్, ఆంత్రాక్స్ వంటివి భయాందోళనకు గురిచేస్తున్నాయి. అందువల్ల తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులపై దాడి చేయకుండా యజమానులూ జాగ్రత్త పడాలి.

వ్యాక్సిన్ తప్పనిసరి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. కుక్కలకు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దానివల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లులు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

వైద్యుల సలహాలు తప్పనిసరి

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునాటిక్ డిసీజస్ అంటారు. ఇవి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పశు వైద్యుల సలహాలు తీసుకోవాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు. జునోసిస్ డే సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు, వాటి యజమానులకు, పశుసంవర్ధక శాఖ సిబ్బందికి, మున్సిపల్ వర్కర్లకు, జంతువధ శాఖ సిబ్బందికి, జంతు ప్రేమికులకు ఉచితంగా యాంటీ రాబీస్ టీకాలు వేస్తాం.

–టి.శ్రీనివాసరావు, జిల్లా పశు వైద్యాధికారి, తూర్పుగోదావరి

సకాలంలో టీకాలు వేయించాలి

వ్యాధులు రాకుండా పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలి. వ్యాధులు సోకిన వాటిని మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. అవి ఉండే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి. వాటికి సన్నిహితంగా ఉండే వారు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. ఇంట్లో కుక్కల పెంపకం చేపట్టిన యజమానులు చర్మ సమస్యలు వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఆరోగ్య, పశుసంవర్ధక అధికారుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలి.

–డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

వ్యాధులు సంక్రమించకుండా టీకాలు

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునాటిక్ డిసీజస్ అంటారు. ఇవి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పశు వైద్యుల సలహాలు తీసుకోవాలి. ఏటా జునోసిస్ దినోత్సవాన్ని జూలై 6న జరుపుకోవడం ఆనవాయితీ. పశువుల వ్యాధుల పట్ల మరిన్ని సలహాల కోసం ప్రభుత్వం 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా రేబిస్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులైన కుక్కలకు టీకాలు వేయించాలి.

–ఎస్.సూర్యప్రకాశరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, కాకినాడ



ఓడలరేవులో సముద్ర కెరటాలకు కోతకు గురైన రోడ్డు, పక్కనే ఓఎన్‌జీసీ రక్షణ గోడ

అల.. హడలెత్తిస్తోంది

ఓఎన్‌జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌కు ముప్పు.. వందమీటర్లు చొచ్చుకు వచ్చిన సముద్రం



సముద్ర కోతతో కనుమరుగైన సరుగుడు తోటలు (ఫైల్)

అల్లవరం: సహజ వనరుల నిక్షేపాల కేంద్రాన్ని సముద్రం చుట్టేస్తోంది. కోనసీమలో ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు భారీ ముప్పు పొంచి ఉంది. కృష్ణా – గోదావరి బేసిన్‌లోని సముద్ర జలాల అడుగు భాగంలోని గ్యాస్, చమురు నిక్షేపాలను నాలుగు దశాబ్దాలుగా ఓఎన్‌జీసీ వెలికితీస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరానికి సుమారు 20 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంపై ఉన్న ఆఫ్‌షోర్ టెర్మినల్ నుంచి రిగ్గుల ద్వారా సుమారు 15 లక్షల క్యూబిక్ మీటర్ల చమురు నిక్షేపాలను రోజూ వెలికి తీస్తోంది. ఇలా తీసిన నిక్షేపాలను పైపుల ద్వారా ఓడలరేవులోని ఆన్‌షోర్ టెర్మినల్‌కు తరలిస్తుంది.

పొంచి ఉన్న ప్రమాదం

సముద్ర అలల కారణంగా ఇప్పుడు ఈ ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉంది. ఓడలరేవు గ్రామంలో 370 ఎకరాల్లో ఓఎన్‌జీసీ ఆన్‌షోర్ టెర్మినల్ విస్తరించి ఉంది. గ్యాస్, చమురు నిక్షేపాలను ఈ ఆన్‌షోర్ టెర్మినల్‌లో శుద్ధి చేసి గ్యాస్‌ను, చమురును ఆ కలెక్షన్ సెంటర్లకు మళ్లిస్తారు. ఈ టెర్మినల్‌కు రక్షణగా 2017లో చుట్టూ ప్రహరీ నిర్మించారు. టెర్మినల్‌కు దక్షిణంగా సముద్రం ఉంది. అప్పట్లో ప్రహరీకి సముద్రం కనీసం వంద మీటర్ల దూరం ఉండేది. మారిన వాతావరణ పరిస్థితులు, తుపానులు, అల్పపీడనాలతో ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కెరటాలకు తీరం కోతకు గురవుతోంది. ఏడేళ్లలో సముద్రం వంద మీటర్ల ముందుకు వచ్చింది. ప్రస్తుతం టెర్మినల్ ప్రహరీని సముద్రం తాకుతోంది. దక్షిణ, పశ్చిమం రెండు వైపులా ప్రహరీని భారీ అలలు చుట్టేస్తున్నాయి. ప్రహరీ చుట్టూ నిర్మించిన బీటీ (తారు) రోడ్డు, డ్రైనేజీని సముద్రం తనలో కలిపేసుకుంది. కెరటాల ఉధృతికి ప్రహరీ కూలితే టెర్మినల్‌కు పెనుముప్పు సంభవించే అవకాశం ఉంది. అదే జరిగితే రూ.కోట్ల విలువ చేసే టెర్మినల్‌కు భారీ నష్టం తప్పదు.

సరుగుడు తోటలు నరికేసి..

ఓడలరేవులో వైనతేయ నది సముద్రంలో కలిసే సంగమం నుంచి కిలోమీటరు పొడవునా సరుగుడు తోటలు విస్తరించి ఉండేవి. కాలక్రమేణా ఈ తోటలను నరికేశారు. వేరు వ్యవస్థ కనుమరుగు కావడంతో భారీ అలల తాకిడికి తీరం కోతకు గురైంది. ఆన్‌షోర్‌పై టెర్మినల్ నిర్మాణానికి ముందు సముద్రం ఒక కిలోమీటర్ దూరంలో ఉండేదని, ప్రస్తుతం ప్రహరీని తాకుతోందని స్థానికులు చెబుతున్నారు. అంటే నాలుగు దశాబ్దాల కాలంలో సముద్ర తీరం ఏ స్థాయిలో కోతకు గురైందో ప్రస్తుత పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.

స్పందించకుంటే ప్రమాదమే..

ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఓడలరేవు నుంచి కొమరగిరిపట్నం యడ్లరేవు వరకూ తీరం పొడవునా నాలుగు కిలోమీటర్ల వరకూ రూ.100 కోట్లతో రక్షణ గోడ నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. దీనికి ఓఎన్‌జీసీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఆ తర్వాత ఓఎన్‌జీసీ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో రక్షణ గోడ నిర్మాణం అటకెక్కింది. ఇటీవల కాలంలో కోతకు గురైన ప్రాంతంలో స్క్వేర్ ట్యూబ్‌ను ఏర్పాటు చేశారు. భారీ తుపాన్ల సమయాల్లో అలలకు స్క్వేర్ ట్యూబులను సైతం సముద్రం తనలో కలిపేసుకునే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఓఎన్‌జీసీ, ప్రజాప్రతినిధులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో టెర్మినల్‌కు ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఓఎన్‌జీసీ నిర్లక్ష్యం

గ్లోబర్ వార్మింగ్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. దీనివల్ల ఓడలరేవులోని ఓఎన్‌జీసీ టెర్మినల్ ప్రహరీని అలలు తాకుతున్నాయి. అయినా ఓఎన్‌జీసీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందో అర్థం కావడం లేదు. 2004లో సునామీ తర్వాత ఇక్కడి సముద్ర తీరం భారీ కోతకు గురైంది. వందలాది ఎకరాలు సముద్రంలో కలిసిపోయాయి. శాస్త్రవేత్తల బృందం ఇక్కడి పరిస్థితులపై అధ్యయనం చేసి దానికి అనుగుణంగా జియో ట్యూబ్, గ్రోయిన్లు, లేదా రక్షణ గోడ నిర్మించాలని సూచించింది. ఓఎన్‌జీసీ ఈడీగా మార్బుల్ ఉన్న సమయంలో తీరం పొడవునా రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. అది ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు.

– పాల వెంకటేశ్వరరావు, ఓడలరేవు

పోలవరం నిర్వాసితులను ఆదుకోండి

- వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల రాష్ట్ర నాయకత్వాల ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాలు, పునరావాస కాలనీల్లో రెండు రోజుల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సుందరయ్య భవనంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, వి.శివ నాగరాణి మాట్లాడుతూ నిర్వాసితులకు నేటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం ఇవ్వలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇళ్లకు ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మార్చుకోవాలని కోరారు. తాను మారానని, మారిన చంద్రబాబును చూస్తారని చెప్పిన ముఖ్యమంత్రి.. మాట మీద నిలబడాలని, సర్వం కోల్పోయిన గిరిజనులు, ఇతర కులాల్లో ఉన్న పేదలను వెంటనే ఆదుకోవాలని కోరారు. పునరావాస కాలనీలకు వచ్చిన రైతులు వ్యవసాయం చేసుకోవడానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకం పనులు పునరావాస కాలనీల్లోని గ్రామాల్లో 150 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే.. రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వివిధ రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

శివాజీని వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా ఎలా ప్రకటిస్తారు?

- పోలీసులపై మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మండిపాటు



రాజమహేంద్రవరం సిటీ: తన ప్రచార రథాన్ని దహనం చేసిన దంగేటి శివాజీ ఎన్డీఏ కూటమి కోవర్ట్ అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ చెప్పారు. సమగ్ర విచారణ జరపకుండానే శివాజీ తమ పార్టీ కార్యకర్త అని ఎలా ప్రకటిస్తారని అన్నారు. తనపైన, తన తండ్రి నాగేశ్వరరావుపైన పోలీసులు ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. భరత్‌రామ్ శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రథాన్ని తగలబెట్టక ముందే పోలీసులు ఘటన స్థలానికి ఎలా వచ్చారు? శివాజీ తన తండ్రికి ఏ టైంలో ఫోన్ చేశాడు అనే రెండు అంశాలు తేల్చాలని చెప్పారు. ఇందుకు శివాజీ కాల్ డేటాపైన కూడా విచారణ జరపాలని తెలిపారు. శివాజీ ఎన్నికలకు నెల ముందే పార్టీలో చేరాడన్నారు. అతను ఆరు నెలలుగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో టీడీపీ, బీజేపీలకు అనుకూలంగా పోస్టులు పెట్టేవాడని, ఏప్రిల్ 22న కూడా శివాజీ ఫేస్‌బుక్‌లో బీజేపీకి మద్దతుగానే పోస్ట్ చేశాడని తెలిపారు. అతని బంధువులు టీడీపీలో తిరుగుతున్నారని తెలిపారు. ఎన్నికలకు నెల ముందే తనపై కోవర్ట్ ఆపరేషన్ జరిగిందని అన్నారు. ప్రచార రథాన్ని దగ్ధం చేయడంలో తన కుటుంబ సభ్యుల ప్రమేయం లేదని మార్కండేయ స్వామి దేవాలయంలో స్వామి వారి ముందు తాను, తన తండ్రి ప్రమాణం చేస్తామని, టీడీపీ నాయకులు కూడా వారికి ప్రమేయం లేదని ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. దీని వెనుక ఎవరున్నారో సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- 18 మంది హాకీస్టిక్స్, రాళ్లతో దాడి
- వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో టీడీపీ గూండాల అరాచకం



తీవ్రంగా గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె: పులివెందుల నియోజకవర్గం వేంపల్లెలో టీడీపీ గూండాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త వేంపల్లె అజయ్‌కుమార్‌రెడ్డిపై హత్యాయత్నం చేశారు. హాకీస్టిక్స్, రాళ్లతో దాడిచేసి చంపేసేందుకు ప్రయత్నించారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డిని కడప ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కథనం మేరకు.. పులివెందుల రోడ్డులోని రాజీవ్‌కాలనీ సమీపంలో ఉన్న సంసిద్ సతీష్‌రెడ్డి స్కూలు నుంచి అజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్ ద్విచక్ర వాహనంలో వేంపల్లెకు వస్తుండగా రెండు వాహనాల్లో వచ్చిన 18 మంది టీడీపీ వారు అడ్డుకున్నారు. శేఖర్ తప్పించుకుని స్కూలు ఆవరణలోకి పరుగెత్తారు. దుండగులు అజయ్‌కుమార్‌రెడ్డిపై దాడిచేసి హాకీస్టిక్స్, రాళ్లతో తీవ్రంగా కొట్టారు. ఈ లోపు ప్రజలు గుమికూడటంతో పరారయ్యారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అజయ్‌కుమార్‌రెడ్డిని పాఠశాల సిబ్బంది, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి మనుషులు వచ్చి వేంపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కడప ఆస్పత్రికి తరలించారు. వచ్చినవారు టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, ఆయన కుమారుడు రవితేజరెడ్డి మనుషులమంటూ కొట్టారని బాధితుడు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. పోలీసులు.. పదిమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అజయ్‌కుమార్‌రెడ్డి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరుడు. వేంపల్లె ఆస్పత్రిలో అతడిని సతీష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని అతడి తల్లిదండ్రులకు భరోసానిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/రామసముద్రం: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న వికాస్‌రాజ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సీఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. సుదర్శన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లి గ్రామానికి చెందినవారు. 2002 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి ఏపీలో ట్రైనీ కలెక్టర్, సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 నుంచి 2019 వరకు కేంద్రమంత్రిగా పనిచేసిన బండారు దత్తాత్రేయకు పర్సనల్ సెక్రటరీగా, అప్పుడు రక్షణశాఖ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలో మున్సిపల్‌శాఖ సెక్రటరీగా పనిచేశారు. సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమితుడు కావడంతో ఆయన స్వగ్రామమైన తిరుమలరెడ్డిపల్లెలో ఆయన బంధువులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

న్యాయ సాయం చెయ్యండి

ఓటుకు నోటు కేసు బాధితుడు మత్తయ్య విజ్ఞప్తి

పంజగుట్ట (హైదరాబాద్): గత 10 సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరగలేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తనకు న్యాయసాయం చేసి ఆదుకోవాలని ఓటుకు నోటు కేసులో నిందితుడు జెరుషలేము మత్తయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, అప్పట్లో బీఆర్ఎస్‌ను కూల్చి కాంగ్రెస్ పాలన తీసుకువచ్చేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో భారీ కుట్రను చేశారని తెలిపారు. వారి రాజకీయ అవసరాల కోసం తనను కొరియర్‌గా వాడుకున్నారని, ఆ కేసులో ఇరుక్కుని తాను 2015 నుంచి సుప్రీంకోర్టుకు, ఇటు నాంపల్లి కోర్టుకు, ఈడీ కోర్టుకు తిరగలేక ఆర్థికంగా ఎంతో చితికిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నుంచి చంద్రబాబు పేరు తొలగించగానే తనను పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు ఫీజులు, ఢిల్లీకి రాకపోకల ఖర్చులు భరించలేకుండా ఉన్నానని తెలిపారు. తన తరఫున వాదించేందుకు సరైన అడ్వకేట్‌లను నియమించి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. శనివారం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలుస్తున్న నేపథ్యంలో తన కేసుగూర్చి కూడా నిర్ణయం తీసుకోవాలని మత్తయ్య కోరారు.

బ్యాంకులతో మాట్లాడుతున్నాం

- ‘సాక్షి’ కథనంపై స్పందించిన విద్యుత్ పంపిణీ సంస్థలు
- భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌తో అనుసంధానమైతే బిల్లులపై చార్జీలు ఉండవు
- డిస్కమ్‌ల యాప్‌లు, వెబ్‌సైట్లలో చెల్లింపులపై ప్రచారం



ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

సాక్షి, అమరావతి: భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌తో అనుసంధానమైతే విద్యుత్ బిల్లులపై ఎలాంటి చార్జీలు ఉండవని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) పేర్కొన్నాయి. ‘బిల్లుపై బాదుడు’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై డిస్కమ్‌లు శుక్రవారం స్పందించాయి. డిస్కమ్‌ల మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏ విధమైన అదనపు చార్జీలను విధించడం లేదని తెలిపాయి. నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులకు గతంలో ఎలాంటి చార్జీలు అమలులో ఉన్నాయో ప్రస్తుతం కూడా అలాగే వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆర్బీఐ తాజా మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్ లావాదేవీలన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టం ద్వారా మాత్రమే జరపాలని, అందుకోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నట్లు వివరించాయి. భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌తో అనుసంధానం కావడం ద్వారా జరిగే చెల్లింపులకు ఎటువంటి చార్జీలు ఉండవు. అయితే బ్యాంకులతో సంప్రదింపులకు ఎంత సమయం పడుతుందన్న ప్రశ్నకు డిస్కమ్‌ల వద్ద సమాధానం లేదు.

పాత పద్ధతుల్లోనూ వసూలు..

వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించేందుకు గతంలో మాదిరిగానే విద్యుత్ కార్యాలయాలు, ఏటీపీ మెషిన్లు, డిస్కమ్‌ల కాల్ సెంటర్, మీసేవ, ఏపీ ఆన్‌లైన్ సెంటర్, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సిబ్బంది ద్వారా బిల్లులు వసూలు చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ వెల్లడించింది. ఆన్‌లైన్‌లో చెల్లింపులకు సంబంధించి విధివిధానాలను ప్రచార సాధనాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, విద్యుత్ కార్యాలయాలు, సిబ్బంది ద్వారా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొంది. డిస్కమ్‌ల యాప్ ద్వారా బిల్లుల చెల్లింపులే కాకుండా విద్యుత్ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, గతంలో చెల్లించిన బిల్లు వివరాలు, నెలవారీ యూనిట్ల వినియోగం, సరాసరి వినియోగానికి ఎంత బిల్లు చెల్లించాలనే సదుపాయాలు పొందవచ్చని తెలిపింది. నిర్ణీత సమయంలోగా బిల్లులు చెల్లించే విధంగా వినియోగదారులకు అలర్ట్ మెసేజ్ కూడా పంపుతున్నట్లు పేర్కొంది.

నటుడు రాజ్‌తరుణ్‌పై ప్రియురాలి ఫిర్యాదు

- తనతో సహజీవనం చేస్తూ మరో హీరోయిన్‌తో ప్రేమాయణం
- రాజ్ తరుణ్‌తో పదకొండేళ్లుగా కలిసి ఉన్నా
- ఆ హీరోయిన్ కుటుంబీకులతో ప్రాణహాని ఉంది
- తనకు రక్షణ కల్పించాలని కోరుతూ లావణ్య అనే యువతి ఫిర్యాదు



మణికొండ (హైదరాబాద్): టాలీవుడ్ యువ నటుడు రాజ్ తరుణ్‌పై నార్సింగి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజ్ తరుణ్ తను ఒకరినొకరం ప్రేమించుకున్నామని పదకొండేళ్లు కలిసి జీవించామని ఇప్పుడు అతడు ముంబైకు చెందిన ఓ హీరోయిన్‌తో ప్రేమాయణం సాగిస్తున్నాడని పేర్కొంటూ కోకాపేటకు చెందిన ఎం.లావణ్య అనే యువతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతోపాటు సహజీవనం చేస్తూ ప్రస్తుతం మరో హీరోయిన్‌తో ప్రేమాయణం సాగిస్తూ తనను మోసం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ముంబైకు చెందిన సదరు హీరోయిన్‌తో కలసి ప్రస్తుతం ‘తిరగబడరా స్వామి’అనే సినిమాలో నటిస్తున్నాడని..ఆమె మోజులో పడి తనను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. వీరిద్దరూ కలసి ఇటీవల గోవా, చెన్నై, పాండిచ్చేరిలకు కలసి వెళ్లారని ఇదే విషయాన్ని తాను నిలదీయగా తనను దూరం పెట్టాడని పేర్కొంది. రాజ్ తరుణ్‌ని వదిలేస్తే తనకు కొంత డబ్బు ముట్టజెబుతామని లేదంటే చంపేస్తామని హీరోయిన్ సోదరుడు బెదిరించాడని తెలిపింది. హీరోయిన్ తండ్రి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సన్నిహితుడని వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని తనను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొంది. గతంలో తనను తప్పుడు కేసులో ఇరికించడంతో 43 రోజులు జైలులో ఉన్నానని తెలిపింది. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా సదరు హీరోయిన్ పేరు మాల్వీ మల్హోత్రాగా లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాణ్యమైన గుడ్లు, చిక్కీలు సరఫరా చేయాలి

సాక్షి, అమరావతి: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన గుడ్లు, చిక్కీలు అందించాలని సరఫరాదారులను సమగ్ర శిక్షా ఎస్పీడీ, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం అధికారులు, ఆహార పదార్థాల సరఫరాదారులతో సమీక్ష నిర్వహించారు.

సాంకేతిక విద్య,శిక్షణ మండలి కార్యదర్శిగా విజయకుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శిగా వి.విజయకుమార్‌ను నియమిస్తూ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత కార్యదర్శి రమణబాబు పదవీ విరమణ పొందారు. ఇప్పటి వరకు విజయకుమార్ నెల్లూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

రాజధానిలో పారిశుధ్య మహిళా కార్మికులపై వేధింపులు ఆపండి

తాడికొండ: రాజధానిలో పారిశుద్య పనులు చేస్తున్న మహిళా కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న అధికారులను ప్రభుత్వం కట్టడి చేయాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల కోసం వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరు సీఐటీయూ కార్యాలయంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం సమావేశం సంఘం అధ్యక్షురాలు చెరుకూరి సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ మూడో నెల గడుస్తున్నా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 6-7-2024



● శివాని

కనుచూపు లేక ముసిరిన చీకటిలో
పట్టుదల కాంతిపుంజమై దారి చూపింది.
రెప్పల మాటున దాగున్న కలలను చదువుతో సాకారం చేసుకుంది.
అంధత్వాన్ని జయించి జాతీయ స్థాయిలో నిర్వహించే
ఐ.ఐ.ఎం. (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)
పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి
దేశంలోని 21 ఐ.ఐ.ఎం. కళాశాలల్లోని 19 కళాశాలల్లో అర్హత సాధించింది.
తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని
గడి మహెలాలకు చెందిన కొత్తకాపు శివాని భవిష్యత్తుకు
నిర్మించుకుంటున్న సోపానాలను ఇలా మన ముందుంచింది.

చూపున్న కల

'మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు కొత్తకాపు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డిలకు రెండోసంతానాన్ని. మా అక్క కీర్తన గ్రూప్ 4 పరీక్ష రాసి ఉద్యోగం సాధించింది. మా చెల్లి భవానికి 80 శాతం చూపులేదు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ సీటును సాధించింది. నాకు పుట్టుకతోనే చూపు లేదు. అయినా, చదువంటే మాకెంతో ఆసక్తి. అదే మమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని మా నమ్మకం. జహీరాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరంలో నా ప్రైమరీ చదువు ఆరంభమైంది. కానీ, చూపు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడేదాన్ని. నా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అమ్మానాన్నలు హైదరాబాద్‌లోని బేగంపేటలో గల దేవనార్ పబ్లిక్ స్కూల్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు అదే బడిలో చదువుకున్నాను. పదోతరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. ఇంటర్మీడియెట్‌ను జహీరాబాద్‌లోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో కామర్స్‌తో పూర్తి చేశాను. కాలేజీలో క్లాసులను విని, సహాయకులతో పరీక్షలు రాశాను. ఆ రెండేళ్లు కాలేజీ టాపర్‌గా నిలిచాను.

ఎంతో గర్వంగా ఉంది

మా అమ్మాయి శివానీ జాతీయ స్థాయిలో ఐఎంఎ సీటును సాధించడం మాకెంతో గర్వంగా ఉంది. ఆమె పుట్టుగుడ్డిగా పుట్టినప్పుడు కొంత బాధపడ్డాం. కొందరు మనసు నొప్పించే మాటలు అనేవారు. కానీ, వాటిని పట్టించుకోకుండా అమ్మాయిలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో కష్టపడి చదివించాం. ఇప్పుడు శివానీ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

– విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి



● కుటుంబ సభ్యులతో శివానీ

ఉన్నతస్థాయి ఉద్యోగమే లక్ష్యం

చెన్నైలోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరి బీబీఏ కోర్సు పూర్తి చేశాను. క్యాట్ ఎగ్జామ్ కోసం ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్నాను. 2023లో నిర్వహించిన ఐఐఎం ప్రవేశ పరీక్ష రాసి 93.51 శాతం మార్కులతో దేశంలోని 21 ఐఐఎం కళాశాలల్లోని 19 కళాశాలల్లో ప్రవేశార్హత సాధించాను. వాటిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ ఐఐఎంను ఎంపిక చేసుకున్నాను. కిందటి నెల 23న కళాశాలలో చేరాను.

శక్తినిచ్చే గీతోపదేశం

చూపు లేకపోవడంతో చదువు కష్టంగా ఉండేది. బ్రెయిలీ లిపి నేర్చుకునేంతవరకు చదువు పట్ల నాకున్న తపనను ఎలా తీర్చుకోవాలో తెలిసేది కాదు. అంధుల పాఠశాలలో చేరాక నాకు పెద్ద అండ దొరికినట్టుగా అనిపించింది. కార్పొరేట్ కంపెనీలలో టాప్ లెవల్ ఉద్యోగం చేయాలని ఉంది. అందుకు తగిన అర్హతలు సంపాదించుకోవడానికి స్పెషలైజేషన్ కూడా చేస్తాను. శ్రీకృష్ణుడి గీతోపదేశం వింటూ ఉంటాను. జీవితంలోని ఒడిదొడుకులను ఎలా ఎదుర్కోవాలో, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎలా నిలబడాలో గీత ద్వారానే నేను తెలుసుకుంటున్నాను. రెండు సంవత్సరాల ఐఐఎం కోర్సును విజయవంతంగా పూర్తి చేసి, ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని సాధించాలన్నదే నా లక్ష్యం. అమ్మానాన్నలకు, పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలన్నదే నా ఆకాంక్ష'' అని చెప్పింది శివాని.

– యెర్రుల్ శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి, జహీరాబాద్

చైతన్యం



రాజ్యసభలో ప్రసంగిస్తున్న సుధామూర్తి

రాజ్యసభ సభ్యురాలిగా మొదటిసారి సమావేశాల్లో పాల్గొన్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి భారతీయ పేద మహిళల్లో ఇటీవల అత్యధికంగా చోటు చేసుకుంటున్న సర్వైకల్ క్యాన్సర్ మరణాల గురించి మాట్లాడారు. దీనికి అడ్డుకట్ట వేయడం కోసం వేక్సిన్ ఇవ్వాల్సిన ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేశారు. నిజమే. సర్వైకల్ క్యాన్సర్ గురించి ఇది చైతన్యం కలిగించాల్సిన సమయం. ప్రభుత్వం పూనుకోవాల్సిన సమయం.

వ్యాక్సిన్ ఇప్పిద్దాం... మహిళల ప్రాణాలు కాపాడదాం

కొన్ని అధ్యయనాల ప్రకారం మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాప్తి 7% నుంచి 27% మందిలో కనిపిస్తోంది. ఇవన్నీ క్యాన్సర్‌గా మారనప్పటికీ, చాలా కేసుల్లో క్యాన్సర్ ముప్పు మాత్రం ఉంటుంది. పద్దెనిమిదేళ్ల తర్వాత పెళ్లయ్యే యువతులతో పోలిస్తే అంతకంటే ముందుగానే వివాహమయ్యే వారిలో ఇది ఆరు శాతం ఎక్కువ. ప్రస్తుత అంచనాల ప్రకారం ప్రతి ఏడాది 1,23,907 మంది మహిళల్లో దీన్ని కనుగొంటుండగా... ఏటా 77,348 మంది మరణిస్తున్నట్లు అంచనా. గణాంకాల ప్రకారం సంఖ్యాపరంగా పదిహేనో ఏటి నుంచి 44 ఏళ్ల మహిళల్లో వస్తూ, వారిని మృత్యుముఖానికి నెట్టే క్యాన్సర్లలో ఇది రెండో అతి పెద్దది.

మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్ కు వ్యాక్సిన్‌ను ప్రభుత్వమే అందజేస్తే మహిళాలోకానికి చాలా మేలు చేసినట్లవుతుంది. తమ కుటుంబానికే తొలి ప్రాధాన్యమిచ్చే స్త్రీలు సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి, ఏ నాలుగో దశలోనో, మూడో దశలోనో హాస్పిటల్స్‌కు వస్తూ, చేజేతులా మరణాన్ని తెచ్చుకుంటున్నారు. అదే తొమ్మిది నుంచి 45 ఏళ్ల వయసులోనే వారికీ వ్యాక్సిన్ ఇప్పిస్తే ఎన్నో మరణాలను నివారించగలం. కోవిడ్ టైమ్‌లో దేశం మొత్తానికి వ్యాక్సిన్ ఇప్పించిన మనకు ఇదేమీ కష్టం కాబోదు. ప్రైవేటు సంస్థల్లో దీన్ని దాదాపు రూ. 1,400 నుంచి రూ. 1,500 లకు అమ్ముతున్నారు. వ్యాక్సిన్ తయారీ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపి, చవగ్గా ఏ ఏడువందల రూపాయలకో ఇప్పించగలిగితే అత్యంత నిరుపేద మహిళల ప్రాణాలనూ మనం కాపాడ గలిగినవాళ్లమవుతాం.

– సుధామూర్తి
రాజ్యసభ సభ్యురాలు,
సమాజ సేవిక

ఏమిటీ సర్వైకల్ క్యాన్సర్?

మహిళల్లో యోని (వెజైనా) తర్వాత వచ్చే భాగమే సర్విక్స్. ఇది గర్భాశయానికి కింద ఉంటుంది. అంటే ఇది యోనికీ, గర్భాశయానికీ (యుటెరస్)కూ మధ్యన సన్నటి దారిలా ఉండే సర్విక్స్ గర్భాశయానికి ముఖద్వారంలా ఉంటుంది కాబట్టే దీన్ని 'గర్భాశయ ముఖద్వారం' అనీ, దీనికి వచ్చే క్యాన్సర్‌ను 'సర్వైకల్ క్యాన్సర్' (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) అని అంటారు.

నిజానికి మిగతా క్యాన్సర్‌లతో పోలిస్తే గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్‌ను చాలా సులువుగా నివారించవచ్చు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించడం మంచి పరిష్కారం. దీని చికిత్స కూడా చాలా సులభం. ఎంత ముందుగా గుర్తిస్తే దీనికి అంత సమర్థంగా, తేలిగ్గానూ చికిత్స అందించవచ్చు. సాధారణంగా పల్లెల్లో కంటే పట్టణాల్లో, నగరాల్లో వ్యాధుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ ఈ క్యాన్సర్ విషయానికి వస్తే ఇది గ్రామీణ ప్రాంతాల స్త్రీలలో ఇది చాలా ఎక్కువగా కనిపిస్తోంది. చాలా చిన్నవయసులోనే అందునా పద్ధెనిమిదేళ్ల వయసు కంటే చాలా తక్కువ వయసులోనే అక్కడ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తూ ఉండటం ఇందుకు ఒక కారణమని కొంతమంది పరిశీలకుల విశ్లేషణ. అయితే ఇంతటి తీవ్రమైన వ్యాప్తిలోనూ అదృష్టం ఏమిటంటే... ఈ క్యాన్సర్ రావడానికి ముందర కనీసం 10 ఏళ్ల ముందుగానే కనుగొనగలిగేలా దీనికి చాలా ఎక్కువ వ్యవధిగల ప్రీ-క్యాన్సరస్ దశ ఉంటుంది. ఈ సమయంలో కనుగొనగలిగితే దాన్ని దాదాపు పూర్తిగా నయం చేయడానికి అవకాశముంటుంది.

హెచ్‌పీవీతో సమర్థమైన నివారణ

మామూలుగా శక్తిమంతమైన వైరస్, బ్యాక్టీరియాలను తట్టుకోవడానికి మన శరీరం 'యాంటీబాడీస్'ను తయారుచేస్తుంది. కానీ సర్వైకల్ క్యాన్సర్‌ను తెచ్చిపెట్టే హెచ్‌పీవీ వైరస్ విషయంలో మాత్రం మహిళల దేహం ఎలాంటి యాంటీబాడీస్‌లనూ తయారు చేయదు. అందువల్ల ఒకసారి హెచ్‌పీవీ వైరల్ ఇన్ఫెక్షన్ వస్తే అది జీవితాంతం శరీరంలో ఉండిపోయి సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీయవచ్చు. అదే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను మహిళకు తొమ్మిది నుంచి 26 ఏళ్ల వయసు లోగా ఇప్పిస్తే యాంటీబాడీస్‌ను తయారుచేసి, సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పిస్తుంది.

కేవలం బాలికలు, యువతులకే కాకుండా బాలురు, యువకులకూ కూడా ఇచ్చే అత్యాధునిక వ్యాక్సిన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఎందుకంటే పురుషులు క్యారియర్లుగా మారి దీన్ని మహిళలకు వ్యాప్తి చేస్తారు కాబట్టి మగవాళ్లకూ ఇచ్చే వ్యాక్సిన్లు రూపొందాయి. ఇవి ఒకటి రెండు రకాలకే గాక... మరిన్ని రకాల సర్వైకల్ క్యాన్సర్లను నివారిస్తాయి. 9 నుంచి 14 ఏళ్ల మగపిల్లల్లో రెండు డోసులూ, పద్నాలుగేళ్లు దాటిన వారికి 0, 2, 6 నెలల్లో వరసగా ఇవ్వాలి.



డా॥ కావ్య ప్రియ వజ్రాల
లీడ్ కన్సల్టెంట్
గైనకాలజిస్ట్ &
రిస్క్ ఆబ్‌స్టెట్రీషియన్,
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్

ప్రధాన రకాలు...

సర్వైకల్ క్యాన్సర్లలో రెండు ప్రధాన రకాలుంటాయి. మొదటిది తరచుగా కనిపించే 'స్క్వామస్ సెల్ కార్సినోమా' అనే రకం. రెండోది 'అడెనోకార్సినోమా' తరహాకు చెందినదైతే, ఆపరేషన్ ద్వారా తొలగించగల దశలో ఉంటే, సర్జరీ ద్వారా ఆ భాగాన్ని తొలగించవచ్చు. ఇది కాస్త అరుదు.

రిస్క్ ఫాక్టర్లు...

హెచ్‌పీవీ వైరస్ సోకడం అనేది సర్వైకల్ క్యాన్సర్‌కు ఓ ప్రధాన రిస్క్ ఫ్యాక్టర్. చాలామందిలో ఈ హెచ్‌పీవీ వైరస్ దానంతట అదే నశించిపోతుంది. అలా ఒకవేళ నశించకపోతే అది కొంతకాలానికి అది క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదముంది. అలాగే పొగ తాగడం, ఎయిడ్స్, ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం గర్భనిరోధక మాత్రలు వాడటం వంటివి కూడా సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీసే రిస్క్‌ఫ్యాక్టర్లలో కొన్ని.

నివారణ...

సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణలో పాప్‌స్మియర్ మంచి పరీక్ష. ఇరవయొక్క ఏళ్లు నిండిన మహిళలు మొదలుకొని, లైంగిక జీవితం ప్రారంభమై మూడేళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా క్రమంతప్పకుండా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. సర్వైకల్ క్యాన్సర్ విషయంలో మరో వెసులుబాటు ఏమిటంటే ఇది రావడానికి దాదాపు పదేళ్లు ముందుగానే దీన్ని కనుగొనడానికి అవసరమైనంత 'ప్రీ-క్యాన్సరస్ దశ' దీనికి ఉంది

కారణాలు

సర్విక్స్ మహిళ జీవితంలో ఎన్నో దశల్లో అనేక మార్పులకు లోనవుతూ ఉంటుంది. అందువల్ల అక్కడ అతి వేగంగా జరిగే కణ విభజన కారణంగా క్యాన్సర్‌కు గురయ్యే అవకాశాలెక్కువ. సర్వైకల్ క్యాన్సర్‌కు ముఖ్యమైన కారణాల్లో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ప్రధానం. ఈ వైరస్ లైంగికంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దాదాపు సగం జనాభాలో వాళ్ల జీవితంలో ఏదో ఒక సమయంలో హెచ్‌పీవీ వైరస్‌ను కలిగి ఉంటారు. అయితే అందరిలోనూ ఇది సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీయదు. దురదృష్టవశాత్తూ కేవలం కొంతమందిలోనే క్యాన్సర్‌ను కలగజేస్తుంది. మల్టిపుల్ పార్ట్‌నర్స్‌తో సెక్స్‌లో పాల్గొనేవారికీ హెచ్‌పీవీ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ.



చికిత్స ప్రక్రియలు...

ఈ క్యాన్సర్ల మొదటి, రెండో దశల్లో శస్త్రచికిత్స అయినా, రేడియోథెరపీ, కీమోథెరపీ... ఈ మూడూ బాగానే పనిచేస్తాయి. అయితే ఈ అన్ని చికిత్సా ప్రక్రియలకు వాటివాటి ప్రయోజనాలూ, దుష్ప్రభావాలూ రెండూ ఉంటాయి. చికిత్సకు ముందు ఈ రెండు అంశాలనూ పరిగణనలోకి తీసుకొని చికిత్స ప్రక్రియను డాక్టర్లు నిర్ణయిస్తారు.

సర్జరీతో సాధారణ జీవితానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. సర్జరీ తర్వాత వారం లేదా పది రోజుల్లోనే సాధారణ జీవితం గడిపేలా బాధితులు కోలుకోగలరు. సర్జరీ విజయావకాశాలు 75% నుంచి 90% వరకు ఉంటాయి. పైగా చిన్నవయసులోనే దీని బారిన పడ్డవారికి డాక్టర్లు సాధారణంగా శస్త్రచికిత్సనే సూచిస్తుంటారు. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో ఉండటం అవసరం. ఇక సర్జరీతో వచ్చే దుష్ప్రభావాలు కూడా చాలా తక్కువే. ఇది ఎంతమాత్రమూ ప్రాణాంతకం కాదు. ఇక కొద్దిమందిలో సర్జరీ తర్వాత కాంప్లికేషన్లు వస్తే / సర్జరీ అంటే భయపడేవారికి డాక్టర్లు 'రాడికల్ రేడియోథెరపీ' అనే చికిత్స చేస్తారు.

విభిన్నం



సమష్టి గుబ్బి



● బెంగళూరు కబ్బన్ పార్క్‌లో 'శాన్‌స్క్రీట్ వీకెండ్' కార్యక్రమంలో సభ్యులు

బెంగళూరులోని కబ్బన్ పార్క్‌లో ఆదివారం ఉదయం వెళితే ఎవరో ఒకరు ఎదురుపడి 'తవనామధేయం కిమ్?' అంటారు. 'మీ పేరేమిటి?' అని ఆ మాటకు అర్థం. 'మెలనెన బహు సంతోషహ' అంటారు. 'మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉంది'. 'అహం సమష్టి' అని పరిచయం చేసుకుంటారు. 'నా పేరు సమష్టి' అని దానికి అర్థం. కన్నడ, తెలుగు, తమిళం మాతృభాషగా కలిగిన బెంగళూరు వాసులు ఆ భాషను లేదా ఇంగ్లిష్‌ను మాట్లాడి మాట్లాడి విసుగు చెంది ఉంటే నాలుక గుండా వెలువడే సంస్కృతం మాటలు కొత్త ఉత్తేజాన్ని, సరదాని కలిగిస్తాయి. అందుకే రెండు నెలల క్రితం కబ్బన్ పార్క్‌లో మొదలైన 'శాన్‌స్క్రీట్ వీకెండ్' కార్యక్రమం పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు ముంబై, పూణె నగరాలకు వ్యాపించే దాకా వెళ్లింది.

ఆదివారం సంస్కృతం

**బెంగళూరు కబ్బన్ పార్క్‌లో ఆదివారం ఉదయం వెళితే
వేరే లోకానికి వచ్చామా అనిపిస్తుంది.
ఎందుకంటే అక్కడ చేరిన ఒక బృందం
మాట్లాడినా ఆడినా చర్చించినా వాడే భాష సంస్కృతం.
అంతరించిపోయే దశలో ఉన్న సంస్కృతం
ఆ పచ్చని చెట్ల మధ్య చివురులేస్తోంది.
సమష్టి గుబ్బి అనే అమ్మాయి ఉచితంగా సంస్కృతం నేర్పడమే కారణం.
'శాన్‌స్క్రీట్ వీకెండ్' అనే ఈ కార్యక్రమం అన్ని చోట్లకూ విస్తరించేలా ఉంది.**

'స్థాయి' సంస్థ చొరవతో

బెంగళూరులోని 'స్థాయి' సంస్థ సంస్కృత భాష పునరుద్ధరణకు అంకితమైంది. ఈ తరానికి సంస్కృతం పరిచయం చేయడం కోసం సంస్కృతంలో పాటలు, షార్ట్‌ఫిల్మ్‌లు, పాఠాలు తయారుచేసి యూట్యూబ్‌లో పెడుతోంది. దానిని స్థాపించిన సమష్టి గుబ్బి నేరుగా కూడా సంస్కృతాన్ని పరిచయం చేద్దామని నిశ్చయించుకుని కబ్బన్ పార్క్‌లో ఆదివారం పూట సంస్కృతం నేర్పే ఇన్‌ఫార్మల్ క్లాసులను మొదలెట్టింది. మొదటివారం కేవలం ఆమె స్నేహితులు మాత్రమే వచ్చారు. కాని రెండోవారానికి నోటిమాటతో కొత్తవాళ్ల రాక మొదలైంది. ఇప్పుడు ప్రతి వారాంతం చాలామంది నాగా పెట్టకుండా వచ్చి సంస్కృతం నేర్చుకుంటున్నారు. 'అది పాఠ్యాంశంగా కాకుండా రోజువారీ కార్యకలాపాలకు ఉపయోగపడేలా నేర్పడం వల్ల అందరికీ ఆసక్తి ఏర్పడుతోంది' అంటోంది సమష్టి.

సామాన్యుల భాషే

'సంస్కృతం దేవతల భాష అంటారు. అది సామాన్యుల భాషే. ఇతర దేశాల వాళ్లు వాళ్ల ప్రాచీన భాషలు మాట్లాడితే మనం ఆశ్చర్యపోము. కాని భారతీయులు సంస్కృతం మాట్లాడటం ఎందుకు ఆశ్చర్యకరం. సంస్కృతంలో సినిమాలు, నాటకాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు చేయొచ్చు' అంటుంది సమష్టి. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎం.ఏ సంస్కృత గ్రామర్ చదువుకున్న సమష్టి 'శాన్‌స్క్రిట్ స్వారో' పేరుతో ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి సంస్కృత మాటలు నేర్పసాగింది. అది కబ్బన్ పార్క్‌లు ముఖాముఖి కార్యక్రమంగా మారింది. సంస్కృత భాష వ్యాప్తి కోసం సమష్టి తన బృందాన్ని తీసుకుని బైక్‌మీద కొత్త ప్రాంతాలకు వెళ్లి సంస్కృతాన్ని ప్రచారం చేస్తోంది. దీనికి 'శాన్‌స్క్రిట్ రైడ్' అని పేరు పెట్టింది. 'శివమొగ్గ జిల్లాలోని మట్టూరు గ్రామంలో ప్రతి ఒక్కరూ సంస్కృతంలో మాట్లాడతారు. అందుకే అది సంస్కృత గ్రామంగా వాసికెక్కింది. నా బృందాన్ని ఆ ఊరికి తీసుకెళ్లాను' అని చెప్పింది సమష్టి. 'మార్కుల కోసం స్కూళ్లలో కాలేజీల్లో చాలా మంది సంస్కృతం చదివారు. కాని నిజజీవితంలో ఉపయోగించరు. అలాంటి వాళ్లంతా మా సంస్కృత ఆదివారాల గురించి విని సంస్కృతాన్ని తలుచుకుంటున్నారు. అది సంతోషం' అంది సమష్టి. ఆమె తన బృందం చేత హిందీ పాటలను సంస్కృతంలో డబ్ చేయించి పాడిస్తుంది. 'మై హూ డాన్' పాటను 'అహం డాన్ అస్మి' అని పాడుతుంటే కేరింతలు వినిపిస్తాయి. ఏ భాష అయినా ఇంత సరదాగా, సజీవంగా ఉంటే ఎందుకు అంతరిస్తుంది?

ఆషాఢం ఆరంభం



నేటినుంచి ఆషాఢమాసం ఆరంభం అవుతోంది. పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెలకే ఆషాఢమాసం అని పేరు. ఇది సంవత్సరంలో నాలుగవ మాసం. దీనిని శూన్యమాసమని కూడా అంటారు. ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి దక్షిణాయనం మొదలయేది ఈ మాసంలోనే. పేరుకు శూన్యమాసమే అయినా పూరీ జగన్నాథ రథయాత్ర నుంచి తొలి ఏకాదశి, గురు పూర్ణిమ, గ్రామ దేవతలకు సమర్పించే బోనాలు ఈ మాసంలోనే. ఆషాఢ మాసంలో చేసే స్నానం, దానం, జపం, పారాయణలు, విశేష ఫలితాన్నిస్తాయి.

ఆషాఢంలో చేసే సముద్ర, నదీ స్నానాలు ఎంతో ముక్తిదాయకాలు. పాదరక్షలు, గొడుగు, ఉప్పు దానం చేయడం శుభకరం.



పొట్టు రాకూడదా? పొట్టు తియ్యద్దు మరి!



- పొట్టు తీయని ధాన్యాల (హోల్ గ్రేయిన్స్)లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నది తెలిసిందే.
- ఈ పొట్టు కారణంగానే అవి చాలా నెమ్మదిగా జీర్ణమవుతుంటాయి. అందుకే వాటిల్లోంచి వచ్చే కార్బోహైడ్రేట్లు రక్తంలో నెమ్మదిగా కలుస్తుంటాయి.
- ఫలితంగా ఒంట్లోకి విడుదలయ్యే చక్కెర మోతాదులూ ఆలస్యమవుతాయి.
- పొట్టుతీయని వరి విషయంలో ముడిబియ్యం మాదిరిగానే పొట్టు తీయని ఓట్స్, గోధుమ, బార్లీ వంటి వాటిని అలాగే తీసుకోవడం వల్ల పొట్టుతీసిన వాటితో పోలిస్తే తక్కువగా బరువు పెరుగుతారని, అందువల్ల ఇన్సులిన్ విడుదల యంత్రాంగం కూడా నియంత్రితంగా పనిచేస్తూ పూర్తి స్థాయి ఆరోగ్యకరంగా ఉంటుందంటున్నారు పరిశోధకులు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ప్రచురితమైంది.
- ఇలా తినడం వల్ల ఊబకాయం తగ్గడంతో పాటు స్థూలకాయంతో వచ్చే అనేక అనర్థాలనూ తగ్గించుకోవచ్చన్నది పరిశోధకుల మాట.

బ్యూటిప్స్



- రెండు టేబుల్ స్పూన్ల పాల మీగడలో ఒక టీస్పూను ఆల్మండ్ ఆయిల్, నాలుగైదు చుక్కల రోజ్ ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇది పొడిబారి, గరుకుగా ఉన్న చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.
- చర్మం తెల్లగా మారాలంటే... చిన్న చందనం ముక్కను పాలతో పేస్టు చేసి అందులో చిటికెడు స్వచ్ఛమైన పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లయ్ చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా వారానికి మూడు సార్లు ప్యాక్ వేస్తుంటే ఫలితం ఉంటుంది.

జుట్టుకు పోషకాలతో పట్టు

ఇటీవలి కాలంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య జుట్టు రాలడం. దీని వెనుక వంశపారంపర్య కారణాలు ఉంటే దానిని నివారించడం కష్టం. అయితే బట్టతలను కొంతకాలం పాటు వాయిదా వేయచ్చు. కానీ ప్రతిసారీ ఈ సమస్య జన్యుపరమైన కారణాల వల్ల మాత్రం రాదని తెలుసుకోవాలి. జుట్టు రాలడం లేదా బట్టతల రావడం అనేది మస్కులర్ డిస్ట్రోఫీ లాంటి జన్యుపరమైన సమస్య కాదని సైన్స్ చెబుతోంది. దీనికి ప్రధాన కారణం శరీరంలో కొన్ని అవసరమైన మూలకాలు లేకపోవడమే. కానీ ఆ మూలకాల లోపం వంశపారంపర్యంగా ఉంటుంది. వారసత్వం అనేది ఒక తరం నుంచి మరొక తరానికి బదిలీ అయిన జన్యువులది మాత్రమే కాదు. బదులుగా కొన్నిసార్లు పోషకాల లోపం కూడా ఒక తరం నుంచి మరొక తరానికి బదిలీ అవుతుంది.

బయోటిన్

బయోటిన్ అనేది జుట్టుకు అవసరమైన మూలకం. ఇది లేకపోవడం వల్ల జుట్టు పలుచబడుతుంది. దీని లోపం వల్ల గోళ్లు కూడా విరిగిపోతాయి. కండరాల అలసట, బలహీనత, మైకం, కాళ్ళలో తిమ్మిరి వంటివి బయోటిన్ లోపం లక్షణాలు. ఇది శరీరానికి అవసరమైన మూలకం. కానీ జుట్టు, గోళ్లకు ఇది చాలా ముఖ్యమైనది.

రాగి:సాధారణంగా శరీరంలో రాగి లోపం ఉండదు. కానీ ఏదైనా కారణం వల్ల అది లోపిస్తే జుట్టు, గోళ్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. సాధారణంగా భారతదేశం వంటి దేశంలో శరీరంలో కాపర్ సమస్య ఉండదు. కాని ఇది లోపిస్తే మోకాలు, కీళ్లలో భరించలేని నొప్పి ఉంటుంది.

కొల్లాజెన్: కొల్లాజెన్ అనేది జుట్టు మూలాలను బలపరిచే మూలకం. ఇది జుట్టుని మందం చేస్తుంది. దీని లోపం వల్ల జుట్టు బలహీనపడి ఎక్కువ ఊడిపోతుంది.

విటమిన్ బి6

జుట్టుకి విటమిన్ బి కాంప్లెక్స్ చాలా ముఖ్యం. దీని లోపం తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. విటమిన్ బి 6 మన జుట్టు ఆరోగ్యానికి సంబంధించినది. ఈ విటమిన్ లోపం ఉన్నట్లయితే జుట్టు బలహీనంగా మారుతుంది. ఎక్కువగా ఊడిపోయి బట్టతల వస్తుంది.

జింక్

జింక్ లోపం ప్రధాన లక్షణం జుట్టు వేగంగా రాలడం. మీ జుట్టు అకస్మాత్తుగా రాలడం ప్రారంభించిందని మీకు అనిపిస్తే అది జింక్ లోపం వల్ల కావచ్చునని భావించి జింక్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని సరిచేయవచ్చు.

అందువల్ల ఒకసారి మంచి ట్రికాలజిస్టును కలిసి అవసరమైన పరీక్షలు చేయించుకుని ఏ కారణం వల్ల జుట్టు ఊడిపోతోందో తెలుసుకుని ఆ విటమిన్ లోపాన్ని పూరించడం ద్వారా జుట్టు రాలకుండా నివారించుకోవచ్చు.



కండరాల నొప్పులా?

మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో పొటాషియం కూడా ఒకటి. ఇది మినరల్స్ జాబితాకు చెందుతుంది. పొటాషియం మన శరీరంలో బీపీని నియంత్రిస్తుంది. స్ట్రోక్స్ రాకుండా చూస్తుంది. కండరాల నొప్పులు, కండరాలు పట్టుకుపోయినట్లు అనిపించడం వంటి సమస్యలను పొటాషియం తగ్గిస్తుంది. అలాగే గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. అందువల్ల పొటాషియం ఉండే ఆహారాలను మనం రోజూ తీసుకోవాలి. మనం తినే ఆహారాల నుంచే మనకు పొటాషియం లభిస్తుంది. సప్లిమెంట్లను వాడాల్సిన పనిలేదు. ఈ క్రమంలోనే పలు ఆహారాలను తీసుకోవడం వల్ల పొటాషియం లోపం రాకుండా చూసుకోవచ్చు.



ఎందులో లభిస్తుంది?

కోడిగుడ్లు, టమాటాలు, చిలగడ దుంపలు, విత్తనాలు, నట్స్, అరటి పండ్లు, యాప్రికాట్స్, చేపలు, తృణ ధాన్యాలు, పెరుగు, పాలు, మాంసం, తర్బూజా, క్యారెట్, నారింజ, కివీ, కొబ్బరినీళ్లు, బీట్‌రూట్ వంటి ఆహారాల్లో పొటాషియం విరివిగా లభిస్తుంది

లైఫ్@360

ఇవి తిందాం.. ఉత్సాహంగా ఉందాం!

కొంతమంది ఎప్పుడూ ఉసూరుమంటూ ఉంటారు. ఇంకొందరు ఎప్పుడు చూసినా ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్లే ఉంటారు. అలాంటి వారిని చూస్తే మనకు కూడా ఉత్సాహం కలుగుతుంది. ఇంతకీ వీరిలో ఈ ఉత్సాహానికి వారు తీసుకునే ఆహారమే కారణం అని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ ఆహారమేమిటో తెలుసుకుందాం. మనమూ తిందాం... ఉత్సాహంగా ఉందాం...



నాకు అది ఇష్టం, ఇది ఇష్టం లేదు అని అనకుండా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని రకాల ఆహార పదార్థాలను తరచు తింటుండటం వల్ల ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండదంతోపాటు మెరుపులీనే చర్మం, మంచి ఆరోగ్యం మన సొంతం అవుతాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఇంతకూ అవేమిటో చూద్దామా?



టొమాటో... దీనిలోని లైకోపిన్ కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. గుండె, రక్తనాళాలకి సంబంధించిన అనారోగ్యాన్ని కూడా నిరోధిస్తుంది. మన చర్మానికి ఎండ తాలూకు ప్రభావాలనుండి రక్షించడంలో మిగతా పోషకాలతో పాటు టమాటోల పాత్ర చెప్పుకోదగినదే.



నట్స్: ముఖ్యంగా వాల్‌నట్స్ లో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్, ప్లాంట్ స్టెరోల్స్ సమృద్ధిగా ఉంటాయి. కొలెస్టరాల్ లెవల్ తగ్గించడంలో వీటి పాత్ర అమోఘం. వాల్నట్స్‌లో పీచుపదార్థం అధికం. మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, విటమిన్-ఇ, ఉండి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్స్‌ని అందిస్తాయి. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ఆస్టియోపొరోసిస్ రాకుండా ఆపుతుంది. గుండె ఆరోగ్యాన్ని, చర్మానికి ఎండనుండి కలిగే హానినుండి కాపాడుతుంది. ఆల్మండ్స్ చర్మకాంతికి తోడ్పడతాయి.



బెర్రీస్... అన్ని రకాల బెర్రీస్... ముఖ్యంగా నేరేడుపండ్లు: వృద్ధాప్యం త్వరగా రాకుండా చేస్తాయి. వృద్ధులవుతున్న కొద్దీ మెదడు నెమ్మదించే అవకాశం ఉంది. అలాంటి అనారోగ్యల నుంచి బెర్రీస్ కాపాడుతాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, క్యాన్సర్ నిరోధకాలు ఉంటాయి.






యోగర్ట్ లేదా పెరుగు: ప్రొటీన్, కాల్షియం, విటమిన్-బి లను అందిస్తుంది. ఇవన్నీ కలిసి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్ కలగకుండా పోరాడతాయి. యోగర్ట్ మన శరీర ఆరోగ్యానికి, జీర్ణ వ్యవస్థకు, నాడీవ్యవస్థకు మేలుచేస్తుంది. క్యాన్సర్, ఎలర్జీలు, అధిక రక్తపోటు, హై-కొలెస్టరాల్ బారిన పడకుండా కాపాడుతుంది.



బీన్స్.... ప్రొటీన్స్, పీచుపదార్థం, విటమిన్లు, మినరల్స్, ఫైటో న్యూట్రియెంట్స్. ఇవన్నీ బీన్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. అలాగే కొవ్వుకు సంబంధించిన చెడు లక్షణాలు ఉండవు. బీన్స్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉండేటట్లు చూస్తూనే సురక్షితమైన, నిలకడ అయిన నెమ్మదిగా ఖర్చయ్యే శక్తిని అందిస్తుంది. కొలెస్టరాల్ లెవెల్స్‌ని కొంతమేరకు తగ్గిస్తాయి. బీన్స్‌తో చేసిన కూరలు తిన్నప్పుడు కడుపు నిండినట్లు ఉంటోంది గాని అధిక క్యాలరీలు లేకపోవడం వలన బరువు పెరిగే సమస్యే ఉండదు.



గ్రీన్ టీ... ఇది ఓ సూపర్ డ్రింక్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చర్మాన్ని అంత త్వరగా ముడతలు పడనివ్వదు. కళ్ళకు మెరుపు అందిస్తుంది. కేటరాక్ట్ ముదరటాన్నీ నెమ్మదింపచేస్తుంది.

ఆకుకూరలు... ఆకుకూరలు చాలా రకాల క్యాన్సర్‌ల నుండి కాపాడుతాయి. వీటిలో విటమిన్ బి, సి, ఇ, ఫోలేట్, పొటాషియం, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. కాల్షియంని శరీరం ఇముడ్చుకోవటానికి తోడ్పతాయి. కేటరాక్ట్‌ను నిరోధించడంలో పాలకూర తోడ్పడుతుంది.

అందుకే తిందాం... ఉత్సాహంగా ఉందాం.

సినిమా

మాయా బజార్ స్ఫూర్తితో 'కల్కి' తీశాను - నాగ్ అశ్విన్



''కల్కి 2898 ఏడీ'ని సూపర్ హిట్ చేసినందుకు మా టీమ్, వైజయంతీ మూవీస్ తరపున ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ విజయం మొత్తం ఇండస్ట్రీదిగా భావిస్తున్నాను. ఎన్నో ప్రొడక్షన్స్, యాక్టర్స్, రైటర్స్, అప్ కమింగ్ డైరెక్టర్స్‌కి ఒక డోర్ ఓపెన్ అయ్యింది. ఇలాంటి సైన్స్ ఫిక్షన్ కథలు రాసుకునే వారికి 'కల్కి' రిఫరెన్స్ పాయింట్‌లా ఉంటుంది'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా కోసం రూపొందించిన సెట్స్‌లో శుక్రవారం డైరెక్టర్ నాగ్ అశ్విన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● తెలుగు సినిమా అనగానే చాలామందికి 'మాయా బజార్' గుర్తొస్తుంది. అది ఓ రకంగా మహాభారతం ఆధారంగా రూపొందిందే. 'మాయా బజార్' మూవీ స్ఫూర్తితోనే 'కల్కి 2898 ఏడీ' తీశాను. ఈ కథను ముందుగా చిరంజీవిగారికి చెప్పాననడంలో నిజం లేదు. ప్రభాస్‌గారు కథని నమ్మి చాలా సపోర్ట్ చేశారు. ముందు ఒకే భాగంగా తీయాలనుకున్నాం. కొన్ని షెడ్యూల్స్ తర్వాత ఇంత పెద్ద కథని ఒక భాగంలో చెప్పడం సవాల్‌గా అనిపించింది. అందుకే రెండు భాగాలుగా చూపించాలనుకున్నాను. ● 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్ చేసిన భైరవ పాత్ర సీరియస్‌గా కాకుండా సరదాగా ఉండాలనే ఉద్దేశంతోనే అలా క్రియేట్ చేశాను. మొదటి భాగంలో ప్రభాస్ పాత్ర నిడివి తక్కువగా ఉందంటున్నారు. రెండో భాగంలో ఆయన పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. ఈ మూవీలో ప్రభాస్, అమితాబ్, కమల్, దీపిక వంటి స్టార్స్‌ని వ్యాపార కోణంలో ఆలోచించి తీసుకోలేదు. ఆయా పాత్రలకు వారు న్యాయం చేయగలరనే ఉద్దేశంతోనే తీసుకున్నా. ఒకవేళ కథలో బలం లేకపోతే ఆ నటుల ఎంపిక మాకు నెగెటివ్ అయ్యేది. కానీ వారి క్యారెక్టర్స్‌కి అనూహ్య స్పందన వస్తోంది. కమల్ సార్ చేసిన యాస్కిన్ పాత్రను పార్ట్ 2లోనే ఎక్కువ రివీల్ చేస్తాం. ● వైజయంతీ మూవీస్ 50 ఏళ్ల జర్నీలోనే కాదు... తెలుగు సినిమా హిస్టరీలో ఉన్న అత్యధిక భారీ బడ్జెట్ చిత్రాల్లో 'కల్కి 2898 ఏడీ' ఒకటి. ఈ సినిమా గొప్ప విజయం సాధించి మా పెట్టుబడి పూర్తిగా రావడంతో చాలా హ్యాపీగా ఉంది. రామ్‌గోపాల్ వర్మ, రాజమౌళిగార్లు ఈ మూవీలో కనిపించడం ప్రేక్షకులకు సర్‌ప్రైజ్. విజయ్ దేవరకొండ, మాళవికా నాయర్‌లతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' తీశాను. నా ఫస్ట్ మూవీ నటులు కాబట్టి వారు ప్రత్యేకం. నాకు లక్కీ ఛార్మ్. అందుకే వాళ్లని నా ప్రతి చిత్రంలో తీసుకుంటాను. నానీ, నవీన్ పొలిశెట్టిలను రెండో భాగంలో ఎక్కడ వీలుంటే అక్కడ పెట్టేస్తా (నవ్వుతూ).

● 'కల్కి...'లో కృష్ణుడి పాత్రలో మహేశ్‌బాబు నటించి ఉంటే బాగుంటుందని సోషల్ మీడియాలో ట్రెండ్ నడుస్తోంది. అయితే ఈ మూవీలో ఆ చాన్స్ లేదు. కానీ ఆయన ఏ సినిమాలో అయినా కృష్ణుడిగా నటిస్తే చాలా బాగుంటుంది. 'కల్కి' రెండో భాగానికి సంబంధించి 20 రోజులు షూటింగ్ జరిపాం. రెండో భాగంలో కల్కి పాత్రలో ఏ హీరో కనిపిస్తార న్నది సస్పెన్స్. రెండో భాగాన్ని ఎప్పుడు రిలీజ్ చేస్తామన్నది ఇప్పుడే చెప్పలేం.

కథలెన్నో వినరా...



● 'టుక్ టుక్' పోస్టర్

''నజభజ జ..జ..ర.. కథలెన్నో వినరా... మన కథ విననిది రా...' అంటూ సాగే 'వరల్డ్ టూర్' పాట 'టుక్ టుక్' సినిమాలోనిది. సుప్రీత్ సి. కృష్ణ సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్ర సంగీతదర్శకుడు సంతు ఓంకార్ పాడారు. హర్ష రోహన్, కార్తి కేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు సుప్రీత్ సి. కృష్ణ దర్శకుడు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి. కృష్ణ నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

డబ్బు ఎవరిది?



● రష్మికా మందన్నా

ఇక్కడ రష్మికా మందన్నా చేతిలో ఉన్న పెద్ద సూట్‌కేసును చూశారుగా! ఈ సూట్‌కేసు నిండా డబ్బు కట్టలే. ఈ సూట్‌కేసును రాత్రి వేళ తవ్వి బయటకు తీశారు రష్మిక. మరి... ఈ డబ్బు ఎవరిది? రష్మికా మందన్నా ఇంత రహస్యంగా డబ్బును ఎందుకు తవ్వి తీశారు? అనే విషయాలు 'కుబేర' సినిమాలో తెలుస్తాయి. నాగార్జున, ధనుష్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా, జిమ్ సర్ఫ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సోషల్ డ్రామాను సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. శుక్రవారం రష్మికా మందన్నా ఫస్ట్ లుక్ వీడియోను విడుదల చేశారు మేకర్స్.

అడవిని ఏలేది మనమే!



● ఆలియా భట్

'వైఆర్ఎఫ్' (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న మరో హిందీ చిత్రం 'ఆల్ఫా'. ఆలియా భట్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాలో శార్వరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. 'ది రైల్వేమెన్' ఫేమ్ శివ్ రవైల్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఆల్ఫా' సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ''నిశితంగా గమనిస్తే ప్రతి నగరంలోనూ ఓ అడవి ఉంటుంది. ఆ అడవిని ఏలేది మనమే'' అంటూ ఆలియా భట్ చెప్పే డైలాగ్ ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ టీజర్‌లో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

గుమ్మడికాయ కొట్టారు



● రామ్, కావ్యా థాపర్

'డబుల్ ఇస్మార్ట్' సినిమాకు గుమ్మడికాయ కొట్టారు హీరో రామ్. 2019లో హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రధారులు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా జరుగుతున్నాయని చిత్రయూనిట్ ప్రకటించింది. సో.. షూటింగ్ పూర్తయిన సందర్భంగా 'డబుల్ ఇస్మార్ట్' యూనిట్ గుమ్మడికాయ కొట్టింది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.

భయంకరమైన హెచ్చరిక

'నువ్వు ఓ మంచి ఉదాహరణగా ఉండలేనప్పుడు ఓ భయంకరమైన హెచ్చరికగా ఉండు' అంటూ ఫుల్ మాస్ మోడ్‌లో చెబుతున్నారు కల్యాణ్ రామ్. ఆయన హీరోగా ప్రదీప్ చౌదరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం (జూలై 5) కల్యాణ్‌రామ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌పై పైన పేర్కొన్న డైలాగ్ ఉంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి, సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



● కల్యాణ్ రామ్

సీక్వెల్ కాదు... ప్రీక్వెల్

కల్యాణ్ రామ్ నటించిన చిత్రం 'బింబిసార' (2022). ఈ హిట్ చిత్రానికి ప్రీక్వెల్ రూపొందనుంది. ''బింబిసార కన్నా యుగాల ముందు త్రిగర్తలను ఏలిన లెజెండ్‌ని చూడడానికి సిద్ధంగా ఉండండి'' అంటూ శుక్రవారం ప్రీక్వెల్‌ని ప్రకటించారు. 'బింబిసార' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహించగా, ప్రీక్వెల్‌ని ఎడిటర్-దర్శకుడు అనిల్ పాదూరి తెరకెక్కించనున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో ఆరంభం కానుంది.

పవర్‌ఫుల్ రోల్



● సాయికుమార్

నటుడు అలీ సోదరుని కుమారుడు సదన్ హీరోగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకుడు. ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో సాయికుమార్, సునీల్ రావినూతల కీలక పాత్రధారులు. పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ చిత్రంలో సాయి కుమార్ పెదకాపు అనే పవర్‌ఫుల్ పాత్ర చేశారు. ఈ పాత్ర లుక్‌ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా మునుగోడు ప్రాంతానికి చెందిన లింగయ్య 'ప్రణయ గోదారి' అనే ఓ మంచి సినిమా నిర్మించినందుకు అభినందనలు. ఈ సినిమా మంచి విజయం సాధించి, భవిష్యత్‌లో లింగయ్య ఇలాంటి సినిమాలు మరిన్ని నిర్మించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో అన్ని వర్గాల వారిని అలరించే అంశాలున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు పీఎల్ విఘ్నేష్, పారమళ్ల లింగయ్య.

జీవితం గుణపాఠాలు చెబుతుంది



● 'సారంగదరియా' పోస్టర్

నటుడు రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వం వహించారు. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ను హీరో నిఖిల్ విడుదల చేశారు. 'కులం అంటే రక్తం కాదు పుట్టుకతో రావడానికి... మనం చేసే పనే కులం', 'ఇక్కడ చెప్పిన పాఠాలకే పరీక్షలు పెడతాం... కానీ జీవితం పరీక్షలు పెట్టి గుణపాఠాలు చెబుతుంది' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''మధ్య తరగతి నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలతో సాగే చిత్రం 'సారంగదరియా'. ఈ చిత్రంలో గొప్ప ఉపాధ్యాయుడి పాత్రలో రాజా రవీంద్ర నటన అందర్నీ కదిలించేలా ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎబెనెజర్ పాల్, కెమెరా: సిద్ధార్థ స్వయంభు.

సోడు... సోడు...



● సాయితేజ, పావని

సాయి తేజ కల్వకోట, పావని కరణం జంటగా నటించిన చిత్రం 'పైలంపిలగా'. తెలంగాణ నేపథ్యంలో వినోద ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొద్దుల, ఎస్.కె. శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమాలోని 'సోడు సోడు నొక్కమే నీ సోకు...' అంటూ సాగే పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల విడుదల చేసి, మాట్లాడుతూ – ''మంచి సాహిత్యానికి మంచి ట్యూన్, మంచి ట్యూన్‌కి మంచి సాహిత్యం తోడైతే ఆ పాటలు ఎవర్ గ్రీన్‌గా నిలిచిపోతాయి. అలా నిలిచిపోయే పాటల్లో ఈ 'సోడు సోడు...' పాట ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు శేఖర్ కమ్ముల. యశ్వంత్ నాగ్ స్వరపరచిన 'సోడు... సోడు...' పాటను రామ్ మిరియాల పాడారు.

సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
53	22
79,997	24,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు బుధవారం ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,354	△ 165
డోజోన్స్	39,312	△ 4
ఎఫ్‌టీఎస్ఈ 100	8,203	▽ 37
డాక్స్	18,475	△ 25
షాంఘై	2,959	▽ 8
నికాయ్	40,912	▽ 1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	71,300
బంగారం (22 క్యారెట్)	67,900
వెండి (కిలో)	97,700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.44	107.80
€	యూరో	ఒకటి	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.50	64.16
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.85	23.63
¥	చైనా యువాన్	ఒకటి	10.36	12.44

తొలి సీఎన్‌జీ బైక్ వచ్చేసింది!





బజాజ్ నుంచి ఫ్రీడమ్ 125

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో సీఎన్‌జీ బైక్ 'ఫ్రీడమ్ 125' ఆవిష్కరించింది. ప్రపంచంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ఆధారంగా నడిచే ద్విచక్ర వాహనం ఇదేనని కంపెనీ వెల్లడించింది. నిర్వహణ వ్యయం 50 శాతం తగ్గుతుందని తెలిపింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.95,000 నుంచి ప్రారంభం. 2 లీటర్ల సామర్థ్యంగల పెట్రోల్ ట్యాంక్ సైతం ఉంది. సీఎన్‌జీ ట్యాంక్ సామర్థ్యం 2 కేజీలు. సీఎన్‌జీ అయితే 200 కిలోమీటర్లు, పెట్రోల్‌తో 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. గరిష్ట వేగం గంటకు సీఎన్‌జీ 90.5, పెట్రోల్ 93.4 కిలోమీటర్లు. మూడు వేరియంట్లలో లభిస్తుంది. 9.5 పీఎస్ పవర్‌తో 4 స్ట్రోక్ ఎయిర్ కూల్డ్ ఇంజిన్, మోనో లింక్ టైప్ సస్పెన్షన్, బ్లూటూత్ కనెక్టివిటీతో డిజిటల్ స్పీడోమీటర్, ప్రొటెక్టివ్ ట్రెల్లిస్ ఫ్రేమ్, పీఈఎస్‌వో సర్టిఫైడ్ సీఎన్‌జీ సిలిండర్, ఫోర్క్ స్లీవ్స్ ప్రొటెక్టర్ పొందుపరిచారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ కొత్త బైక్‌ను శుక్రవారం పుణేలో ఆవిష్కరించారు.

జీఎస్టీని సమీక్షించండి...

స్వచ్ఛ ఇంధనాలతో నడిచే వాహనాలపై జీఎస్టీ రేట్లను ప్రభుత్వం సమీక్షించాలని రాజీవ్ బజాజ్ సూచించారు. ఈవీలను ప్రోత్సహించడానికి అస్థిర రాయితీలను ప్రోత్సహించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సబ్సిడీలు నిలకడలేనివని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వాహన పరిశ్రమలో ఈవీల వినియోగంపై కొనసాగుతున్న ఒత్తిడి గందరగోళంగా ఉందన్నారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సాంకేతికతలను నిలకడలేని రాయితీల ద్వారా ఎలా ప్రమోట్ చేస్తారని ప్రశ్నించారు. ఇలాంటి వాటి నుంచి స్వేచ్ఛ కావాలని బజాజ్ అన్నారు.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

- రికార్డు స్థాయి నుంచి సెన్సెక్స్ వెనక్కి
- వారాంతాన లాభాల స్వీకరణ
- రిలయన్స్, ఎస్‌బీఐ దన్నుతో రికవరీ
- మిశ్రమంగా ముగిసిన స్టాక్ సూచీలు

ముంబై: వారాంతాపు రోజున ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 53 పాయింట్లు కోల్పోయి 80వేల దిగువన 79,997 వద్ద స్థిరపడింది. అయితే నిఫ్టీ 61 పాయింట్లు బలపడి 24,363 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 22 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై 24,314 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ప్రైవేట్ బ్యాంకుల షేర్లలో విక్రయాల ప్రభావంతో భారీగా పతనమైన సూచీలను రిలయన్స్ (2%) ఎస్‌బీఐ (2.50%) రాణించడంతో సూచీలు రికవరీ అయ్యాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్, విద్యుత్, ప్రభుత్వ బ్యాంకుల షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫైనాన్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యూఎస్ గణాంకాలు, బ్రిటన్ ఎన్నికల నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- జియో పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.55,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వెలువడంతో రిలయన్స్ ఇండస్ట్రియల్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 2% పెరిగి రూ.3180 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 3% ఎగసి రూ.3198 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.55,287 కోట్లు పెరిగి రూ.21.51 లక్షల కోట్ల చేరింది.

రూ.450 లక్షల కోట్లు

సూచీలు ఫ్లాట్‌గా ముగిసినా, ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరింది. శుక్రవారం ఒక్క రోజే రూ. 2.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ.450 లక్షల కోట్లకు చేరింది.





టెల్కోల ఆదాయం జూమ్..

మార్చి క్వార్టర్‌లో జియో రూ. 25,331 కోట్లు

న్యూఢిల్లీ: మార్చి త్రైమాసికంలో టెలికం సంస్థల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. రిలయన్స్ జియో ఏజీఆర్ (సవరించిన స్థూల ఆదాయం) అత్యధికంగా 10 శాతం వృద్ధి చెంది రూ. 22,985 కోట్ల నుంచి రూ. 25,331 కోట్లకు చేరింది. అటు భారతీ ఎయిర్‌టెల్‌ది 13.25 శాతం పెరిగి రూ. 15,500 కోట్ల నుంచి రూ. 20,952 కోట్లకు ఎగిసింది. వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ స్వల్పంగా 2.22% పెరిగి రూ. 7,211 కోట్ల నుంచి రూ. 7,371 కోట్లకు చేరింది. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ ఆదాయం 4.41 శాతం తగ్గి రూ. 1,992 కోట్లకు, ఎంటీఎన్ఎల్ ఆదాయం 14% క్షీణించి రూ. 157 కోట్లకు పరిమితమైంది. మొత్తం టెల్కోల ఏజీఆర్ 9% వృద్ధి చెంది రూ. 70,462 కోట్లకు చేరింది. టెల్కోలు కట్టాల్సిన స్పెక్ట్రం యూసేజీ చార్జీలు, లైసెన్సు ఫీజులను లెక్కించడానికి ప్రభుత్వం ఏజీఆర్‌నే పరిగణనలోకి తీసుకుంటుంది.



'ఇన్‌ఫ్రా'లో కోటి కొలువులు!

ఏడాదిలో అవకాశాల వెల్లువ

- నైపుణ్యాలు లేనివారికీ ఉద్యోగాలు
- ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు

కేంద్ర ప్రభుత్వం లక్ష్యాలు..

- విమానాశ్రయాల విస్తరణ.. **220**
- **2,00,000** 2025 నాటికి జాతీయ రహదారుల నిర్మాణం
- 2030 నాటికి జలరవాణా మార్గాల ఏర్పాటు **23**
- **35** మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల నిర్మాణం

మౌలిక రంగం భారీ ఉపాధి అవకాశాలకు వేదిక కానుంది. మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు కేంద్ర సర్కారు ప్రాధాన్యం ఇస్తుండడంతో ఈ రంగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కోటి ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని ఉద్యోగ నియామక సేవలు అందించే 'టీమ్‌లీజ్ సర్వీసెస్' అంచనా వేసింది. కేంద్రంలో మూడోసారి కొలువు దీరిన మోదీ సర్కారు రహదారులు, రైల్లు, విమానాశ్రయాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తుందన్న అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ రంగంలో అసలు నైపుణ్యాలు లేని వారితో పాటు, స్వల్ప నైపుణ్యాలు, పూర్తి నైపుణ్యాలు కలిగిన వారికి పెద్ద ఎత్తున ఉపాధి లభించనున్నట్టు టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా. ఈ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 98 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కొత్తగా వస్తాయని తన తాజా నివేదికలో తెలిపింది. 'కొత్త ప్రభుత్వం ఈ రంగానికి ప్రాధాన్యతను కొనసాగిస్తుందని భావిస్తున్నాం. దేశ అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ఇది తప్పనిసరి. వ్యూహాత్మక పెట్టుబడులు ఉపాధి అవకాశాలతోపాటు, అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధికి వీలు కల్పిస్తాయి'అని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ పి. సుబ్రమణియమ్ తెలిపారు. రవాణా రంగంపైనా ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలతో ఉన్నట్టు చెప్పారు. విమానాశ్రయాల సంఖ్యను 220కి పెంచడం, 2025 చివరికి జాతీయ రహదారుల నిడివిని 2 లక్షల కిలోమీటర్లకు చేర్చే దిశగా పనిచేస్తున్నట్టు గుర్తు చేశారు. అలాగే, 2030 నాటికి 23 జల రవాణా మార్గాల అభివృద్ధితోపాటు, 35 మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధిని సైతం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

భారీగా వ్యయాలు..

'మౌలిక రంగంలోని పలు ఉప విభాగాల మధ్య ప్రాధాన్యతల్లో మార్పు ఉండొచ్చు. మౌలిక రంగానికి సంబంధించిన ప్రభుత్వ మూలధన వ్యయాలు ఆరోగ్యకరమైన వృద్ధితో కొనసాగుతాయి. ఈ రంగంలో రైల్వే, రహదారులు, నీటి ప్రాజెక్టులకు ప్రభుత్వ కేటాయింపులు పెరుగుతాయి. ఇది ఉపాధి అవకాశాల కల్పనకు మద్దతునిస్తుంది' అని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా జూన్‌లో విడుదల చేసిన నివేదిక సైతం ఈ రంగంలో వృద్ధి అవకాశాలను తెలియజేస్తోంది. మౌలిక రంగం, సామాజికాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం.. పట్టణీకరణ పెరగడం, రహదారుల అనుసంధానత ఇవన్నీ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల అభివృద్ధికి దోహదం చేస్తాయని జీఐ గ్రూప్ హోల్డింగ్ కంపెనీస్ కంట్రీ మేనేజర్ సోనాల్ అరోరా తెలిపారు. పెద్ద, భారీ కాంట్రాక్టులు వస్తుండడంతో తాము నియామకాలను పెంచినట్టు ఎల్‌అండ్‌టీ గ్రూప్ హెచ్‌ఆర్ చీఫ్ ఆఫీసర్ సి.జయకుమార్ తెలిపారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సెయిల్ ఈ ఏడాది పెట్టుబడి రూ. 6,500 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,500 కోట్ల మూలధన వ్యయం చేయనుంది. 2030 నాటికి రూ. లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికలో భాగంగా ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు సెయిల్ సీఎండీ అమరేందు ప్రకాశ్ శుక్రవారమిక్కడ తెలిపారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'తొలి దశలో సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 20 మిలియన్ టన్నుల నుంచి 2031 నాటికి 35 మిలియన్ టన్నులకు చేరుస్తాం. తదుపరి దశలో వార్షిక సామర్థ్యాన్ని 50 మిలియన్ టన్నులకు పెంచుతాం. స్టీల్ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా 0.5% వృద్ధి చెందుతోంది. గతేడాది భారత్ ఏకంగా 13 శాతం వృద్ధి నమోదు చేసింది. వచ్చే పదేళ్లు భారత్‌లో స్టీల్ రంగం ఏటా సగటు వృద్ధి 8%గా ఉంటుంది' అని వివరించారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇళ్ల అమ్మకాల సందడి | బ్యాంక్ డిపాజిట్లు డీలా..

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో గాయత్రి - ట్రెసా జోడి

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీ కెనడా ఓపెన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ జోడి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మూడో సీడ్ గాయత్రి - ట్రెసా 17-21, 21-7, 21-8 స్కోరుతో నటాషా ఆంథోనిసెన్ (డెన్మార్క్) - అలీసా టిర్‌టొసెన్‌టొనొ (నెదర్లాండ్స్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్ కూడా క్వార్టర్స్‌లోకి అడుగు పెట్టాడు. ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 21-19, 21-11తో టకుమా ఒబయాషి (జపాన్)పై గెలుపొందాడు. అయితే ఇతర భారత షట్లర్లకు రెండో రౌండ్‌లో నిరాశే ఎదురైంది. పురుషుల డబుల్స్‌లో గారగ కృష్ణప్రసాద్ - కె.సాయిప్రతీక్ 21-19, 18-21, 17-21తో బింగ్ వీ - చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ) చేతిలో...మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్ - గద్దె రుత్విక శివాని 15-21, 21-19, 9-21తో చెంగ్ కువాన్ - యిన్ హుయి (చైనీస్ తైపీ)చేతిలో పరాజయంపాలయ్యారు.

కుర్రాళ్లతో కొత్తగా...

నేడు భారత్, జింబాబ్వే తొలి టి20 మ్యాచ్

- ఆత్మవిశ్వాసంతో టీమిండియా
- సొంతగడ్డపై ఆశలతో జింబాబ్వే
- సా.గం.4.30 నుంచి సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లలో ప్రసారం

టి20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది...ఇంకా దేశంలో సంబరాలు, వేడుకలు కొనసాగుతూనే ఉన్నాయి. మరో వైపు టీమిండియా మరో టి20 పోరుకు రంగం సిద్ధమైంది. అయితే ఇప్పటి వరకు జరిగిన ఆటతో పోలిస్తే ఇది కాస్త భిన్నమైంది. రోహిత్, కోహ్లి, జడేజాల రిటైర్మెంట్ తర్వాత జట్టు కాస్త కొత్తగా కనపడబోతోంది. తమ అవకాశాల కోసం ఎదురు చూస్తూ వచ్చిన యువ ఆటగాళ్ల సత్తాను ప్రదర్శించేందుకు ఇది సరైన వేదిక కానుంది. వరల్డ్ కప్ టీమ్‌లో అవకాశం దక్కించుకోలేకపోయిన గిల్ నాయకత్వ సామర్థ్యానికి కూడా ఈ సిరీస్ పరీక్ష కానుండగా... సొంతగడ్డపై జింబాబ్వే విజయాన్ని అందుకోవాలని ఆశిస్తోంది.



అభిషేక్ | గిల్



రజా

హరారే: పేరుకే ఇది భారత్‌కు చెందిన ద్వితీయ శ్రేణి జట్టు కావచ్చు. కానీ అగ్రశ్రేణి ఆటగాళ్లందరితో కలిసి ఆడిన, ఎదుర్కొన్న అపార ఐపీఎల్ అనుభవంతో యువ ఆటగాళ్లంతా కూడా అన్ని రకాలుగా సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు జరిగే తొలి టి20 మ్యాచ్‌లో జింబాబ్వేతో భారత్ తలపడుతుంది. వరల్డ్ కప్ విజయోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు స్వదేశానికి వచ్చిన సామ్సన్, యశస్వి, దూబే తొలి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. మూడో టి20 సమయానికి వీరు జట్టుతో చేరతారు. 2026 టి20 వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని భారత సెలక్టర్లు సిద్ధం చేయదలిచే బృందంలో కొందరి ప్రదర్శనపై ఇక్కడినుంచే ఒక అంచనాకు రావచ్చు.

గిల్ కెప్టెన్సీలో...

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహించి సరైన ఫలితాలు రాబట్టలేకపోయిన శుబ్‌మన్ గిల్ తొలి సారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఓపెనర్‌గా అతనితో పాటు అతని బాల్య మిత్రుడు, అండర్–19 వరల్డ్ కప్ సహచరుడు అభిషేక్ శర్మ ఆడటం ఖాయమైంది. అభిషేక్‌కు ఇది తొలి అంతర్జాతీయ మ్యాచ్ కానుంది. ఇటీవల ఐపీఎల్‌లో భీకర ఫామ్‌తో అదరగొట్టిన అభిషేక్ ఇక్కడ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం. మూడో స్థానంలో రుతురాజ్ ఖాయం కాగా, రియాన్ పరాగ్ కూడా అరంగేట్రం చేసే అవకాశం ఉంది. వరల్డ్ కప్‌లో రిజర్వ్‌గా ఉండి ఆడే అవకాశం రాని రింకూ సింగ్‌పై కూడా అందరి దృష్టి నిలిచింది. తన దూకుడును ప్రదర్శించేందుకు రింకూకు ఇంతకంటే మంచి అవకాశం రాదు. బౌలింగ్‌లో కూడా ఐపీఎల్‌లో ఆకట్టుకున్న ఖలీల్, అవేశ్, బిష్ణోయ్‌లపై జట్టు ఆధారపడుతోంది. ప్రతిభ ఉన్నా...వరుస గాయాలతో పదే పదే సీనియర్ జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. కీపర్‌గా తొలి ప్రాధాన్యత జురేల్‌కు దక్కవచ్చు. ఈ మ్యాచ్‌లో భారత్‌నుంచి ఎంత మంది అరంగేట్రం చేస్తారనేది ఆసక్తికరం.

రజాపైనే భారం...

జింబాబ్వే కూడా కొత్త కుర్రాళ్లపైనే దృష్టి పెట్టింది. అందుకే సీనియర్లలో ర్యాన్ బర్ల్‌పై వేటు వేసిన జట్టు సీన్ విలియమ్స్, క్రెయిగ్ ఇర్విన్‌లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేయకుండా విశ్రాంతినిచ్చింది. డ్రగ్స్ వాడిన ఆరోపణలతో నాలుగు నెలలు సస్పెన్షన్‌కు గురైన మదవెర్, మవుతా తిరిగి జట్టులోకి వచ్చారు. అయితే కెప్టెన్ సికందర్ రజాపైనే జింబాబ్వే ప్రధానంగా ఆధారపడుతోంది. ఇటీవల వైటాలిటీ బ్లాస్ట్‌లో చెలరేగిన అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. మసకద్జ, ముజరబానిలనుంచి అతనికి సహకారం అందాల్సి ఉంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), అభిషేక్, రుతురాజ్, పరాగ్, రింకూ, జురేల్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, తుషార్, ఖలీల్

జింబాబ్వే: రజా (కెప్టెన్), బెనెట్, మరుమని, క్యాంప్‌బెల్, నఖ్వీ, మదాందే, మదవెర్, జాంగ్వే, ఫరాజ్, మసకద్జ, ముజరబాని

పిచ్, వాతావరణం

నెమ్మదైన పిచ్. భారీ స్కోర్లకు అవకాశం లేదు. గత 12 మ్యాచ్‌లలో 5 సార్లు మాత్రమే స్కోరు 150 పరుగులు దాటింది. పొడి వాతావరణం. వర్ష సూచన లేదు.

8 భారత్, జింబాబ్వే మధ్య 8 టి20లు జరిగాయి. 6 భారత్ గెలవగా, 2 జింబాబ్వే గెలిచింది.

అల్‌కరాజ్ అద్భుత రీతిలో...

- ఐదు సెట్‌ల పోరులో విజయం
- పోరాడి ఓడిన ఫ్రాన్సెస్ టియాఫో
- మహిళల్లో కీస్, పావొలిని ముందంజ
- వింబుల్డన్ టోర్నీ



అల్‌కరాజ్

లండన్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ వింబుల్డన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఓటమి అంచుల నుంచి గట్టెక్కి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్‌లో మూడో రౌండ్ దాటేందుకే ప్రస్తుత ఫ్రెంచ్ ఓపెన్ చాంప్ అష్టకష్టాలు పడ్డాడు. ఐదు సెట్ల పాటు సాగిన సుదీర్ఘ పోరాటంలో ఎట్టకేలకు కార్లోస్ అల్‌కరాజ్ 5-7, 6-2, 4-6, 7-6 (7/2), 6-2తో ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా)పై చెమటోడ్చి గెలిచాడు. ఈ మ్యాచ్‌లో 29వ సీడ్ టియాఫో... స్పెయిన్ స్టార్‌కు చుక్కలు చూపించాడు. దాదాపు ఓడించినంత పనిచేశాడు. అల్‌కరాజ్ 1-2 సెట్లతో వెనుకబడిన దశలో నాలుగో సెట్ హోరాహోరీగా సాగింది. స్కోరు 6-6 వద్ద సమం కాగా... టైబ్రేక్ నిర్వహించారు. ఇందులో పుంజుకున్న అల్‌కరాజ్ తర్వాత ఆఖరి ఐదో సెట్‌ను సులువుగా గెలుచుకొని ఊపిరి పీల్చుకున్నాడు. ఇతర మ్యాచ్‌లలో పదో సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-3తో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై వరుస సెట్లలో విజయం సాధించగా, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6-1, 6-3, 4-6, 1-1తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై ఆధిక్యంలో ఉన్న దశలో వర్షం వల్ల మ్యాచ్‌ను నిలిపివేశారు. మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), ఏడో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ) ప్రిక్వార్టర్స్ చేరారు. మూడో రౌండ్లో కీస్ 6-4, 6-3తో 18వ సీడ్ మార్టా కొస్ట్యుక్ (ఉక్రెయిన్)పై, పావొలిని (ఇటలీ) 7-6 (7/4), 6-1తో బియాంక ఆండ్రీస్కు (కెనడా)పై విజయం సాధించారు. మరో మ్యాచ్‌లో ఎమ్మా నవారో (అమెరికా) 2-6, 6-3, 6-4తో డయానా స్నైడెర్ (రష్యా)పై నెగ్గింది.

ముర్రే నిష్క్రమణ...



ముర్రే

స్థానిక బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కెరీర్ ప్రఖ్యాత వింబుల్డన్‌లో తొలి రౌండ్ ఓటమితో ముగిసింది. సోదరుడు జేమీ ముర్రేతో కలిసి అతను డబుల్స్ బరిలోకి దిగాడు. ముర్రే జోడీ 6-7 (6/8), 4-6 స్కోరుతో రింకీ హిజికట-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో ఓడింది. దీంతో రెండు సార్లు వింబుల్డన్ సింగిల్స్ చాంప్ (2013, 2016) ముర్రేకు ప్రేక్షకులంతా స్టాండింగ్ ఒవేషన్‌తో గౌరవ వందం ఇచ్చారు. దిగ్గజాలు ఫెడరర్, నాదల్, జొకోవిచ్, వీనస్ విలియమ్స్‌లు వీడియో సందేశాల ద్వారా అతనికి ఫేర్‌వెల్ పలికారు. వర్షం కారణంగా వింబుల్డన్ టోర్నీకి అంతరాయం కలిగింది. పెద్ద సంఖ్యలో మ్యాచ్‌లను నిలిపివేసి శనివారానికి వాయిదా వేశారు.

యూకీ, బాలాజీ జోడీలు అవుట్

డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు నిరాశ ఎదురైంది. యూకీ బాంబ్రీ పోరాటం రెండో రౌండ్లో ముగియగా, శ్రీరామ్ బాలాజీ కనీసం తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. రెండో రౌండ్‌లో యూకీ-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6-4, 4-6, 3-6తో జర్మనీకి చెందిన కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యుయెట్జ్ జంట చేతిలో పరాజయం చవి చూసింది. తొలి సెట్‌లో కనబరిచిన ఉత్సాహం తర్వాతి సెట్లలో కొనసాగించడంతో భారత్-ఫ్రాన్స్ ద్వయం విఫలమైంది. మరో మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ జంటకు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. బాలాజీ-జాన్సన్ (బ్రిటన్) జంట 4-6, 5-7తో నాలుగో సీడ్ మార్సెలా అరెవలో (సాల్వేడార్)- మేట్ పావిచ్ (క్రొయేషియా) జోడీ చేతిలో ఓడింది.

భారత మహిళలు పోరాడినా...

- తొలి టి20లో దక్షిణాఫ్రికాదే గెలుపు
- 12 పరుగులతో ఓడిన భారత్

చెన్నై: వన్డే సిరీస్, ఏకైక టెస్టులో చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు టి20 సిరీస్‌లో భారత మహిళలకు అలాంటి అవకాశం ఇవ్వలేదు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో శుభారంభం చేసిన సఫారీ టీమ్ టీమిండియాపై పైచేయి సాధించింది. శుక్రవారం చెపాక్ మైదానంలో చివరి వరకు హోరాహోరీగా సాగిన తొలి టి20లో దక్షిణాఫ్రికా 12 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. తజ్‌మిన్ బ్రిట్స్ (56 బంతుల్లో 81; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), మరిజన్ కాప్ (33 బంతుల్లో 57; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగగా...కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (22 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించింది. బ్రిట్స్, కాప్ రెండో వికెట్‌కు 56 బంతుల్లోనే 96 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో పూజ వస్త్రకర్, రాధ యాదవ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 177 పరుగులే చేయగలిగింది. జెమీమా రోడ్రిగ్స్ (30 బంతుల్లో 53 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... స్మృతి మంధాన (30 బంతుల్లో 46; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (29 బంతుల్లో 35; 5 ఫోర్లు) రాణించారు. స్మృతి, షఫాలీ వర్మ (18) తొలి వికెట్‌కు 32 బంతుల్లోనే 56 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ఆ తర్వాత ఒకే స్కోరు వద్ద స్మృతి, హేమలత (18) వెనుదిరిగారు. విజయం కోసం 59 బంతుల్లో 103 పరుగులు చేయాల్సిన ఈ దశలో జెమీమా, హర్మన్ జత కలిశారు. వీరిద్దరు దూకుడుగా ఆడి నాలుగో వికెట్‌కు 59 బంతుల్లో 90 పరుగులు జోడించగలిగినా...చివరకు ఓటమి తప్పలేదు. తాజా ఫలితంతో సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ఆధిక్యంలో నిలవగా, రెండో టి20 మ్యాచ్ ఆదివారం ఇక్కడే జరుగుతుంది.



కాప్ | బ్రిట్స్

క్లుప్తంగా...

వలంటీర్ దారుణ హత్య



కాశినాయన: వైఎస్సార్ జిల్లా గొంటువారిపల్లె గ్రామంలో వలంటీర్‌గా పనిచేసిన కల్లూరి అస్సానయ్య (25) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గొంటువారిపల్లెకు చెందిన కల్లూరి అస్సానయ్య ఎన్నికల ముందు వరకు వలంటీరుగా పనిచేశాడు. ఆ తర్వాత వలంటీర్ల పునరుద్ధరణపై ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో.. 15 రోజుల కిందట కర్ణాటక –తమిళనాడు సరిహద్దులో అద్దెకు ఇల్లు తీసుకుని పీజీ వసతి గృహం ఏర్పాటుచేశాడు. ఈ నేపథ్యంలో.. గురువారం మధ్యాహ్నం తనకు ఫోన్‌చేసి పీజీ వసతి గృహంలో అన్ని ఏర్పాట్లు చేశానని, శనివారం ప్రారంభిస్తున్నానని చెప్పాడని ఆయన భార్య తెలిపారు. ఆ తర్వాత ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని, గురువారం మధ్యాహ్నం ఆయన హత్యకు గురైనట్లు సమాచారం అందిందని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని తమిళనాడు పోలీసులు మృతుడి తమ్ముడికి తెలియజేయడంతో ఆయన సంఘటనా స్థలానికి వెళ్లాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి నాలుగు నెలల పాప ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత దుకాణం ధ్వంసం

- నెల్లూరు జిల్లా కొత్తపేటలో టీడీపీ నేతల దౌర్జన్యం



రేకులు కూల్చేసిన దుకాణం వద్ద బాధితుడు

దుత్తలూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కొత్తపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతు తిరుపాల్ నాయుడి దుకాణాన్ని శుక్రవారం టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. రేకులను ధ్వసం చేయడంతో అందులో నిల్వచేసిన ధాన్యం పాడైందని తిరుపాల్‌నాయుడు చెప్పారు. 20 ఏళ్ల కిందట దుకాణాన్ని ఏర్పాటు చేసి కరెంట్ బిల్లు, శిస్తు చెల్లిస్తున్నట్లు తెలిపారు. తాము వైఎస్సార్ సీపీకి పనిచేశామనే కారణంతో టీడీపీ వారు కక్షగట్టారని చెప్పారు. దుకాణాన్ని ధ్వంసం చేసేందుకు టీడీపీ నేతలు గురువారం యత్నించగా పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. తాను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ గిరిబాబు, ఎస్‌ఐ ఉమాశంకర్‌తో మాట్లాడుతుండగానే గ్రామంలో దుకాణ రేకులను టీడీపీ నేతలు ధ్వంసం చేశారని చెప్పారు. అదేమంటే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దుకాణం గ్రామకంఠంలో ఉందని తప్పుడు తీర్మానం చేసి మభ్యపెట్టారన్నారు. ఐదేళ్ల నుంచి దుకాణాన్ని మూసేసి ధాన్యాన్ని నిల్వ చేసుకుంటున్నట్లు తెలిపారు. రేకులను ధ్వంసం చేయడంతో ధాన్యం పాడైపోయిందన్నారు. తన దుకాణం కంటే ముందే వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడికి చెందిన మరో దుకాణాన్ని భయపెట్టి మూసేయించారని ఆయన తెలిపారు.

అమరావతిపై అఖిలపక్ష సమావేశం జరపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిపై అనిశ్చితి తొలగించేలా అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతితో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అమరావతి, క్యాపిటల్ రీజియన్ పై 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిందని, అయితే భవిష్యత్ ప్రణాళిక గురించి శ్వేతపత్రంలో ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందని విమర్శించారు. అస్సైన్డ్ రైతులకు సమానమైన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సమీకరణ చట్ట ప్రకారం రైతులకు ప్లాట్లు అభివృద్ధి, భూమి లేని పేదలకు పెన్షన్లు, గృహ నిర్మాణం, ఉపాధి కల్పన, ఉచిత విద్య, వైద్యం తదితర చట్టబద్ధమైన హామీలను అన్నింటిని ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

30శాతం రాయితీపై ఆప్కో వస్త్రాలు

సాక్షి, అమరావతి: ఆప్కో వస్త్రాలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు 30 శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆప్కో మెగా షోరూమ్ మేనేజర్ వై.గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన మంగళగిరి, బందరు, రాజమండ్రి, చీరాల, కాటన్ చీరలు, ఉప్పాడ వెంకటగిరి, మాధవరం పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, దుప్పట్లు, టవల్స్, లుంగీలు వంటి చేనేత వస్త్రాలు వినియోగదారులకు రాయితీపై అందిస్తామన్నారు. www. apcohand-looms.com ఆన్‌లైన్ వెబ్‌సైట్‌తోపాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా, పేటీమ్ వంటి ఆన్‌లైన్ స్టోర్స్ నుంచి కూడా ఆప్కో వస్త్రాలను కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.

కొనసాగుతున్న విధ్వంసం

- మన్యం జిల్లా తూడి గ్రామంలో వైఎస్సార్ విగ్రహంపై దాష్టీకం
- తిరుపతి జిల్లా నెత్తకుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మె ధ్వంసం
- పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో శిలాఫలకాలు ధ్వంసం



తూడి గ్రామంలో ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం



దుండగుల దాడిలో నేలమట్టమైన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె



ఎం. కోడూరు సచివాలయంలో ధ్వంసం చేసిన శిలాఫలకం (గేటు పక్కన)

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తెలుగుదేశం విధ్వంసకాండ కొనసాగుతోంది. ప్రగతిపనుల శిలాఫలకాలు, వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మెలను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్ విగ్రహాలను పగులగొడుతున్నారు. ఈ దుశ్చర్యలు గురువారం రాత్రి, శుక్రవారం కొనసాగాయి.

- పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం తూడి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసంచేశారు. సమీపంలో ఉన్న సచివాలయం రెయిలింగ్‌ను పెకిలించి పంట పొలాల్లో విసిరేశారు. ఈ ఘటనలపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శి చిన్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా ఆకతాయిలు గ్రామంలో వీధిలైట్లు పగులగొట్టడం, కుళాయిలు విరగ్గొట్టడం తదితర పనులు చేస్తూ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. ఇది పిరికిపందల చర్య అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి చర్యలను ఖండించాలని కోరారు.
- తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం నెత్తకుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేశారు. ఈ విషయమై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల కుప్పం బాదూరు, గంగిరెడ్డిపల్లిల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఎత్తుకెళ్లారు.
- పల్నాడు జిల్లా అనంతవరంలో గ్రామ సచివాలయంపై అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు దురుసుగా ప్రవర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎం.షఫీ సిబ్బందితో వెళ్లి గుమిగూడిన వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.
- అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని గురువారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులు ధ్వంసం చేశారు. సచివాలయ ప్రవేశ ద్వారం వద్ద బూడి సచివాలయం అన్న పదాన్ని శిలాఫలకం మీద ఏర్పాటు చేశారు. బూడి అనే పదాన్ని తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు పంచాయతీ కార్యదర్శి, స్థానిక ఎంపీడీవోలను ఇటీవల కోరారు. ఈ విషయమై ఎంపీడీవో జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారుల ఆదేశాలు వచ్చిన తరువాత ఈ శిలాఫలకాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ శిలాఫలకాన్ని టీడీపీ, జనసేన నాయకులు తవ్వి పూర్తిగా తీసేశారు. ఈ దుశ్చర్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కూటమి నాయకులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పేర్కొన్నారు.

ప్రభుత్వం మాది.. ఇక వంట ఏజెన్సీ మాదే!

- స్కూలు నుంచి మధ్యాహ్న భోజనం నిర్వాహకులను వెళ్లగొట్టిన టీడీపీ నాయకులు
- ఎన్టీఆర్ జిల్లా జయంతిపురం గ్రామంలో ఘటన



ఆవేదన వ్యక్తంచేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీదారులు

జయంతిపురం(జగ్గయ్యపేట): 'ఇప్పుడు ప్రభుత్వం మాది. ఇక మీరు పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయొద్దు. మీరు ఇంటికి వెళ్లండి...' అంటూ టీడీపీ నాయకులు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీదారులను బలవంతంగా బయటకు పంపించారు. గ్రామానికి చెందిన భూక్యా మంగమ్మ, బాణావత్ ఇందిర, యంద్రాతి పుల్లమ్మ, లాహోరి సత్య అనే మహిళలు గ్రూపుగా ఏర్పడి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారు. వారు యథావిధిగా శుక్రవారం ఉదయం పాఠశాల సమయానికి విద్యార్థులకు వంట చేసేందుకు వచ్చారు. అప్పటికే గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు అక్కడకు చేరుకుని 'మా పార్టీకి చెందినవారు మధ్యాహ్న భోజనం చేస్తారు. మీరు వెళ్లిపోండి..' అని చెప్పారు. 'పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. మీరు చెప్పడం ఏమిటీ' అని ఏజెన్సీ నిర్వాహకులు ప్రశ్నించారు. దీంతో టీడీపీ నాయకులు వంటగది తాళాలు పగలగొట్టి తమవారితో వంట చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రధానోపాధ్యాయుడు రామారావు ఇచ్చిన సమాచారం మేరకు ఎంఈవో చిట్టిబాబు, చిల్లకల్లు పోలీసులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే స్కూలు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏజెన్సీ మార్పుపై జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు రాలేదని ఎంఈవో చెప్పారు. ఆయన మాటలను కూడా టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. హెచ్ఎం, ఎంఈవో నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోయినా టీడీపీ నాయకులు తమ వారితోనే వంట చేయించారు. ఇక చేసేది లేక వంట ఏజెన్సీ నిర్వాహకులు వెళ్లిపోయారు.

సర్పంచ్‌కి సహకరిస్తే క్రిమినల్ కేసులు

మంచినీళ్లపేటలో టీడీపీ నేతల బెదిరింపులు

- మంచినీటి సరఫరా పథకం పంపుహౌస్‌కు తాళం
- బెదిరింపులపై అధికారులకు వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు: నీరు సరఫరా చేసే పంపుహౌస్ తాళాలు మర్యాదగా తెచ్చి ఇవ్వాలి.. లేకుంటే క్రిమినల్ కేసులు పెడతాం.. అంటూ శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో టీడీపీ నేతలు శుక్రవారం మంచినీటి పథకం ఆపరేటర్ సోడిపిల్లి రామారావు, సర్పంచ్ వంక సత్యరాజులను బెదిరించారు. 'ఈ ఐదేళ్లు సర్పంచ్‌ను పక్కన పెట్టాలి.. ఇదే నీకు వార్నింగ్.. అతడికి సహకరిస్తే పరిస్థితులు వేరుగా ఉంటాయి. తెలుగుదేశం పార్టీ గెలిచింది కాబట్టి సర్పంచ్ మా కింద బానిసగా ఉండాలి..' అంటూ టీడీపీ నేత గుళ్ల చిన్నారావు, ఆయన అనుచరులు సీహెచ్ దీనారావు, దాసరి గురయ్య, కావళ్ల మోహనరావు దూషించారని, తాళం వేసి ఉన్న మంచినీటి సరఫరా పథకానికి మరో తాళం వేసి ప్రజలకు తాగునీటి పంపిణీకి ఆటంకం కలిగించారని సర్పంచ్ సత్యరాజు, ఆపరేటర్ రామారావు తెలిపారు. టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులు, ఎంపీడీవో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. తమను బెదిరిస్తున్నారని, దీనివల్ల గ్రామంలోని సుమారు 700 ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. సర్పంచ్‌గా తన విధులకు, హక్కులకు భంగం కలిగించి, దుర్భాషలాడిన గుళ్ల చిన్నారావు, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైస్ ఎంపీపీ వంక రాజు తదితరులున్నారు.

వాటా ఇస్తారా.. వ్యాపారం మూస్తారా?

- బార్ అండ్ రెస్టారెంట్లపై అధికార పార్టీ నాయకుల జులుం
- చిలకలూరిపేటలో మూడు రెస్టారెంట్ల మూత



కళామందిర్ సెంటర్‌లో మూసిఉన్న బార్ అండ్ రెస్టారెంట్

చిలకలూరిపేట: ఉచితంగా వాటా ఇస్తారా.. వ్యాపారాలు మానుకుంటారా? అంటూ అధికార పార్టీ నాయకులు హుకుం జారీచేయడంతో వ్యాపారులకు దిక్కుతోచడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో బార్ అండ్ రెస్టారెంట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పట్టణంలోని మూడు బార్ అండ్ రెస్టారెంట్లు ఈ నెల రెండో తేదీ నుంచి మూసేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. కళామందిర్ సెంటర్, కేబీ రోడ్డులో గాంధీపార్కు ఎదురుగా, విశ్వనాథ సెంటర్‌లోని బార్ అండ్ రెస్టారెంట్లను సత్తెనపల్లికి చెందిన ఓ మద్యం వ్యాపారి నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు వీటికి లైసెన్సు ఉంది. అయితే అధికార పార్టీ నాయకులు తమకు ఉచితంగా 50 శాతం వాటా ఇవ్వాలని, లేదంటే వ్యాపారం ఆపేయాలని బెదిరించారు. దీంతో ఆ వ్యాపారి ఆ బార్ అండ్ రెస్టారెంట్లను మూసేశారు. ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. బార్ అండ్ రెస్టారెంట్ల మూతపై ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్‌ను ఫోన్లో అడగగా.. తాము ఏ కారణంతోను వాటిని మూసివేయించలేదని తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే మూసినట్లు తెలిసిందని చెప్పారు.

టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కొలిమిగుండ్ల: ఉపాధ్యాయుడుపై బూతులతో రెచ్చిపోయిన టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ సంయుక్త కార్యదర్శి గంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత ఉపాధ్యాయుడు, ఎరుకలి సంఘం నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఎంఈవో కార్యాలయానికి చేరుకొని ఉపాధ్యాయుడికి న్యాయం చేయాలని నిరసన తెలిపారు. రేషన్ బియ్యం బస్తాలను ప్రాథమిక పాఠశాలలో నిల్వ ఉంచాలని విజయభాస్కర్‌రెడ్డి కోరడంతో వద్దని వారించిన ఉపాధ్యాయుడిపై రాయలేని భాషలో దూషించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఎంఈవో కార్యాలయంలో గంగన్న విలేకరులతో మాట్లాడుతూ..ఘటన జరిగిన రోజే బాధిత ఉపాధ్యాయుడు జరిగిన విషయాన్ని ఎంఈవోకు చెప్పారని కానీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. గిరిజన ఉపాధ్యాయుడికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఉపాధ్యాయుడికి ప్రాణహాని ఉందని, తక్షణమే ఆయనను డిప్యూటేషన్‌పై మరో ప్రాంతానికి పంపాలని అధికారులకు వినతిపత్రమిచ్చారు.

'కోర్నపల్లి' ఘటనపై ఎస్టీ కమిషన్ సీరియస్

- ఉపాధ్యాయుడిని దూషించిన టీడీపీ నేతపై చర్యలు తీసుకోండి
- నంద్యాల ఎస్పీకి ఆదేశం..సుమోటోగా విచారణకు స్వీకరణ

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా కోర్నపల్లెలో గిరిజన ఉపాధ్యాయుడిని టీడీపీ నేత తీవ్ర దుర్భాషలాడటాన్ని ఏపీ ఎస్టీ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ విషయమై మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించి ఆ ఘటన వివరాలను ఆరా తీసింది. విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది.. రేషన్ బియ్యాన్ని స్కూల్‌లో పెట్టొద్దన్నందుకు గిరిజన ఉపాధ్యాయుడిపై టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి బూతులతో రెచ్చిపోయాడు. దీంతో బిత్తరపోయిన ఉపాధ్యాయుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ విషయమై మీడియాలోను, సామాజిక మాధ్యమాల్లోను వచ్చిన కథనాలు పరిశీలించిన ఎస్టీ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ శుక్రవారం ఫోన్ ద్వారా నంద్యాల ఎస్పీని కోరారు. ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

చిత్తూరు మేయర్ సహా 24 మంది కార్పొరేటర్లపై వేటు

- వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేయాలని విజయానందరెడ్డి ప్రతిపాదన
- ఉత్తర్వులు జారీ చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భరత్

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కార్పొరేటర్లుగా పోటీచేసి.. టీడీపీ, జనసేన పార్టీలోకి మారిన పలువురు కార్పొరేటర్లపై సస్పెన్షన్ వేటు పడింది. చిత్తూరు నగర మేయర్ అముద సహా పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ నివాసంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. అలాగే సార్వత్రిక ఎన్నికలకు ముందు పలువురు జనసేన పార్టీలో చేరగా, మరికొందరు ఇటీవల తిరుపతి జనసేన ఎమ్మెల్యేను కలిశారు. దీంతో వైఎస్సార్‌సీపీలో ఉంటూ టీడీపీ, జనసేన నాయకులతో జత కట్టిన కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. దీంతో మేయర్ అముద (39వ డివిజన్), డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి (7వ డివిజన్), ఆర్‌జీ.శ్రీకాంత్ (1వ డివిజన్), పి.నవీన్‌కుమార్ (2వ డివిజన్), బి.అజర్ భాను (6వ డివిజన్), డికె.సునీత (10వ డివిజన్), ఎం.శాంతి (18వ డివిజన్), ఎ.సుందరమూర్తి (19వ డివిజన్), పి.గంగ (22వ డివిజన్), ఇ.ఇందు (27వ డివిజన్), టి.ప్రభావతి (28వ డివిజన్), ఎస్.సుష్మ (30వ డివిజన్), సయ్యద్ సర్దార్ (31వ డివిజన్), పూర్ణచంద్రరావు (32వ డివిజన్), హుస్సేన్ అలీషా (36వ డివిజన్), కె.నిర్మల (37వ డివిజన్), పి.గణేష్ (40వ డివిజన్), కుప్పమ్మ (41వ డివిజన్), ఆర్.శశికుమార్ (42వ డివిజన్), పి.వెంకటరమణ (43వ డివిజన్), ఎస్.రెడ్డెప్ప (46వ డివిజన్), ఏజి.సహదేవన్ (50వ డివిజన్), నళిని (కో–ఆప్షన్ సభ్యురాలు), కోలా కిరణ్ (కో–ఆప్షన్ సభ్యులు)ను సస్పెండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కెఆర్‌జే.భరత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఖాళీ ప్లేట్లను చూపుతున్న సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

అన్నమో చంద్రబాబూ!

▶ మొదటి పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తంచేశారు. తాగేందుకు, స్నానం చేసేందుకు కూడా నీళ్లు లేవన్నారు. మరుగుదొడ్లను శుభ్రంచేసే వారు లేకపోవడంతో తామే ఆ పనిచేయాల్సి వస్తోందన్నారు. కళాశాలలో చదివే ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థుల మెస్ చార్జీలను క్లస్టర్ యూనివర్సిటీ వసూలు చేసుకుని నిర్వహణకు ముందుకురాకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తాయన్నారు. విద్యార్థులు చెల్లించే మెస్ చార్జీల్లో అధిక భాగం బియ్యం కొనుగోలుకే సరిపోతుండటంతో గతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మానవత్వంతో సిల్వర్ జూబ్లీ కళాశాలకు అవసరమయ్యే బియ్యాన్ని కేజీ రూపాయికే ఇచ్చేలా జీవో ఇచ్చిందని వివరించారు. అయితే, టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ జీవోను అమలు చేయడంలేదన్నారు. దీంతో ప్రస్తుతం కేజీ బియ్యం కోసం కళాశాల రూ.41 చెల్లిస్తోందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలైతే కేజీ బియ్యం రూపాయికే వస్తాయని, మిగిలిన రూ.40లతో వంటకు అవసరమైన కూరగాయలు, నూనెలు, ఇతర అన్ని రకాల సరుకులు కొనుగోలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి సిల్వర్ జూబ్లీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్యవైశ్యులపై దాడులు సహించం

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దాష్టీకం ఆపాలి
- తిరుపతి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌కు మద్దతుగా ఆర్యవైశ్యులంతా ఏకం కావాలి
- వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆర్యవైశ్యులపై టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నేతలు దాడులు చేస్తే ఇక సహించబోమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ హెచ్చరించారు. తాడేపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, తాము ఏంచేసినా తిరిగి అనలేరని, దాడులు చేయలేరని భావిస్తే కూటమి నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తాము పాతకాలం ఆర్యవైశ్యులం కాదని.. చేతులు ముడుచుకుని కూర్చోడానికి ఆర్యవైశ్యులెవరూ సిద్ధంగాలేరని తెలిపారు. టీడీపీ కూటమి నేతల దృష్టి ఆర్యవైశ్యుల వ్యాపారాలపై పడిందన్నారు. కష్టనష్టాలకోర్చి వ్యాపారాల ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయాన్నివ్వడమే కాకుండా, పది మందికి ఉపాధి చూపిస్తున్న తమను టీడీపీ నేతలు బెదిరించటం తగదన్నారు. రాష్ట్రంలో రైస్‌మిల్లులు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య యజమానులు అడిగినంత డబ్బులు ఇవ్వలేదని బెదిరింపులకు దిగటం, దాడులకు తెగబడటం చేస్తున్నారని.. ఇది మంచి సంప్రదాయం కాదని ఆయన చెప్పారు.

ఆర్యవైశ్యులంతా కిషోర్‌కు అండగా..

ఇక వ్యాపారుల్లో ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలబడే ఆర్యవైశ్యుల సంక్షేమ సంఘం నాయకుడు, చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్, తిరుపతి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడైన కిషోర్‌నే వేధించి, ఆయన మిల్లును మూసివేయించడంపై రాష్ట్రంలోని వ్యాపార వర్గాలవారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని కుప్పం ప్రసాద్ తెలిపారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకునేందుకు రాష్ట్రంలోని వ్యాపారులంతా పార్టీలకతీతంగా సంఘటితమవుతున్నారని తెలిపారు. తమ నేత కిషోర్‌కు న్యాయం జరిగే వరకు ప్రతి ఆర్యవైశ్య బిడ్డ ఆయనకు అండగా నిలుస్తారని చెప్పారు. వ్యాపార సంస్థలను మూసివేయిస్తే ఎంతమంది జీవితాలు రోడ్డున పడతాయన్నది ఆలోచించని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన బంధువుల తీరును ప్రజలకు వివరించడంతో పాటు సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే చంద్రగిరికి వెళ్లి కిషోర్‌ని పరామర్శిస్తామన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి బెదిరింపులకు దిగేవారిపై కేసు నమోదు చేసి, మూసివేసిన రైస్ మిల్లును తక్షణమే తెరిపించకపోతే, రాష్ట్రంలో ఆర్యవైశ్యులంతా చలో చంద్రగిరికి పిలుపునివ్వక తప్పదని కుప్పం ప్రసాద్ హెచ్చరించారు.

మాకు ఓటేయలేదు... ఎందుకొచ్చారు?

అఖిలపక్ష నేతలతో టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి




శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప రూరల్: సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించేందుకు శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి నివాసానికి వెళ్లిన అఖిలపక్ష నేతలకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి నుంచి చేదు అనుభవం ఎదురైంది. నివాసంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి లేకపోవడంతో అక్కడ ఉన్న శ్రీనివాసులురెడ్డి అఖిలపక్ష నేతలనుద్దేశించి ఏమిటిలా వచ్చారని ప్రశ్నించారు. వచ్చిన అంశాన్ని అఖిలపక్ష నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు శ్రీనివాసులురెడ్డి స్పందిస్తూ మీరు మాకు ఓటు వేయలేదు...మా వద్దకు ఎందుకు వచ్చారని ఎదురు ప్రశ్నించారు. దీంతో అఖిలపక్ష నేతలు నిశ్చేష్టులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ అఖిలపక్ష నేతలనుద్దేశించి మీరు అలా వ్యాఖ్యానించడం తగదన్నారు. అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సీఆర్‌పీ ప్రసాద్, సంఘ సేవకులు సలావుద్దీన్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుర్రప్ప, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి కేసీ బాదుల్లా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ హుసేన్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకృష్ణ, నాసిర్ ఖాన్, మైనుద్దీన్, అయ్యుబ్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు.

మండల పరిషత్ సమావేశంలో టీడీపీ బరితెగింపు

- ప్రకాశం జిల్లా దొనకొండలో రచ్చ
- సమావేశానికి రాకుండా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్లనే అడ్డుకొని రసాభాస
- బూచేపల్లికి అండగా భారీగా చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బందోబస్తు మధ్య ఎమ్మెల్యే బూచేపల్లిని ఎంపీడీవో కార్యాలయంలోకి తీసుకెళ్తున్న దృశ్యం

దర్శి: ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో టీడీపీ నేతల బరితెగింపు రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రొటోకాల్ ప్రకారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డినే అడ్డుకొన్నారు. కార్యాలయం గేట్లు మూసేసి రసాభాస చేశారు. శుక్రవారం దొనకొండలో మండల పరిషత్ సర్వసభ్య ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. అధికారుల ఆహ్వానం మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అక్కడికి వచ్చారు. పథకం ప్రకారం ముందుగానే అక్కడికి చేరుకున్న టీడీపీ నేతలు గేట్లు మూసివేసి వారిద్దరినీ అడ్డుకున్నారు. ఎంపీడీవో గేటువద్దకు వచ్చి వారిని లోపలికి పంపాలని టీడీపీ నేతలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ మూకలు ఆయన్ని బెదిరించి లోపలకు పంపేశారు. బూచేపల్లిపై దాడి చేయడానికి టీడీపీ మూకలు రాళ్లు కూడా తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నాయి. 'మా ప్రభుత్వం వచ్చింది. ఇక్కడ మీకేం పని' అంటూ టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను అసభ్య పదజాలంతో దూషించారు. ఉద్రిక్తత సృష్టించారు. గంటన్నరకుపైగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌ను గేటు బయటే నిలబెట్టారు. సీఐ సుబ్బారావు పోలీసు సిబ్బందితో వచ్చి వారిద్దరినీ లోనికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. టీడీపీ నేతలు మరింతగా రెచ్చిపోయి పోలీసులను సైతం అసభ్య పదజాలంతో దూషించారు. జై చంద్రబాబు అని నినాదాలు చేస్తూ కార్యాలయంలో రాళ్లు పెట్టుకుని హంగామా సృష్టించారు. సీఐ సుబ్బారావు పోలీస్ బందోబస్తు నడుమ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌ను లోనికి తీసుకెళ్లారు. వారు సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిని సత్కరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సంధి సరిచేసి.. అర్థం చెప్పి

శివాజీనగర: చామరాజపేటలో మొరార్జీ దేశాయ్ వసతి పాఠశాలను సీఎం సిద్దరామయ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఎలా చదువుకుంటున్నారు అంటూ విద్యార్థులను అడిగారు. సంధి అంటే ఏమిటి, సంధులలో కన్నడ అక్షర మాల తదితర వాటిపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం ఆయన పిల్లల సమాధానాలను సరిచేసి వారికి వివరించారు.



న్యూస్‌రీల్

భారీ వర్షాలకు ఒకరు బలి



గాలింపు చేపడుతున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మహిళ బలైంది. హొసనగర తాలూకాలో కురిసిన వర్షాలకు వంకలు, వాగులు ఏరులై పారుతున్నాయి. ఈక్రమంలో బైసె గ్రామంలో శశికళ(43) అనే మహిళ గురువారం ఉదయం పొలానికి వెళ్తూ కాలువ దాటేందుకు యత్నిస్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. స్థానికులు ఆమెను రక్షించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. రెండు గంటల అనంతరం అగ్నిమాపక, పోలీసు సిబ్బంది వచ్చి గాలించగా మృతదేహం లభ్యమైంది.

పోలీసు విచారణకు హాజరైన డెవిల్ డైరెక్టర్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో రోజుకో కొత్త వ్యక్తి తెరమీదకు వస్తున్నారు. హత్య జరిగిన రోజు నిందితులతో కాంటాక్ట్‌లో ఉన్న ప్రతీ ఒక్కరినీ పోలీసులు విచారణకు పిలుస్తున్నారు. తాజాగా దర్శన్ నటించిన డెవిల్ సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్ మిలన ప్రకాశ్‌కు పోలీసులు నోటీసులు ఇవ్వగా ఆయన శుక్రవారం బసవేశ్వరనగర్‌లోని ఏసీపీ చందన్‌కుమార్ కార్యాలయానికి విచ్చేశారు. రేణుకాస్వామి హత్య తరువాత దర్శన్ మైసూరు వెళ్లి డెవిల్ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నాడు. దీంతో దర్శన్ ఎన్ని గంటలకు వచ్చాడు, ఎంత సమయం షూటింగ్‌లో గడిపాడు అనే విషయాల గురించి ఆరా తీయడానికి పోలీసులు విచారణకు పిలిచారు.

పాపం పసికందు

యశవంతపుర: మహిళకు కాన్పు చేస్తున్న సమయంలో శిశువు మర్మాంగం కట్ కావడంతో పసికందు మృతి చెందింది. ఈఘటన గురువారం రాత్రి కర్ణాటకలోని దావణగెరె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. దావణగెరె కొండజ్జి రోడ్డులో నివాసం ఉంటున్న అర్జున్ భార్య అమృత ప్రసవం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు పరీక్షలు చేయగా సాధారణ కాన్పు కష్టమని చెప్పారు. సిజేరియన్‌కు అంగీకరించడంతో శిశువును బయటకు తీశారు. వైద్యుడు నిజాముద్దీన్ పసికందు పేగును కత్తిరించటానికి బదులు మర్మాంగాన్ని కత్తిరించటంతో శిశువు మృతి చెందింది. శిశువు మృతికి వైద్యుడి నిర్లక్ష్యం కారణమని తల్లిదండ్రులు ఆక్రోశం వ్యక్తం చేశారు. వైద్యుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

12 లక్షల ఇళ్లకు మంచినీరు



కేంద్రమంత్రి సోమణ్ణను సన్మానిస్తున్న దృశ్యం

తుమకూరు: జలజీవన్ మిషన్ ద్వారా తుమకూరు జిల్లాలో 12 లక్షల గృహాలకు రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టామని కేంద్రమంత్రి వి.సోమణ్ణ తెలిపారు. అన్నారు. జిల్లాలోని చిక్కనాయకనహళ్లిలో కన్నడ సంఘం వేదిక సమావేశం హాలులో చిక్కనాయకనహళ్లి నాగరిక సమాజం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సన్మానం స్వీకరించి మాట్లాడారు. జలజీవన్ పథకానికి రాష్ట్రంలో లక్ష కోట్లు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు.

వరుణుడి హోరు.. నదులకు జీవం

- కరావళి, మలెనాడును ముంచెత్తిన వర్షాలు
- జనజీవనం అస్తవ్యస్తం
- ఉడుపి జిల్లాల్లో నీట మునిగిన గ్రామాలు
- వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- ఉడుపి, శివమొగ్గ జిల్లాల్లో ఇద్దరి మృతి
- ఉత్తర కన్నడ, దక్షిణ జిల్లాల్లో పాఠశాలలకు సెలవు
- రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ



వంద అడుగుల నీటిమట్టానికి చేరుకున్న కేఆర్‌ఎస్ డ్యాం



ఉడుపి జిల్లా బైందూరులో నీట మునిగిన ఇల్లు

సాక్షి బెంగళూరు: కరువుతో అల్లాడుతున్న కర్ణాటకను వరుణుడు కరుణించాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరావళి, మలెనాడుల్లో వానలు దంచికొడుతున్నాయి. కాలువలు, నదులు, చెరువులు, నాలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలకు వర్షపు నీటితో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. దక్షిణ కన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, ఉత్తర కన్నడ జిల్లాల్లో రెండు, మూడు రోజులుగా భారీ వానలు కురుస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర కన్నడ జిల్లాలో వరుణుడి బీభత్సం తీవ్రంగా ఉంది.

శివమొగ్గలోనూ భారీ వర్షపాతం నమోదు

కరావళి ప్రాంతంలో ఉదయం నుంచే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. బుధవారం నుంచి ఆయా తాలూకాల్లో మబ్బులు కమ్మేసిన పరిస్థితులు కనిపించాయి. బుధవారం ప్రారంభమైన చిరుజల్లులు గురు, శుక్రవారాల్లో తమ ప్రతాపాన్ని చూపించాయి. ఉడుపిలో గురువారం నుంచి ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. కుందాపుర, బైందూరు తాలూకాల్లో కురుస్తున్న వర్షాలకు చాలావరకు గ్రామాలు నీట మునిగాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఉడుపి జిల్లా కొల్లూరులో వర్షపు ధాటికి కొండ చరియ విరిగిపడి ఇంటిపై పడడంతో హళ్లిబేరు నివాసి అంబా (45) అనే వ్యక్తి మరణించారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు

కార్వార, అంకోలా వంటి ఉత్తర కన్నడ జిల్లా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం ధాటికి ప్రజలకు దాదాపుగా ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ వర్షాల కారణంగా ఉత్తర కన్నడ జిల్లాలోని నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఐదు చోట్ల సహాయ కేంద్రాలను ప్రారంభించారు. శుక్రవారం ఉత్తర కన్నడ జిల్లాల్లోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటంచారు. అంకోలా, కుమటా, హొన్నావర, భట్కళ వంటి నదీ తీర ప్రాంతాల ప్రజల మధ్యకు వరద నీరు వచ్చి చేరుతోంది. అంకోలా తాలూకాలో గంగావళి నది నీరు పొంగి ప్రవహిస్తోంది. బిళిహోంయిగి గ్రామం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. బిళిహోంయిగి, లింగనమక్కి, హడవ గ్రామాల్లోని సుమారు 35 ఇళ్లు నీటిలో మునిగిపోయాయి. చిక్కమగళూరు జిల్లా శృంగేరి తాలూకాను గురువారం వర్షాలు పలకరించాయి. ఈ వర్షం కారణంగా పట్టణంలోని బైపాస్ రోడ్డు, శారదా మందిరం వద్ద ఉన్న కప్పె శంకర లింగం తుంగా నీటిలో మునిగిపోయింది. రాత్రికిరాత్రికి కురిసిన భారీ వర్షానికి తుంగా నదిలో నీటి ప్రవాహం పెరిగిపోయింది. జాతీయ రహదారి 169 సమీపం వరకు వరద నీరు వచ్చి చేరింది. అలాగే కళస, నరసింహరాజపుర, బాళెహొన్నూరు, కొట్టిగెహార ప్రాంతాల్లో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది.

నదుల్లో పెరుగుతున్న నీటిమట్టం

దక్షిణ కన్నడ జిల్లాలో కురుస్తున్న వర్షానికి కుందాపుర, బైందూరు, బ్రహ్మావర తాలూకాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ ఈదురు గాలులతో కురుస్తున్న వర్షానికి జిల్లాలో ఐదు ఇళ్లకు నష్టం వాటిల్లింది. తెంకకారందూరు సంతాన గోపాలకృష్ణ దేవస్థానం గోడ కూలిపోయింది. కాపు సమీపంలో మృత్యుంజయ నది వరద నీటితో పొంగి ప్రవహిస్తోంది. భారీ వర్షాల కారణంగా కుమారధార నదిలో తీర్థ స్నానాలను నిలిపేశారు. స్నాన ఘట్టం డ్రెస్సింగ్ రూమ్ పక్కనే డ్రమ్ములను ఏర్పాటు చేసి తీర్థ స్నానాలు చేసేందుకు కుక్కే సుబ్రహ్మణ్య దేవస్థానం అవకాశం కల్పించింది. శివమొగ్గ జిల్లాలో భీకర వర్షాలు కురుస్తున్నాయి. భూమికి నెర్రలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి ప్రమాదాలు జరిగాయి. తుమకూరులో సుమారు 10 స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రవాణాకు



నిండుకుండలా తుంగా జలాశయం

ఆటంకంగా మారింది. ఆగుంబె ఘాటిలో కారు బోల్తా పడింది. కారులోని వారు గాయపడ్డారు. తీర్థహళ్లి, హొసనగర, సాగర తాలూకాల్లో భారీ వర్షం కారణంగా శరావతి, తుంగా, మాలతి, కుముద్వతి, దండావతి నదుల నీటి మట్టం పెరిగింది.

7 నుంచి 9 వరకు ఎల్లో అలర్ట్

కరావళి జిల్లాల్లో అకాల వర్షాలు తమ రుద్రప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. రానున్న 48 గంటల పాటు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. జూలై 7 నుంచి 9వ తేదీ వరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. మలేనాడు జిల్లాలైన చిక్కమగళూరు, శివమొగ్గకు రెండు రోజుల పాటు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. జూలై 7, 9వ తేదీల మధ్య ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. దక్షిణ కన్నడ, ఉడుపి, ఉత్తర కన్నడ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదవుతుందని ప్రకటించింది. అలాగే చిక్కమగళూరు, శివమొగ్గ జిల్లాల్లో గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు ఉంటుందని చెప్పింది. బెంగళూరు గ్రామీణం, బెంగళూరు, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, హాసన్, కోలారు, దావణగెరె, మండ్య, మైసూరు, రామనగర, తుమకూరు, విజయనగర, బళ్లారి జిల్లాల్లో అక్కడక్కడ చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది.

ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టాలు (మీటర్లలో)

రిజర్వాయర్ పేరు	పూర్తి నీటి సామర్థ్యం	శుక్రవారం నీటి సామర్థ్యం	శుక్రవారం ఇన్‌ఫ్లో(క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో
లింగనమక్కి	554.44	531.13	44,024	1341
సూపా	564	525.58	25678	1370
వారాహి	594.36	570.96	2669	0
హారంగి	871.38	860.71	5048	200
హేమావతి	890.58	880.71	8447	250
కేఆర్‌ఎస్	38.04	23.94	9686	546
కబిని	696.13	686.25	8321	2917
భద్రా	657.73	642.84	16171	350
తుంగభద్ర	497.71	480.55	19201	396
ఘటప్రభ	662.91	633.11	12173	194
ఆల్మట్టి	519.60	507.77	53901	430
నారాయణపుర	492.25	486.87	218	218
వాణి విలాస్ సాగర్	652.24	650.23	0	147

నిండుకుండలా తుంగా జలాశయం

శివమొగ్గ: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాజలాశయంలోకి భారీగా వరదనీరు చేరుతోంది. డ్యాంలోకి 16,171 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 350 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగా జలాశయం ఇప్పటికే గరిష్టనీటి మట్టం 588.24 అడుగులకు చేరుకుంది. 34,477 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 37,104 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. లింగనమక్కి జలాశయంలోకి 44,024 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 1340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నిధుల వ్యయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: సీఎం

శివాజీనగర: ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ నిధులను నిర్దేశించిన గడువులోపు ఖర్చు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శుక్రవారం విధానసౌధలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధిపై సమావేశం జరిగింది. కర్ణాటకలో మాత్రమే ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ చట్టం అమలులో ఉందన్నారు. 2024–25వ సంవత్సరంలో ఎస్‌సీఎస్‌పీ పథకం కింద రూ.27,673.96 కోట్లు, టీఎస్‌పీ కింద రూ.11,447.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత సంవత్సరం రూ.35221.84 కోట్లు కేటాయించగా 99.64 శాతం ఖర్చు చేశారని, మిగతా సొమ్ము ఖర్చు కాలేదన్నారు. వందశాతం నిధులు ఆయా వర్గాల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 11 శాతం రూ.3,897 కోట్ల నిధులు పెంచామన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖకు రూ.8,480 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు రూ.4,174కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.3,403 కోట్లు, గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.3,163 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులను వంద శాతం ఖర్చు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల మండలికి కేటాయించిన నిధులు కూడా ఖర్చు కాలేదన్నారు. ఎమ్మెల్యేలు జాబితా ఇవ్వలేదని కారణం చెబుతుండటం సరికాదని, లబ్ధిదారుల జాబితా అందజేయాలని అధికారులు మండలి అధ్యక్షులు, సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు చెప్పాలని సూచించారు. డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్, మంత్రులు హెచ్.సీ.మహదేవప్ప, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజనీశ్ గోయల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'నా కుమారుడిని చంపిన వారికి శిక్ష పడాలి'

దొడ్డబళ్లాపురం: తన కుమారుడిని దారుణంగా హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడాలని రేణుకాస్వామి తల్లి రత్నప్రభ అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు.దర్శన్ తల్లి, కుటుంబ సభ్యులు దర్శన్‌ను కలవడానికి జైలుకు వెళ్లి వస్తున్నారని, తాను తన చేతులతోనే కుమారుడిని మట్టిలో కలిపానని, తన కుమారుడిని చూసే భాగ్యం తనకు ఇక లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేణుకాస్వామి అశ్లీల మెసేజ్ పంపించాడని అందరూ ఇప్పుడు చెబుతున్నారని, ముందే చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని ఉంటే తన కుమారుడు దక్కేవాడన్నారు.

విచారణకు హాజరైన మాజీ ఉప మేయర్

నటుడు దర్శన్‌కు నగదు ఇచ్చిన ఆరోపణలపై మాజీ ఉప మేయర్ మోహన్ రాజ్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. రేణుకాస్వామి హత్య జరిగాక కేసు తనపై రాకుండా ఉండాలని నిందితులకు ఇవ్వడానికి ఖర్చుల కోసం దర్శన్.. మోహన్‌రాజ్ వద్ద రూ.30 లక్షలు నగదు తీసుకున్నారని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పోలీసులు విచారణకు హాజరు కావాలని మోహన్‌రాజ్‌కు నోటీసులు ఇచ్చారు. ఈమేరకు మోహన్‌రాజ్ శుక్రవారం పోలీసుల ముందు హాజరయ్యారు.

బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

మైసూరు: ఎస్‌సీపీ, టీఎస్‌పీ పథకం కింద తవ్విన బోర్లకు వెంటనే విద్యుదీకరణ పనులు పూర్తి చేయాలని చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆదేశించారు. మైసూరులోని జలదర్శిని సమావేశం హాలులో శుక్రవారం ఆయన చిన్ననీటి పారుల శాఖ అధికారులతో సమావేశమై నాబార్డు, ఎస్‌ఆర్‌డీఎఫ్ కింద ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. అనేక చోట్ల బోర్లు తవ్వినా వాటికి కరెంటు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. అలాంటి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

చిన్నారిపై లైంగిక వేధింపులు

యశవంతపుర: బెంగళూరులో అమానుషం చోటు చేసుకుంది. మూడేళ్ల బాలికపై ప్రైవేటు నర్సరీ పాఠశాల ఉపాధ్యాయురాలు లైంగిక వేధింపులకు పాల్పడింది. ఈఘటన బెంగళూరులోని కేజీహళ్లిలో జరిగింది. బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కేజీహళ్లి వెంకటేశ్వరపుర అన్వర్‌లేఔట్‌లోని ప్రైవేటు నర్సరీ పాఠశాలలో జూన్ ఆరు నుంచి తరగతులు జరుగుతున్నాయి. స్కూల్‌కు వెళ్తున్న మూడేళ్ల బాలికపై ఇక్కడ పనిచేస్తున్న టీచర్ లైంగిక వేధింపులకు పాల్పడింది. 10 రోజులపాటు పాఠశాలకు వెళ్లిన బాలిక అనంతరం మొండికేసింది. బడికి ఎందుకు వెళ్లవని తల్లిదండ్రులు అడగ్గా టీచర్ అకృత్యం వెలుగు చూసింది. ఆమె పేరు చెప్పాలని సూచించగా తనకు తెలియదని తెలిపింది. గురువారం సాయంత్రం బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. తర్వాత కేజీహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పాఠశాలకు వెళ్లి సదరు టీచర్‌ను గుర్తించి పోక్సో కేసు నమోదు చేశారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా

బనశంకరి: బెంగళూరు నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేస్తే రూ.500 జరిమానా విధించాలని అధికారులకు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ సూచించారు. శుక్రవారం నగరంలో తుషార్ మాట్లాడుతూ... చెత్త ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో దోమల ఉత్పత్తి పెరిగి డెంగీ లాంటి అంటురోగాలు ప్రబలుతున్నాయని, ఈ దృష్టితో బీబీఎంపీ చర్యలు తీసుకుందన్నారు. ఇంటి పరిసరాల్లో స్వచ్ఛత కాపాడి డెంగీ నియంత్రణకు పాలికెతో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో డెంగీ జ్వరం కేసులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి డెంగీపై జాగృతం చేస్తున్నారన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు సంచరిస్తే సీజ్

శివాజీనగర: నగరంలోని 11 ఆర్‌టీఏ కార్యాలయాల పరిధిలో నిషేధించిన ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు రోడ్లపై కనిపిస్తే సీజ్ చేయాలని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. బైక్ ట్యాక్సీలతో ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లకు డిమాండ్ పడిపోయింది. దీంతో వాటిపై ఆధారపడిన డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారు. బైక్ ట్యాక్సీలను నిషేధించాలని 2021లో ఆటో, ట్యాక్సీ వాహనాల డ్రైవర్లు, యజమానులు ధర్నాలు నిర్వహించారు. దీంతో ప్రభుత్వం బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించింది. అయితే కొన్ని సంస్థలు అనధికారికంగా ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రైవేట్ రవాణా వాహనాల సంఘం ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. రవాణా కమిషనర్ యోగేశ్‌ను భేటీ చేసి తమ గోడు వెల్లబోసుకున్నారు. దీంతో ఎల్క్ట్రానిక్ బైక్ ట్యాక్ ట్యాక్సీలు రోడ్లపై సంచరిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.

దుస్తుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

దొడ్డబళ్లాపురం: విమానాశ్రయం రోడ్డులో చిక్కజాల వద్ద ఉన్న జాకీ దుస్తుల షోరూంలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. హఠాత్తుగా మంటలు చెలరేగి దుకాణం మొత్తం దట్టమైన పొగ ఆవరించింది. దీంతో సిబ్బంది బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం. చిక్కజాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



ఎగసిపడుతున్న మంటలు

సిద్దారూఢ పోస్టల్ స్టాంప్ విడుదల నేడే

హుబ్లీ: ప్రజల ఆరాధ్య దైవం సిద్దారూఢ స్వామి మఠంలో శనివారం సిద్దారూఢ స్వామీజీ చిత్రంతో కూడిన రూ.5 విలువ చేసే పోస్టల్ స్టాంప్ విడుదల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మఠం ట్రస్ట్ కమిటీ అధ్యక్షులు బసవరాజ కళ్యాణ శెట్టర్ తెలిపారు. భక్తుల, ధర్మకర్తల ఆశయం మేరకు సిద్దారూఢ పోస్టల్ స్టాంప్‌ల కల సాకారం కానుందన్నారు. స్టాంప్ విడుదల సమితి అధ్యక్షుడు చెన్నవీర ముంగరవాడి మాట్లాడుతూ మఠం ట్రస్ట్ ఢిల్లీ శాఖ, కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ, పోస్టల్ శాఖల సహకారంతో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ్ హొరట్టి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి స్టాంప్‌ను విడుదల చేస్తారన్నారు. జోన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ ఎస్.రాజేంద్ర కుమార్ పోస్టల్ స్టాంప్ ప్రాధాన్యతను వివరిస్తారన్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారన్నారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు మంజునాథ మునవళ్లి, గౌరవ కార్యదర్శి సర్వమంగళ పాఠక, ట్రస్టీలు రమేష్ బెళగావి, వినాయక ఘోర్పడె, గీతా కలబుర్గి, శ్యామానంద పూజారి, వసంత తదితరులు పాల్గొన్నారు.



కొత్త చట్టాలను నిరసిస్తూ శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ఆందోళన నిర్వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు, లెనినిస్టు) లిబరేషన్ నాయకులు

రేణుకాస్వామి హత్యకేసులో బ్లూప్రింట్ కోసం లేఖ

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్న విధానం ఆశ్చర్యం కలిగిస్తోంది. పక్కా ప్రణాళికతో పోలీసులు సాక్ష్యాధారాలు సేకరిస్తూ కేసుతో సంబంధం ఉన్న ఏ ఒక్క వ్యక్తిని, వస్తువునీ వదలకుండా విచారణ చేసి, సాక్ష్యంగా మలచుకుంటున్నారు. ఈక్రమంలో కామాక్షిపాళ్య పోలీసులు తాజాగా పీడబ్ల్యూడీ అధికారులకు బ్లూప్రింట్ తయారుచేసి ఇవ్వాలని లేఖ రాశారు. కామాక్షిపాళ్యలోని పట్టణగెరె మెకానిక్ షెడ్డు నుంచి రేణుకాస్వామి శవాన్ని ఏ మార్గాన తరలించారు? ఎక్కడ విసిరేసారు?, తర్వాత ఏ మార్గాల్లో ఎవరెవరు సంచరించారనే పూర్తి సమాచారం ఆధారంగా బ్లూ ప్రింట్ తయారు చేసి ఇవ్వాలని లేఖ రాశారు.

రేణుకాస్వామి హత్య కేసులో మరొకరికి నోటీసు

రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు మరో వ్యక్తికి నోటీసులు ఇచ్చారు. రేణుకాస్వామి హత్య జరిగాక ఘటనాస్థలానికి వచ్చిన కార్తీక్ పురోహిత్ అనే వ్యక్తికి పోలీసులు విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. హత్యోదంతం వెలుగు చూశాక భయపడ్డ కార్తీక్ పరారయ్యాడు. నిందితుల్లో ఒకడైన ప్రద్యోస్ అనే వ్యక్తి కోరిక మేరకు కార్తీక్ సంఘటనాస్థలికి వచ్చాడు. ఈకేసులు మరో రహస్య వ్యక్తి ఉన్నాడని పోలీసులు ఇప్పటికే కోర్టుకు తెలిపారు.

కాళికామాత సన్నిధిలో కేంద్రమంత్రి



అమ్మవారిని దర్శించుకుంటున్న కుమారస్వామి

మండ్య: కేంద్ర ఉక్కు, భారి పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమార స్వామి శుక్రవారం మండ్యలో శక్తిదేవత శ్రీ కాళికాలంబ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

డెంగీతో బాలిక మృతి

యశవంతపుర: హాసన జిల్లాలో డెంగీకి మరొకరు బలయ్యారు. హొళెనరసీపుర తాలూకా దొడ్డళ్లి గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలిక నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో బాలికను హిమ్స్ ఆస్పత్రిలో చేర్పారు. అక్కడ నయం కాకపోవడంతో మైసూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది.

క్లుప్తంగా

వేడుకగా పోలమ్మ దేవి ఉత్సవాలు



కలశాలతో పాల్గొన్న ముత్తైదువులు

రాయచూరు రూరల్: నగరంలోని మంగళవార పేటలో శుక్రవారం పోలమ్మ దేవి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది మాదిరిగా ఆషాఢ మాసంలో ముత్తైదు మహిళలు కుంభ కలశాలతో రెండు కి.మీ.ల పొడవున పాదయాత్రను చేపట్టి అమ్మవారికి మొక్కును తీర్చుకున్నారు.

అక్రమ కట్టడాలు తొలగించండి



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: నగరంలోని సత్యనాథ్ కాలనీలో అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగించాలని బ్రాహ్మణ సమాజం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద వారు స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. కాలనీలో రిటైర్డ్ నగర సభ ఇంజినీర్ మల్లికార్జున ఇంటిని సెట్ బ్యాక్ వదలకుండా నిర్మించారని ఆరోపించారు.

కేఎంసీ అధ్యక్షుడిగా డాక్టర్ యోగానందరెడ్డి



బళ్లారి రూరల్: బెంగళూరులో జూలై 2న జరిగిన వైద్యుల ఎన్నికల్లో బళ్లారికి చెందిన ప్రఖ్యాత చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ యోగానందరెడ్డి గెలుపొంది కర్ణాటక మెడికల్ కౌన్సిల్(కేఎంసీ) అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బళ్లారి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) డాక్టర్ యోగానందరెడ్డికి అభినందనలు తెలిపినట్లు అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. కేఎంసీ అధ్యక్ష స్థానానికి డాక్టర్ యోగానందరెడ్డి యోగ్యుడని తెలిపారు. వైద్యులకు జరిగిన ఈ ఎన్నికల్లో మైసూరుకు చెందిన కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రవికృష్ణప్ప ఉపాధ్యక్షుడుగా ఎన్నికైనట్లు తెలిపారు. బళ్లారి ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యరావు, సహకార్యదర్శి డాక్టర్ సంగీత కట్టిమని, కోశాధికారి డాక్టర్ టి.వారిజా, సంఘం సభ్యులు డాక్టర్ యోగానందరెడ్డికి అభినందనలు తెలిపారు.

జిల్లాధికారుల బదిలీల పర్వం




బదిలీ అయిన చంద్రశేఖర్ నాయక్



కొత్త జిల్లాధికారిగా వచ్చిన నితీష్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది.గురువారం రాత్రి ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి ఉకేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాయచూరు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌ను బెంగళూరు కమర్షియల్ కమిషనర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆర్థిక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.నితీష్‌ను రాయచూరుకు బదిలీ చేశారు. బీదర్ జిల్లాధికారి గోవిందరెడ్డిని గదగ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో బెంగళూరు విద్యుత్ కార్యానాలో ఎండీగా పని చేస్తున్న శిల్పా శర్మను బీదర్‌కు బదిలీ చేశారు.

తుంగభద్రకు పెరిగిన వరద



తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర డ్యాంకు ఎగువన నదీ పరివాహక ప్రాంతాల్లో ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో తుంగభద్ర డ్యాంకు వస్తున్న వరద పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1590.80 అడుగులకు, నీటి నిల్వ 11.714 టీఎంసీలకు చేరిందని మండలి అధికారులు తెలిపారు. ఎగువన కురిసిన భారీ వర్షాలతో శివమొగ్గ జిల్లాలోని తుంగా డ్యాం ఇప్పటికే పూర్తిగా నిండింది. శుక్రవారం డ్యాంకు 19201 క్యూసెక్కుల నీరు చేరుతోంది. మరి కొన్ని రోజుల్లో డ్యాంకు మరింతగా వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతేడాది వర్షాల ప్రభావం తక్కువగా ఉండటంతో రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయి డెడ్ స్టోరేజ్ నీరు మాత్రమే మిగిలింది. ఈ ఏడాది డ్యాంలోకి నీటి రాక ప్రారంభమై క్రమంగా డ్యాం నిండుతుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోరలు చాస్తున్న డెంగీ

- జిల్లా వ్యాప్తంగా 57 కేసుల నమోదు
- అదుపులో ఉందంటున్న అధికారులు



కోలారులో డ్రమ్ముల్లో లార్వాలు పరిశీలిస్తున్న అధికారులు



రాయచూరులో నీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు

కోలారు : వర్షాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈక్రమంలో కోలారు జిల్లాలో డెంగీ నియంత్రణలో ఉన్నా చాపకింద నీరులా ప్రబలుతోంది. జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు 686 రక్త పరీక్షలు నిర్వహించగా వీటిలో 57 డెంగీ కేసులు వెలుగు చూశాయి. జిల్లాలో ఎక్కడా సామూహిక డెంగీ కేసులు, జ్వరాలు ఎక్కడా నమోదు కాలేదు. ఆరోగ్య శాఖ జ్వరంతో బాధపడుతున్న వారు, అనుమానాస్పద కేసులపై దృష్టి పెట్టి పరీక్షలు చేస్తోంది. రక్త నమూనాలను సేకరించి ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన కేసులపై మాత్రమే ఆరోగ్య శాఖకు సమాచారం అందిస్తున్నారు. అత్యవసర కిట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ అని తేలితే ఆరోగ్య శాఖకు సమాచారం ఇస్తున్నారు. ప్రస్తుతం సేకరించిన రక్తం నమూనాల్లో 22 చికెన్ గున్యా, మలేరియా కేసులు కూడా వచ్చాయి.



డెంగీ వ్యాప్తికి కారణమయ్యే ఈడిస్ దోమ

పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాధుల వ్యాప్తి

పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారి నుంచి కూడా డెంగీ మలేరియా, చికెన్‌గున్యా వ్యాపిస్తోంది. శ్రీనివాసపుర తాలూకాలోని మామాడిమండిలో ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు కార్మికులకు మలేరియా సోకింది. చుట్టుపక్కల 75 మందికి కూడా రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరిలో కేసులు కనిపించలేదని సీజనల్ వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఆశా కార్యకర్తలు జాగృతి కల్పించడంతో పాటు నిఘా ఉంచారు. గ్రామాల్లో లావా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వెళ్లి లార్వా పరీక్షలు చేస్తున్నారు. నిలిచిన నీటిలో 15 రోజులకోసారి దోమ పెట్టే గుడ్లను నాశనం చేయడం తమ ఉద్దేశమని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. ఆరోగ్యవంతులను ఈడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాపించే డెంగీతో వారం లోగా ఒళ్లునొప్పులు, తలనొప్పి, జ్వరం, కీళ్ల నొప్పులు ప్రారంభం అవుతాయని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. ఇంతవరకు జిల్లాలోని శ్రీనివాసపురలో 5, ముళబాగిలులో 7, బంగారుపేటలో 11, కేజీఎఫ్‌లో 7, కోలారులో 19, మాలూరులో 8 కలిపి మొత్తం 57 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు.

డెంగీ నియంత్రణకు జనజాగృతి

రాయచూరు రూరల్: జిల్లాలో డెంగీ వ్యాధి నియంత్రణకు జనజాగృతి అవసరమని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి సురేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆజాద్ నగర్‌లో ఆయన తమ శాఖ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి తొట్టెలను పరిశీలించి మాట్లాడారు. నగర పరిధిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాలువల వద్ద శుభ్రతను పాటించాలన్నారు. ఆరోగ్యానికి తొలిమెట్టు పరిశుభ్రతే అని అన్నారు.

> **నియంత్రణలోనే డెంగీ**
>
> జిల్లాలో డెంగీ నియంత్రణలోనే ఉంది. మిగిలిన జిల్లాలతో పోలిస్తే కోలారు జిల్లాలో డెంగీ వ్యాప్తి తక్కువగా ఉంది. డెంగీపై జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
>
> –డాక్టర్ రవికుమార్, సీజనల్ వ్యాధుల నియంత్రణ అధికారి

మరమ్మతు పనులతో రైళ్ల రాకపోకలు ఆలస్యం

హుబ్లీ: జుద్రామకుంటి, ఆల్మట్టి రైల్వే స్టేషన్ల మధ్య మరమ్మతు పనులు చేపట్టినందున విజయపుర-హుబ్లీ-విజయపుర, బాగలకోటె-మైసూరు బసవ డైలీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యంగా సంచరించనున్నాయి. ఈ నెల 8న విజయపుర నుంచి బయలుదేరే విజయపుర డైలీ ప్యాసింజర్ స్పెషల్ రైలు నిర్ణీత సమయం కన్నా 80 నిమిషాలు, 8న బాగలకోటె స్టేషన్ నుంచి బయలుదేరే బాగలకోటె-మైసూరు బసవ డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు నిర్ణీత సమయం కంటే 30 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందని నైరుతీ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

జెడ్పీ కొత్త సీఈఓగా నోంగ్‌జోయ్



బాధ్యతలను స్వీకరిస్తున్న నోంగ్‌జోయ్

హొసపేటె: విజయనగర జిల్లా జెడ్పీ కొత్త సీఈఓగా, ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఐఏఎస్ అధికారి నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. పదవీ విరమణ చేసిన జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు నూతన జెడ్పీ సీఈఓకు స్వాగతం పలికి అధికార బాధ్యతలను అప్పగించారు. 2020వ బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా నిజానికి మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌కు చెందిన వారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివాడు. గతంలో విజయనగర జిల్లా హొసపేటె సబ్‌డివిజన్ సీనియర్ అసిస్టెంట్ కమిషనర్‌గా దాదాపు 12 నెలలుగా విధులు నిర్వహించారు.

లవ్ జిహాద్‌పై కరపత్రాల పంపిణీ

హుబ్లీ: లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల్లో జాగృతి కల్పించడానికి శ్రీరామ సేన కార్యకర్తలు గత రెండు రోజులుగా వివిధ కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు కర పత్రాలను పంపిణీ చేస్తున్నారు. సేన ప్రముఖులు మాట్లాడుతూ లవ్ జిహాద్‌కు బలైన బాధితులు సమాచారం ఇస్తే వారికి అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. హిందూ యువతులను వలలో వేసుకొనే వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ విషయంలో తగిన సహాయం కోసం సహాయవాణి ఫోన్ నెంబర్- 9090443444ను సంప్రదించాలని కోరారు. నగరంలోని బీవీబీ, పీజీ జబీనా, కనకదాస కళాశాలలకు కార్యకర్తలు వెళ్లి కర పత్రాలను పంచి పెట్టి అవగాహన కల్పించారు. సంఘం ప్రముఖులు అన్నప్ప దివటగి, బసు దుర్గద తదితరులు మాట్లాడుతూ గత మే 29 నుంచి ప్రారంభించిన సహాయవాణికి మంచి స్పందన లభించిందన్నారు. కర్ణాటక నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా సహాయవాణికి ఫోన్ చేసి బాధితులు తమ ఆవేదనను తెలియజేస్తున్నారన్నారు. తమ సహాయవాణికి బెదిరింపు ఫోన్లు కూడా వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు ఈ సహాయవాణికి 1073 మంది ఫోన్ చేశారన్నారు. వీరిలో 197 మిస్‌కాల్ కాగా 876 కాల్స్‌ను స్వీకరించామన్నారు. సంఘం ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తున్న 569 మంది ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారన్నారు. 175 మంది బెదిరిస్తూ ఫోన్ చేశారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి 23 కాల్స్‌లు వచ్చాయన్నారు. లవ్ జిహాద్ ఫిర్యాదు 109 రాగా వీటిలో 64 ఫిర్యాదులను శ్రీరామ సేన నేతలు, కార్యకర్తలు పరిష్కరించారన్నారు. 27 ఫిర్యాదులు పరిష్కార దిశలో ఉన్నాయన్నారు. 18 ఫిర్యాదులు మాత్రం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని మురికివాడల్లో నివసించడానికి కేటాయించిన స్థలం సర్వేతో పాటు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు చేపట్టాలని కర్ణాటక మాదిగ యువ సేన డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు కరియప్ప మాట్లాడారు. గత ఐదు నెలల నుంచి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన అధికారులు, కాంట్రాక్టర్లు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జిల్లా స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న అబ్దుల్ రెహమాన్ నందగాడి

హొసపేటె: పోలీస్ శాఖలో నమోదైన కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక అని మూడో ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి అబ్దుల్ రెహమాన్ నందగాడి అన్నారు. జూలై 13న జాతీయ లోక్‌అదాలత్ జరగనున్న నేపథ్యంలో విజయనగర జిల్లా పోలీస్ శాఖ అధికారులకు తాలూకా కోర్టు కార్యాలయ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాథమిక సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ శాఖలో నమోదు అయిన కేసుల సంఖ్యను తగ్గించేందుకు శాఖ అధికారులు, సిబ్బంది అందరి సహకారం, సమన్వయం అవసరమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర కీలకమన్నారు. ఇప్పుడు న్యాయ శాఖ పాత్ర కూడా ఉందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

ఎస్పీ పని తీరుకు ప్రశంసలు :

విజయనగర జిల్లా ఎస్పీ నేతృత్వంలో జిల్లా పోలీసులు అద్భుతంగా పని చేయడం గర్వించదగ్గ విషయమని ఎస్పీ శ్రీహరిబాబు పని తీరును న్యాయమూర్తి అభినందించారు. జిల్లా ఎస్పీ బీఎల్ శ్రీహరిబాబు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న పోలీస్ కేసులను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో విజయనగర జిల్లా మొత్తం రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. ప్రిన్సిపల్ సివిల్, ఏఎంఎఫ్‌సీ కోర్టు జడ్జి, తాలూకా లీగల్ సర్వీసు కమిటి మెంబర్ సెక్రటరీ ప్రశాంత్ నాగలాపుర తదితరులు పాల్గొన్నారు.

కరువు నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: జిల్లాలో సక్రమంగా వర్షాలు కురుస్తున్నా ప్రస్తుతం తీవ్రత తక్కువగా ఉన్న కరువు తదితర విషయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని విజయనగర జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు సూచించారు. ఆయన శుక్రవారం జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో జరిగిన విజయనగర జిల్లా గ్రామ పంచాయతీ స్థాయి ప్రగతి పరిశీలన సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్‌మిషన్, హౌసింగ్ స్కీమ్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, పన్నుల వసూలు, ఆస్తి సర్వే, సకల, గ్రామ ఆరోగ్య అభియాన్, బయోమెట్రిక్ హాజరు, లైబ్రరీ సామాగ్రిని జిల్లా పంచాయతీ ఖాతాలకు జమ చేయడం వంటి వాటిపై సమగ్ర ప్రగతిని సమీక్షించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై పీడీఓలకు తగిన సూచనలు చేశారు. విశాల దృక్పథంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహించి మరుగుదొడ్లు లేని ఇళ్లను నిర్మించి అక్కడికక్కడే పౌరసరఫరా పోర్టల్‌లో దరఖాస్తు చేసి వారికి సరైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వర్క్ ఆర్డర్, చెల్లింపు ఆర్డర్‌ను జారీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వర్క్ ఆర్డర్లు, పేమెంట్ ఆర్డర్ల జారీలో చాలా జాప్యం జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి వారం తాలూకా వారీగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముట్టడి



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న పోలీసు అధికారి

రాయచూరు రూరల్: నగరంలో సంచార జాతుల, గిరిజన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అలెమారి గిరిజన ప్రజలు నగరసభ కార్యాలయాన్ని ముట్టడించారు. శుక్రవారం నగరసభ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు వినోద్‌రాజ్ మాట్లాడారు. 300 అలెమారి గిరిజన కుటుంబాలకు మార్కెట్‌లో నూతనంగా ప్లాస్టిక్ వంటి సామానులు రావడంతో ఉపాధి గడవడం కష్టంగా మారిందన్నారు. సర్కార్ ఉచితంగా వాసాలు, వెదురు కర్రలు వంటివి అందించి సబ్సిడీ రూపంలో యంత్రాల కొనుగోలుకు సహాయం అందించాలని కోరుతూ నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యకు వినతిపత్రం సమర్పించారు.

పచ్చదనం పర్యావరణానికి ఊతం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

హొసపేటె: పర్యావరణం మనకు ప్రాణం లాంటిదని, విద్యార్థులు పర్యావరణ ప్రేమికులు కావాలని ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప విద్యార్థులకు సూచించారు. విజయనగర రీజినల్ ఫారెస్ట్ డివిజినల్, రీజినల్ ఫారెస్ట్ జోన్, సోషల్ ఫారెస్ట్ జోన్ హొసపేటె సహకారంతో జంబునాథహళ్లి కొండ సమీపంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణాన్ని ధ్వంసం చేయకుండా కాపాడుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. పర్యావరణం నుంచి మనకు ఆక్సిజన్ అందుతుందన్నారు. పర్యావరణం బాగుంటేనే మనందరం బతకగలం అన్నారు. మెరుగైన వాతావరణాన్ని సృష్టించేందుకు అందరి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఏడాదికి కనీసం 5 మొక్కలు నాటాలని సూచించారు. బళ్లారి సోషల్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ జే.రవి ప్రారంభోపన్యాసం చేసిన తర్వాత తన తల్లి పేరిట మొక్కలు నాటారు. పలువురు విద్యార్థులు పర్యావరణానికి సంబంధించిన ప్రశ్నలను అధికారులను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్టు

కోలారు: తాలూకాలోని గట్టహళ్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు దాడి జరిపి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. ఆ సమయంలో వారి వద్ద నుంచి రూ.9500 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పోకిరీలపై ఉక్కుపాదం మోపుతాం

హుబ్లీ: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంఘవిద్రోహ శక్తులు, ప్రజల శాంతికి, ప్రశాంతతకు భంగం కలిగించే పోకిరీలపై కట్టుదిట్టమైన కఠిన చర్యలు తీసుకుంటామని హుబ్లీ ధార్వాడ నూతన కమిషనర్ ఎన్.శశికుమార్ బాధ్యులను ట్టిగా హెచ్చరించారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రౌడీలను అణచివేసేందుకు త్వరలోనే రౌడీలకు పరేడ్ నిర్వహిస్తామన్నారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన అన్ని నేరాలు, ఘోరాల గురించి, త్వరలో అన్ని పోలీస్ స్టేషన్లకు ఘటనలు జరిగిన సూక్ష్మ ప్రాంతాలను పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకుంటానన్నారు. నేరాలను అడ్డుకునేందుకు ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు. చాకు, ఇతర మారణాయుధాలను జల్సా కోసం వాడేవారు, రీల్స్ చేసే వారు ఇకపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లల రక్షణకు తగినంత ప్రాధాన్యతను ఇస్తామన్నారు. జంట నగరాల్లో ఆడపిల్లల రక్షణకు ఏర్పాటు చేసిన చెన్నమ్మ సేనను మరింతగా బలోపేతం చేస్తామన్నారు. ప్రజలు కూడా ఆడపిల్లల రక్షణకు సదా ముందుండాలన్నారు. అలాగే ఆడ పిల్లలు తమపై జరిగే దాడులు, ఇతర దౌర్జన్యాలపై ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలన్నారు. అత్యవసర సమయంలో 112కు ఫోన్ చేయాలని ఆయన మహిళలకు విజ్ఞప్తి చేశారు.

కరుణించిన వరుణుడు

- కల్యాణ కర్ణాటక జిల్లాల్లో భారీ వర్షాలు
- నగరాల్లో రోడ్లు, లోతట్టు జలమయం



బళ్లారిలో రోడ్డుపై పారుతున్న వాన నీరు



వానలో తడుస్తూ ఇంటికి వెళుతున్న విద్యార్థులు



రాయచూరులో రహదారిపై నిలిచిన వర్షం నీరు

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఒక గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. ఉన్నఫళంగా మేఘాలు కమ్ముకొని వర్షం రావడంతో రోడ్లల్లో నీరు పెద్ద ఎత్తున ప్రవహించాయి. పాఠశాల, కళాశాలలు వదిలే సమయానికి వర్షం రావడంతో విద్యార్థులు సైకిళ్లలో, నడుచుకుంటూ తడుస్తూనే ఇళ్లకు చేరుకున్నారు. కాగా నగరంలో యథావిధిగా లోతట్టు ప్రాంతాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. తహసీల్దార్ కార్యాలయ ఆవరణ నీటితో నిండిపోగా పలు రోడ్లు బురదమయంగా మారాయి.

రాయచూరులో..

రాయచూరు రూరల్: నగరంలో శుక్రవారం జడివాన కురువడంతో రహదారులు బురద గుంటలుగా మారాయి. బైరూన్‌కిల్లా, నీరు బావికుంట, మున్నూరువాడి, గాంధీ చౌక్, మహవీర్ చౌక్, బంగికుంట, కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చొరబడ్డాయి.



గొడుగు సాయంతో వెళుతున్న పాదచారి

భారీ వర్షానికి జలమయంగా రోడ్లు

హొసపేటె: నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న రహదార్లులో మొత్తం నీరు నిలిచి జలమయంగా మారాయి. వర్షంతో పట్టణంలోని రోడ్లు, కాలువలు పొంగిపొర్లుతుండటంతో వాహనదార్లకు, పాదచారులకు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కాలేజీ, టీబీ డ్యాం రోడ్లు, కూరగాయాల మార్కెట్ రోడ్డు, అంబేడ్కర్ నగర్, పటేల్ నగర్, ఇందిరా నగర్, అమరావతి, నెహ్రూ కాలనీ, రాణిపేట్ తదితర ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి జలమయంగా మారాయి. ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు అడుగులకు పైగా నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఇరువైపులా వాహన సంచారానికి తీవ్ర ఇబ్బందిగా మారింది.



హొసపేటెలో రోడ్డులో నిలిచిన వర్షం నీరు



పొంగి ప్రవహిస్తున్న మురుగు కాలువ నీరు



హొసపేటెలో రోడ్డుపై నిలిచిన వాన నీటిలో వెళుతున్న వాహనాలు